PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 52 | విజయవాడ, శుక్రవారం 22 సెప్టెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 22 September 2023 | Rs



మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా విజయవాడలో నిర్వహించిన 2కె రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత

వార్త 3లో




రాజ్యసభలో ఏకగ్రీవం

- మూజువాణి ఓటుతో మహిళాబిల్లుకు ఆమోదం
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ప్రతిపక్షాల విమర్శలు
- ముగిసిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ : ఎట్టకేలకు మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టరూపం దాల్చనుంది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లును రాజ్యసభ గురువారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇక రాష్ట్రపతి ఆమోదం మిగిలింది. అది లాంఛనమే కావడంతో బిల్లు త్వరలోనే చట్టంగా మారనుంది. అయితే, దీని ఫలాలు అందడానికి మాత్రం మహిళాలోకం 2029 వరకు నిరీక్షించాల్సిఉంది. జన గణన, నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తరువాతే రిజర్వేషన్లు అమలులోకి వస్తాయంటూ బిల్లులోకి పేర్కొనడమే దీనికి కారణం. బిల్లు ఆమోదం పొందిన కాసేపటికే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ముగిసినట్టు ప్రకటన వెలువడింది. ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు సభాధిపతులు రాత్రి 12 గంటల ప్రాంతంలో ప్రకటించారు. మరోవైపు రాజ్యసభలో గురువారం జరిగిన చర్చలో పాల్గొన్న ప్రతిపక్షాల సభ్యులు బిల్లు విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఒబిసి మహిళలకు ప్రత్యేక కోటా ఇవ్వకపోవడాన్ని కూడా పలువురు సభ్యులు తప్పుపట్టారు. రాజ్యసభలోసుదీర్ఘంగా దాదాపు పది గంటల పాటు చర్చ కొనసాగింది. సందేహాలకు సమాధానమిచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రతిపక్ష సభ్యుల విమర్శలను తోసిపుచ్చారు. ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు. అనంతరం జరిగిన ఓటింగ్‌లో సభ్యులందరూ ఏకగ్రీవంగా బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. లోక్‌సభలో మాన్యువల్ పద్దతిలో ఓటింగ్ నిర్వహించగా, రాజ్యసభలో ఎలక్ట్రానిక్ డివైస్ ద్వారా ఓటింగ్ నిర్వహించారు. గురువారం జరిగిన చర్చ సందర్భంగా అధ్యక్ష స్థానంలో అధికసమయం మహిళలే కనిపించారు. సభ ప్రారంభం మిగతా 7లో

ఓటమి భయంతోనే మహిళా బిల్లు



- మోడీ సర్కారు తీరుపై ఎలమరం కరీం విమర్శ
- వెంటనే అమలు చేయాలి
- బిల్లుకు సిపిఎం సంపూర్ణ మద్దతు

7

సవాళ్లు.. సస్పెన్షన్లు

చంద్రబాబు అరెస్టుపై వాయిదా తీర్మానం ఉభయ సభల్లోనూ తిరస్కరణ

- తొలిరోజే టిడిపి సభ్యులపై వేటు
- విరిగిన స్పీకర్ మైకు, పగిలిన గ్లాసు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు సవాళ్లు, సస్పెన్షన్లతో ప్రారంభమైనాయి. తొలిరోజైన గురువారం నాడే టిడిపి సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. చంద్రబాబు అరెస్టుపై ఉభయ సభల్లోనూ టిడిపి సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలు తిరస్కరణకు గురైనాయి. దీంతో వాటిపై చర్చకు టిడిపి సభ్యులు పట్టుబట్టినారు. శాసనసభలో స్పీకర్ పోడియం చుట్టుముట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో వైసిపి రెబల్ సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడిపి సభ్యులు అనగాని సత్యప్రసాదు స్పీకర్‌పోడియంపైకి వెళ్లారు. స్పీకర్ మైక్‌ను పీకేశారు. టేబుల్‌పై ఉన్న గ్లాసు కూడా పలిగింది. వారిద్దరినీ సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ రూలింగు ఇచ్చారు. ఆ సమయంలోనే వైసిపి సభ్యులకు, బాలకృష్ణకు మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాలకృష్ణ చూస్తుండగా వైసిపి సభ్యులు తొడకొట్టారు. దీనికి స్పందించిన బాలకృష్ణ మీసం తిప్పారు. అదే సమయంలో రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు 'రా.. చూసుకుందాం' అనడం వినిపించింది. ఈ దశలోసభలో ఉన్న టిడిపి సభ్యులందరిని ఒక్కరోజు సస్పెండ్ చేశారు.

15వ అసెంబ్లీ 11వ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత చంద్రబాబు అరెస్టు అక్రమమని, దీనిపై చర్చించాలని కోరుతూ అసెంబ్లీలోనూ, మండలిలోనూ ప్రతిపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. వీటిని స్పీకర్, మండలి ఛైర్మన్ తిరస్కరించారు. ఈ సమయంలో అసెంబ్లీలో టిడిపి సభ్యులు, వారితోపాటు వైసిపి రెబల్ సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు సైకో సిఎం పోవాలంటూ నినాదాలు చేశారు. మరోవైపు అధికార పక్ష సభ్యులు మధుసూదనరెడ్డి, నాగార్జున తదితరులు కూడా ప్రతిగా కేకలు వేశారు. అప్పటికే టిడిపి సభ్యులు పోడియంపైకెళ్లి స్పీకర్ ఛైర్‌ను చుట్టుముట్టారు. కొద్దిసేపు నినాదాలతో అసెంబ్లీ గందరగోళంగా మారింది. నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలోనే టిడిపి సభ్యులు వారి చేతుల్లో ఉన్న కాగితాలు చించి స్పీకర్‌పై వేశారు.



చంద్రబాబు అరెస్టుపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ శాసనసభాపతి పోడియాన్ని చుట్టుముట్టిన టిడిపి ఎమ్మెల్యేలు

టిడిపి సభ్యుల తీరు బాలేదు... బుగ్గన

అనంతరం శాసనసభావ్యవహారాలశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి సభ్యుల తీరు బాగోలేదని అన్నారు. ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయాలని ప్రతిపాదిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దీంతో స్పీకర్ సభ్యులు సస్పెండ్ చేస్తున్నట్లు రూలింగు ఇవ్వడంతో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేసుకుంటూ బయటకు వెళ్లిపోయారు. అసెంబ్లీలో మూడంచల్లో మార్షల్స్‌ను ఏర్పాటు చేశారు. స్పీకర్ పోడియం వద్దకు రాకుండా రెండు వరుసల్లోనూ, అధికారపక్ష సభ్యులవైపు వెళ్లకుండా ఒక వరుసలోనూ మార్షల్స్‌ను ఏర్పాటు చేశారు.

మండలిలోనూ...

చంద్రబాబు అరెస్టుపై మండలిలోనూ టిడిపి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని పట్టుబట్టారు. ఛైర్మన్ పోడియం ముందుకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఛైర్మన్ కుర్చీ వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. దీంతో ఛైర్మన్ పలుసార్లు వాయిదా వేశారు.

చర్చకు కోరుతూ సభ్యులిచ్చిన వాయిదా తీర్మానం తగిన ఫార్మాట్లో రాలేదని, వస్తే పరిశీలిస్తామని చెప్పిన ఛైర్మన్ దానిని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో టిడిపి సభ్యులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

సిఎం ఛాంబర్ వరకూ ప్రదర్శన

సస్పెన్షన్ అనంతరం టిడిపి సభ్యులు లాబీల్లో ప్రదర్శనగా టిడిపి సభ్యులు లాబీల్లో ప్రదర్శన నిర్వహించారు. సిఎం ఛాంబర్ వరకూ ఈ ప్రదర్శన సాగింది. అక్కడ వరకూ అనుమతించిన మార్షల్స్ అక్కడ వారిని అడ్డుకున్నారు. సైకో సిఎం పోవాలంటూ టిడిపి సభ్యులు లాబీల్లో పెద్దఎత్తున నినాదాలు చేశారు. (మరిన్ని వార్తలు 2లో)

బాలకృష్ణ X వైసిపి

టిడపి సభ్యులు పోడియం పైకి వెళ్లి నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో హిందుపురం ఎంఎల్‌ఏ బాలకృష్ణకు, వైసిపి సభ్యులకు మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శాసనసభాపక్ష ఉపనేత అచ్చెన్నాయుడుతో కలిసి బాలకృష్ణ పోడియం ముందు నిలబడి నిరసన వ్యక్తం చేస్తుండగా, వైసిపి సభ్యులు తొడకొట్టి సవాలు చేశారు. దీంతో బాలకృష్ణ మీసంపై చేయివేశారు. దీనికి అధికారపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను అవమానించారని, రూలింగ్ ఇవ్వాలని పట్టుబట్టారు. బాలకృష్ణకు, టిడిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దశలో జోక్యం చేసుకున్న స్పీకర్ తమ్మినేని సీతారాం బాలకృష్ణ మీసం మెలేశాడని, ఇది సభా సాంప్రదాయాలకు విరుద్ధమని ప్రకటించారు. అయితే, తొలి తప్పుగా భావించి హెచ్చరిస్తున్నట్లు చెప్పారు. స్పీకర్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో వైసిపి సభ్యులు టిడిపి సభ్యుల వద్దకు దూసుకొచ్చేందుకు ప్రయత్నించారు. మార్షల్స్ వారిని అడ్డుకున్నారు. అప్పటికే మంత్రి అంబటి రాంబాబు జోక్యం చేసుకుని మీసం మేలేస్తున్నారేంటి రా చూసుకుందాం... అంటూ కేకలు వేశారు.వైసిపి సభ్యులు టిడిపి సభ్యుల మీదకు వస్తుండటంతో మార్షల్స్ పెద్దఎత్తున చుట్టుముట్టి టిడిపి సభ్యులకు రక్షణగా నిలబడ్డారు. స్పీకర్ కూడా అధికారపక్ష సభ్యులను వారించారు. దీనిని టిడిపి సభ్యుడు పయ్యావుల కేశవ్ సెల్‌ఫోన్లో చిత్రీకరిస్తుండటంతో మంత్రి రోజా స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు.

విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ

27న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

- వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు
- నిరసనలపై ప్రభుత్వ నిర్బంధం తగదు



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీల పెంపుదలను, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా గురువారం నాడు వామపక్ష పార్టీల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, నాయకులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, మంతెన సీతారాం, సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, వనజ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నుంచి కె పొలారి, రామకృష్ణ, లిబరేషన్ నాయకులు హరినాథ్, ఎంసిపిఐయు నుంచి ఖాదర్ బాషా, ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్, ఎఐటియుసి నాయకులు సాంబశివరావుతోపాటు విద్యార్థి, యువజన, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ ఛార్జీలపై సిహెచ్ బాబూరావు, నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ముప్పాళ్ల నాగేశ్వరరావు పెట్టిన తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీల పెంపుతో రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. ప్రభుత్వం విధిస్తున్న కోతలతో ప్రజలపై మోయలేని భారం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు పెద్ద కుంభకోణమని, బిగించడాన్ని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ ఎనర్జీ పేరుతో భూములు లాగేసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. వారిని భూమిలేని వారిని చేస్తున్నారని, ఇటువంటి చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సోలార్ ఎనర్జీలో ఎకరాకు రూ.ఎనిమిది లక్షలు వస్తుందని, రైతుకు మాత్రం రూ.30 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. జగన్ మిగతా 7లో

బాబు కస్టడీపై నేడు తీర్పు

ప్రజాశక్తి – అమరావతి



టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కస్టడికి ఇవ్వాలంటూ సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు (శుక్రవారం) ఎసిబి కోర్టు తీర్పు ఇవ్వనుంది. గురువారం నాడు కూడా బాబు కస్టడీ అంశంపై ఎసిబి కోర్టులో వాదనలు కొనసాగాయి. రిమాండ్ కొట్టివేయాలంటూ హైకోర్టులో చంద్రబాబు వేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పు పెండింగ్‌లో ఉండటంతో 'కస్టడీ'పై ఎసిబి న్యాయమూర్తి కూడా తీర్పు వెల్లడిని వాయిదా వేశారు. క్వాష్ పిటిషన్ హైకోర్టులో లిస్ట్ కాకపోతే శుక్రవారం తీర్పు ప్రకటిస్తామని చెప్పారు. అయితే, శుక్రవారం నాటి హైకోర్టు కార్యక్రమాల్లో క్వాష్ పిటిషన్ లేనట్టు సమాచారం. దీంతో శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలోనే ఎసిబి కోర్టు న్యాయమూర్తి కస్టడి పిటిషన్ తీర్పు ప్రకటించే అవకాశం ఉంది.

హామీ నిలబెట్టుకోవడం ఇలానా?

- 5 రాష్ట్రాల్లో చేసిందిమీరు చేయలేరా?
- జిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ మండలిలో వాయిదా తీర్మానం
- తిరస్కరించిన ఛైర్మన్
- పిడిఎఫ్ సభ్యుల నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమల్లో ఉన్న సిపిఎస్‌ను రద్దు చేయాలని, జిపిఎస్ ప్రతిపాదన ఉపసంహరించుకుని ఒపిఎస్‌ను అమలు చేసి ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శాసనమండలిలో వాయిదా తీర్మానం ఇచ్చారు. దీనికి ఛైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తిరస్కరించారు. తీర్మానంపై చర్చకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పట్టుబట్టారు. మరో రూపంలో ఈ అంశంపై చర్చిద్దామని ఛైర్మన్ చెప్పారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి సిపిఎస్ స్థానంలో ఒపిఎస్ అమలు చేయాలని లక్ష్మణరావు, సాబ్జీ డిమాండ్ చేశారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్ పెట్టాలన్న ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నామన్నారు. మూడు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. వాయిదా తీర్మానం తిరస్కరించినా వేరే రూపంలో చర్చిస్తామని ఛైర్మన్ పేర్కొన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఒపిఎస్‌ను తిరిగి అమలు చేస్తున్నాయని తెలిపారు. అనంతరం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. పాదయాత్రతోపాటు ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని సిఎం జగన్ విస్మరించడం దారుణమన్నారు. పేరు మార్పు ఏదైనా జిపిఎస్ కూడా సిపిఎస్‌కు కొనసాగింపుగానే పరిగణిస్తామన్నారు. దీనివల్ల ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం అనుకున్న పద్ధతుల్లో ముందుకు వెళ్తుందని ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ పట్టించుకోకపోవడం శోచనీయం మిగతా 2లో



మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న ఐవి, చిత్రంలో షేక్ సాబ్జీ, లక్ష్మణరావు, రఘువర్మ

కెనడా పౌరులకు వీసాలు నిలిపివేత..



- భారత్ ప్రతిచర్య

న్యూఢిల్లీ, టొరంటో : ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు ఇండియా కారణం అంటూ కెనడా ప్రధాని జస్టిస్ ట్రుడో ఆ దేశ పార్లమెంట్‌లో ఆరోపించడంతోపాటు సీనియర్ భారత దౌత్యవేత్తను బహిష్కరించిన నేపథ్యంలో భారతదేశం ప్రతిచర్యలకు దిగింది. కెనడియన్ సీనియర్ దౌత్యవేత్తను ఐదు రోజుల్లో ఇండియా వదిలి వెళ్లాలని ఇప్పటికే ఆదేశించింది. కెనడా పౌరులకు భారతీయ వీసాలను గురువారం సస్పెండ్ చేసింది. కెనడియన్ల వీసా దరఖాస్తులను ప్రాథమికంగా పరిశీలించేందుకు ఏర్పాటైన ప్రైవేటు ఏజెన్సీ తన వెబ్ సైట్ లో ఈ విషయాన్ని ప్రకటించింది. నిర్వహణ కారణాల వల్ల సెప్టెంబర్ 21 నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు భారత వీసాలను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొంది.

కెనడాలో మరో ఖలిస్తానీ ఉగ్రవాది హత్య

కెనడాలో మరో ఖలిస్తానీ ఉగ్రవాది సుఖా దున్‌కె హత్యకు గురయ్యాడు. విన్నిపెగ్‌లో బుధవారం ప్రత్యర్థి గ్యాంగ్ జరిపిన దాడిలో అతను మరణించినట్లు ఎన్ఐఎ వర్గాలు తెలిపాయి. తామే సుఖా దున్‌కెను హత్య చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ ముఠా ప్రకటించింది.

కెనడా ఎలాంటి ఆధారాలూ సమర్పించలేదు : భారత్

ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యోదంతంలో ఎలాంటి ఆధారాలను కెనడా సమర్పించలేదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం పేర్కొంది. తమకు ఎలాంటి నిర్దిష్ట సమాచారం అందించినా పరిశీలించేందుకు సిద్ధమని చెప్పామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందం బాగ్చి తెలిపారు. కెనడా భూభాగం నుంచి వ్యక్తుల నేర కార్యకలాపాలకు సంబంధించి తమవైపు నుంచి నిర్దిష్ట సమాచారాన్ని కెనడాతో పంచుకున్నామని చెప్పారు. రాజకీయ కోణంలోనే కెనడా ఈ ఆరోపణలు చేసిందని బాగ్చి వ్యాఖ్యానించారు.

ఖలిస్తానీ ఉగ్రసంస్థలతో పాక్ ఐఎస్ఐ రహస్య సమావేశం..

పాకిస్తాన్ గూఢచార సంస్థ 'ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)' కెనడాలోని వాంకోవర్‌లో ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థలు, కీలక వ్యక్తులతో రహస్యంగా ఐదురోజుల క్రితం సమావేశమైనట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి సిక్ ఫర్ జస్టిస్ (ఎస్‌ఎఫ్‌జె) చీఫ్, ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూతో సహా ఖలిస్తానీ సంస్థల అధినేతలు హాజరయ్యారని నిఘా వర్గాలు తెలిపాయి.

డ్యాన్స్ చేస్తూ యువకుడు మృతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



వినాయక చవితి సంబరాల్లో డ్యాన్స్ చేస్తూ ఓ యువకుడు గుండె పోటుతో అక్కడి కక్కడే మృతి చెందారు. ఈ సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరం పట్టణం మారుతీనగర్‌లో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అదే ప్రాంతానికి చెందిన ప్రసాద్ (25) వినాయకుని విగ్రహం ముందు డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రసాద్ భవన నిర్మాణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయనకు భార్య, రెండు నెలల కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒపిఎస్ పునరుద్ధరించాల్సిందే

- ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమం
- హిందూపురం, శ్రీకాకుళం నుంచి ప్రారంభమైన యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార యాత్రలు



హిందూపురంలో ప్రచారయాత్రను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-హిందూపురం,ఇచ్ఛాపురం

ప్రభుత్వ విద్య పరిరక్షణతో పాటు ఒపిఎస్‌ను సాధించుకోవడమే లక్ష్యంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఆ సంఘం నాయకులు తెలిపారు. జిపిఎస్ పేరుతో ఉద్యోగులకు నష్టం చేకూర్చే మరో పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మండిపడ్డారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విజయవాడకు గురువారం బైక్‌ర్యాలీలు చేపట్టారు. ఈ రెండు యాత్రలు అక్టోబర్ ఒకటిన విజయవాడకు చేరుకుంటాయి. యాత్రలను హిందూపురంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఇచ్ఛాపురంలో రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 'ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుందాం' అన్న నినాదంతో జాతా కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం తీసుకువస్తోన్న నూతన విద్యా విధానంతో ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల అనంతరం జిపిఎస్ పేరుతో ఉద్యోగులకు నష్టం చేకూర్చే మరో పెన్షన్ విధానం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. నేటి విద్యారంగ పరిస్థితిపై అక్టోబర్ 1న విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా మేధావులతో చర్చ జరుగుతుందని చెప్పారు. 26 జిల్లాల మీదుగా ఈ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఇచ్ఛాపురంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలు మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని విమర్శించారు. అంతకుముందు యుటిఎఫ్ పతాకాన్ని పూర్వ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు ఆవిష్కరించారు.

సభ 5 రోజుల నిర్వహణకు నిర్ణయం

- బిఎసి సమావేశానికి టిడిపి దూరం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ సమావేశాలను ఐదు రోజులపాటు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) సమావేశం నిర్ణయించింది. స్పీకరు తమ్మినేని సీతారాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జోగి రమేష్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. శాసనసభ సమావేశాలు ఐదు రోజులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 21, 22, 25, 26, 27 తేదీల్లో నిర్వహించాలని, శని, ఆదివారాలు సమావేశాలకు సెలవుగా ప్రకటించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసు పెట్టారని నిరసిస్తూ.. బిఎసి సమావేశానికి టిడిపి హాజరుకాలేదు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

భౌతిక దాడికి దిగుతారేమో?

- టిడిఎల్‌పిలో ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో వైసిపి సభ్యుల తీరు చూస్తుంటే తమపై భౌతిక దాడులకు దిగే సూచనలు కన్పిస్తున్నాయని టిడిపి శాసనసభాపక్ష సమావేశం (టిడిఎల్‌పి)లో పలువురు నేతలు అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ, యనమల రామకృష్ణుడు ఆధ్వర్యాన టిడిపి కార్యాలయంలో గురువారం టిడిఎల్‌పి సమావేశం జరిగింది. వైసిపి సభ్యులు ఎంత దుందుడుకుగా వ్యవహరించినా వెనక్కు తగ్గొద్దని బాలకృష్ణ అన్నారు. చంద్రబాబు అరెస్టు అక్రమం అనే అంశంపై శుక్రవారం కూడా సభలో, మండలిలో పట్టుబట్టాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు. నిష్పాక్షపాతంగా వ్యవహరించాల్సిన శాసనసభ స్పీకరు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కూడా ప్రస్తావించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. టిడిపి సభ్యులను యూజ్‌లెస్ ఫెలోస్ అనడం, వైసిపి సభ్యులను తమ వాళ్లంటూ స్పీకరు సంబోధించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ అంశంపై శాసనసభలో వైసిపి శుక్రవారం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాము కూడా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చేందుకు అనుమతినివ్వాలని స్పీకరును కోరాలని నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ సభలో అనుమతించకపోతే సభ బయటైనా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి ర్యాలీగా టిడిపి సభ్యులు

అసెంబ్లీ సమావేశాలకు టిడిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు గురువారం ర్యాలీగా చేరుకున్నారు. సచివాలయం వద్దనున్న అగ్నిమాపక కార్యాలయం నుంచి ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. 'చంద్రబాబుపై కేసులు ఎత్తివేయాలి' 'జగన్ ప్రైవేట్ సైన్యంలా సిఐడి' అంటూ నినాదాలు చేశారు. అంతకముందు వెంకటపాలెంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో వైసిపి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి కూడా పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో దంపతుల హత్య

ప్రజాశక్తి - ఘంటసాల

కృష్ణాజిల్లాలో గురువారం దారుణం చోటు చేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో పట్టపగలే దంపతులను దుండగులు నరికి చంపారు. మృతులను మొవ్వ మండలం అయ్యంకి గ్రామానికి చెందిన వీరకృష్ణ, వరలక్ష్మిగా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు.. వరలక్ష్మిని నడిరోడ్డుపై చంపగా, ఆమె భర్తను పంచాయతీ కార్యాలయం వద్ద హత్య చేశారు. . పాత కక్షలు నేపథ్యంలోనే ఈ హత్యలు జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలిసింది. వీరంకి పూర్ణచంద్రరావుకు తమ్ముడు వీరకృష్ణతో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ గొడవల వివాదంలో 2012లో పూర్ణచంద్రరావు హత్యకు గురయ్యాడు. తమ తండ్రిని హతమార్చిన వీరకృష్ణపై కక్షకట్టిన పూర్ణచంద్రరావు కుమారులే ఈ హత్యలు చేసినట్లు పలువురు భావిస్తున్నారు.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్య గురైన దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతవాసులు భయాందోళనలకు గురయ్యారు. వీరంకి గణేష్, అతని ఇద్దరు సోదరులే ఈ దారుణానికి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణదారుల చేతుల్లో ఎస్‌టిల భూములు

- కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు
- జీరో అవర్‌లో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆక్రమణదారుల చేతుల్లో ఎస్‌టిలు ముఖ్యంగా యానాదులకు సంబంధించిన భూములు ఉన్నాయని, వీరికి కొందరు రెవెన్యూ అధికారులు కొమ్ముకాస్తున్నారని కందుకూరు వైసిపి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి జీరో అవర్‌లో గురువారం శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. కందుకూరు నియోజకవర్గంలో అనేక సంవత్సరాల క్రితం ప్రభుత్వం యానాదులకు భూమిలిచ్చిందని, కొందరు భుక్తి కోసం వలసలు వెళ్లడంతో వారు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి ఉందని, అటువంటి వారి భూములను గుర్తించి ఆక్రమించిన వారి చేతుల్లో భూములను రెవెన్యూ అధికారులు కొమ్ముకాసి రికార్డుల్లో నమోదు చేశారని అన్నారు. అటువంటి భూములకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. రెవెన్యూకు సంబంధించి నిర్దిష్ట సూచనలను కింది స్థాయి ఉద్యోగులకు ఇప్పటి వరకు అందలేదన్నారు. భూముల రీ సర్వేకు సంబంధించిన మార్గదర్శకాల్లో రద్దు చేస్తున్నట్లు, లేక అవసరం లేదని కూడా ఉదహరించకపోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని మహీధర్‌రెడ్డి శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. నిషేధిత జాబితాలో పెట్టిన వాగులు, వంకలు, కుంటలు, చెరువుల భూములను రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగం సబ్ డివిజన్ చేసి పట్టాలు ఇచ్చారని, అటువంటి వాటిపై ప్రభుత్వం ఏమి చేయబోతుందనే విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. జగనన్న భూరక్ష-శాశ్వత భూహక్కు విజయవంతం కావాలంటే రెవెన్యూ సిబ్బందిని క్షేత్రస్థాయిలో భర్తీ చేయాలని, సర్వేయర్లను అవసరమైన మేర పెట్టకపోతే తప్పులు దొర్లే అవకాశముందని అన్నారు. వెంకటాద్రిపాలెంలో సర్వే నెంబర్ 116లో 999 ఎకరాలు భూమిని 300 నుంచి 400 మంది రైతులు వందేళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారని, వారికి శాశ్వత హక్కులు కల్పించాలని ప్రభుత్వానికి మహీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

నెల్లూరు జిల్లా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్స్యకారులు అధికంగా ఉండే తీరప్రాంతం, రామాయపట్నం వెళ్లే తుమ్మలపెంట ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందని, కాంట్రాక్టరు పనులు నిలిపేయడంతో ఇబ్బందిగా మారిందని శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు.

బొబ్బిలి ఎమ్మెల్యే చిన అప్పలనాయుడు మాట్లాడుతూ.. బొబ్బిలిలో 50 పడకల ఆస్పత్రిని ప్రభుత్వం ఏర్పాటుచేసినప్పటికీ 35 పడకల ఆస్పత్రికి ఉన్న సౌకర్యాలు కూడా లేవని సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పెషలిస్టులు కూర్చోవడానికైనా ఇబ్బందిగా ఉందన్నారు. తక్షణమే సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. రజకులను కొందరు కులం పేరుతో అవమానపరుస్తూ మాట్లాడారని, అటువంటి వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు ఓవరాల్‌గా సమాధానం చెబుతున్నారని, అలా కాకుండా లిఖిత పూర్వకంగా సమాధానాలిప్పించాలని స్పీకరుకు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు వచ్చిన కళింగ వైశ్య, బుడగ జంగాలకు కుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ప్రభుత్వం తక్షణమే వారికి సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. కోడుమూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని, పట్టణంలో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు.

ఫోన్లపై ఆంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



శాసనసభ సమావేశాలు జరిగే సమయంలో సెల్‌ఫోన్‌లు, కెమెరాలను సభ్యులు సభలోకి తీసుకురాకుండా బాధ్యత గల వ్యక్తి వద్ద ఎంట్రన్స్‌లోనే డిపాజిట్ చేసుకునే సిస్టమ్‌ను తేవాలనుకుంటున్నామని శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం వెల్లడించారు. ప్రతిపక్ష సభ్యులు సభలో ఆందోళన చేస్తున్న సమయంలో వీడియోలు తీస్తున్నారని, సభ్యులు సెల్‌ఫోన్లు లోపలికి తీసుకురావచ్చా? లేదా? ఒక వేళ తెస్తే వీడియోలు తీయొచ్చా? అనే అంశాలపై రూలింగ్ ఇవ్వాలని స్పీకరుకు మంత్రి బొత్స సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. రూల్స్ ఆఫ్ కండెక్ట్ బిజినెస్‌లో కూడా సభలోకి సెల్స్ తీసుకురాకూడదని స్పష్టంగా ఉందని స్పీకరు తెలిపారు. సభ్యులకిచ్చే బులెటెన్‌లో కూడా ఈ అంశాన్ని పేర్కొంటే సభ్యులందరికీ ఈ విషయం తెలుస్తుందని మంత్రి బొత్స పేర్కొన్నారు. గురువారం సభలో వీడియోలు తీసిన వారిని సస్పెండ్ చేశామని, కమిటీకి సిఫార్సు చేస్తామని స్పీకరు తెలిపారు.

టిడిపితో జతకట్టిన వైసిపి బహిష్కృత ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో





శాసనమండలి ఎన్నికల సందర్భంగా పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించారనే ఆరోపణలతో సస్పెండైన వైసిపికి చెందిన నలుగురు శాసనసభ్యుల్లో ఇద్దరు సభ్యులు టిడిపి సభ్యులతో కలిసి అసెంబ్లీలో జరిగిన నిరసనలో పాల్గొన్నారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలవగానే చంద్రబాబు అరెస్టు, స్కిల్‌డెవలప్‌మెంట్ అంశంలో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను సభలో ఇచ్చేందుకు అనుమతించాలని టిడిపి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకరు తమ్మినేని సీతారాం తిరస్కరించారు. దీంతో టిడిపి సభ్యులు ప్లకార్డులు పట్టుకుని స్పీకరు పోడియంపైకి ఎక్కి నిరసనలు తెలిపారు. ఈ సమావేశాలకు వైసిపి నుంచి సస్పెండైన నలుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఆనం నారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వారికి కేటాయించిన సీట్లలోనే కూర్చోగా, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మాత్రం టిడిపి సభ్యులతో కలిసి పోడియంపైకి ఎక్కి నిరసనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పేపర్లను చింపి స్పీకరుపైకి విసిరారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మైకును విరిచేశారనే కారణంతో టిడిపి సభ్యులు అనగాని సత్యప్రసాద్‌తో కలిపి ఈ సెషన్‌కు మొత్తం సస్పెండ్ చేయగా, ఉండవల్లి శ్రీదేవిని టిడిపి సభ్యులతో కలిపి ఒకరోజు సస్పెండ్ చేశారు.

రెచ్చగొట్టిన మంత్రిపై చర్యలు తీసుకోరా?

- స్పీకరు తీరు దారుణం
- 17 మందికి సమాధానం చెప్పలేకే సస్పెన్షన్
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



శాసనసభలో స్పీకరు వ్యవహరించిన తీరు చాలా దారుణంగా ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. శాసనసభ సాక్షిగా ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వాలని స్పీకరే ప్రయత్నించారని అన్నారు. స్పీకరు స్థానంలో ఉన్న వ్యక్తికి అధికార పార్టీ శాసనసభ్యుల వెకిలి చేష్టలు, వెర్రిమొర్రివేషాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. టిడిపి ఎమ్మెల్యేలు శాసనసభలో సస్పెండైన తరువాత అసెంబ్లీ ప్రాంగణంలో కొంతసేపు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుంచి సచివాలయం వద్ద ఉన్న పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టి వెలగపూడిలో గురువారం మీడియాతో మాట్లాడారు. ఏం తప్పు చేశామని సభ నుంచి తమను సస్పెండ్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. మంత్రి రెచ్చగొడితే అతనిపై ఎలాంటి చర్యలు లేవని, కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు బూతులు తిట్టినా స్పీకరు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ 17 మంది సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేక ప్రభుత్వం 200 మంది మార్షల్స్‌తో సభ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. చంద్రబాబును అన్యాయంగా జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇదే అంశాన్ని తాము సభలో లేవనెత్తితే సమాధానం చెప్పలేక చర్చిస్తామంటూ కట్టుకథలు చెప్పారని విమర్శించారు. చంద్రబాబు భద్రతపై లోకేష్ అన్నది నిజమే అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జైలులో జరుగుతున్న పరిణామాలు, అక్కడి వసతులు, భద్రతపై తాము తొలి నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు.

మంత్రి అంబటి తొడకొడితేనే నేనూ కొట్టాను : బాలకృష్ణ

మంత్రి అంబటి రాంబాబు తనకు వేలు చూపించి మీసం మెలేసి తొడకొట్టారని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. మంత్రి అతిగా స్పందించాకే తాను మీసం తిప్పి తొడకొట్టానని వివరించారు. తన వృత్తిని మంత్రి అవమానించారని అన్నారు. రాష్ట్రంలో నియంత పరిపాలన జరుగుతుందని, ఎక్కడా అభివృద్ధి లేదని విమర్శించారు. విశాఖలో జూనియర్ ఆర్టిస్టులతో పెట్టుబడుల సదస్సు నిర్వహించారని, ఈ సదస్సులో కుదిరిన ఎంఒయులను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. శాసనసభ అంటే వైసిపి కార్యాలయం అనే భావనలో ఉన్నారని పయ్యావుల కేశవ్ విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు అసెంబ్లీకి, బహిరంగ సభకు తేడా తెలియకపోతే ఎలా? అని ప్రశ్నించారు. సభలో ఎలా వ్యవహరించాలో తెలియదని, ఎవరైనా చెబితే అభద్రతాభావంతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడతారని ఆగ్రహించారు. వైసిపి ఎమ్మెల్యేలు గూండాల్లా ప్రవర్తించారని నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 మంది మార్షల్స్‌తో టిడిపి సభ్యుల్ని అడ్డుకోవాలని చూశారని, ఇది బ్లాక్ డే అని అన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు, పాలకులు చేస్తున్న నిరాధార ఆరోపణలపై తాము వాస్తవాలతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చేందుకు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టామన్నారు. ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, డోలా వీరాంజనేయస్వామి, బుచ్చయ్య చౌదరి, గద్దె రామ్మోహనరావు, గొట్టిపాటి రవి, బెందాళం అశోక్, ఆదిరెడ్డి భవానీ, మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

35,551 మందికి వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో 35,551 మందికి వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫాను అమలు చేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు వి కళావతి, కె శ్రీదేవి, రెడ్డి శాంతి, దాసరి సుధ అడిగిన ప్రశ్నకు మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. కళ్యాణమస్తు, షాదీ తోఫా కోసం తమ ప్రభుత్వం ఇప్పటిదాకా మొత్తం రూ.267.05 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అలాగే విదేశీ విద్యకు సంబంధించి డోలా శ్రీబాల వీరాంజనేయులు, బెందాళం అశోక్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, కె అచ్చెన్నాయుడు అడిగిన ప్రశ్నకు ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక 2019లో 193 మందికి, 2020, 2021 సంవత్సరాల్లో అమలు చేయలేదని ఆ తర్వాత 2022లో 290 మందికి, 2023లో 67 మందికి కలిపి మొత్తం 1,830 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య పథకాన్ని అమలు చేశామని మంత్రి తెలిపారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కైలే అనిల్ కుమార్ అడిగిన ప్రశ్నకు రాష్ట్రంలో 2020-21లో 13 లక్షల మంది రైతులకు రూ.1,739 కోట్లు, 2021-22కు 15.6 లక్షల మంది రైతులకు రూ.2,977 కోట్లు, 2022-23కు 10.25 లక్షల మంది రైతులకు రూ.1,117.28 కోట్లు ఖర్చు చేసినట్లు వ్యవసాయశాఖ సభ దృష్టికి తెచ్చింది. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఏలూరి సాంబశివరావు, బెందాళం అశోక్, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు అడిగిన ప్రశ్నకు ఈ ఐదేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.61,573 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి రూ.32,059 కోట్లు ఖర్చు చేసినట్లు జలవనరులశాఖ సభ దృష్టికి తెచ్చింది. హఫీజ్ ఖాన్, ముస్తాఫా, నవాజ్ బాషా అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాష్ట్రంలో మసీదుల్లో పనిచేసే ఇమామ్‌కు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు, చర్చిల్లో పాస్టర్లకు రూ.5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని చెల్లిస్తున్నామని మైనార్టీశాఖ సమాధానం ఇచ్చింది.

ప్రశ్నలన్నీ పెండింగే

- మొత్తం 391 అపరిష్కృతం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

శాసనసభలో సభ్యులు అడిగే ప్రశ్నల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు రావడం లేదని సభ్యులు ఆరోపిస్తుండగా, అధికారులు మాత్రం తమదైన శైలిలో నిర్లిప్తంగానే ఉంటున్నారు. తాజాగా శాసనసభ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో మరోసారి ఇదే అంశం చర్చకు వచ్చింది. చాలాకాలంగా సభ్యుల నుంచి అందుతున్న ఫిర్యాదుల మేరకు స్వయంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా ఇదే అంశంపై అన్ని శాఖలకూ సూచనలు చేశారు. అటు శాసనసభ, ఇటు శాసనమండళ్లలో కలిపి మొత్తం 391 ప్రశ్నలకు ఇంతవరకు సమాధానాలు రాలేదు. శాసనసభకు సంబంధించి రెండు నుంచి పదో సెషన్ల వరకు 198 ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. ఇందులో నక్షత్ర గుర్తు కలిగిన ప్రశ్నలే 146 ఉన్నట్లు తేల్చారు. మరో 34 ప్రశ్నలు నక్షత్రేతర ప్రశ్నలుగా ఉన్నాయి. ఇక శాసనమండలికి సంబంధించి మొత్తం 193 ప్రశ్నలకు సమాధానాలు రాలేదని గుర్తించారు. ఇందులో 165 నక్షత్ర గుర్తు కలిగిన ప్రశ్నలు, 21 నక్షత్రేతర ప్రశ్నలు ఉన్నాయని తేలింది.

తాజా సమావేశాల్లో వచ్చే ప్రశ్నలను కూడా కలిపి కొత్త జాబితా తయారుచేయాలని సిఎస్ జవహర్‌రెడ్డి అన్ని శాఖలకూ ఆదేశాలు జారీ చేశారు. పాత ప్రశ్నలతో సహా కొత్త వాటికీ త్వరగా సమాధానాలు సిద్ధంచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే కొన్నేళ్లుగా ఇవే అంశాలపై శాసనసభ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయానికి, అక్కడి నుంచి అన్ని శాఖలకు సర్క్యులర్లు పదేపదే వెళుతున్నప్పటికీ సరైన స్పందన లేకపోవడాన్ని సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

మీడియా పాయింట్



చంద్రబాబు పాపాలను టిడిపి అంగీకరించాలి

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో



శాసనసభ వేదికగా చంద్రబాబు చేసిన పాపాలను అసెంబ్లీలో టిడిపి సభ్యులు అంగీకరించాలని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవ్వకముందు ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టు ప్రభుత్వ కక్ష సాధింపు చర్య కాదన్నారు. గతంలోనూ ఒక ఎమ్మెల్యేను కొంటూ చంద్రబాబు అడ్డంగా దొరికినా తప్పించుకున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో టిడిపి సభ్యులు ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించాలన్నారు.

టిడిపి సభ్యుల ప్రవర్తనను ఖండించాలి
మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ



అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించాలనుకున్న శాసనసభ్యుల హక్కులను హరించేలా టిడిపి సభ్యులు వ్యవహరించారని సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస గోపాలకృష్ణ ఆరోపించారు. అసెంబ్లీలో జరిగిన అంశాలపై ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. అసెంబ్లీలో టిడిపి సభ్యుల చర్యలను ప్రజాస్వామ్య వాదులు ఖండించాలన్నారు. టిడిపి సభ్యులు సభా సమయాన్ని వృథా చేయడంతోపాటు, సభ ఆస్తిని ధ్వంసం చేశారన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన స్కిల్ స్కాంతోపాటు, ఫైబర్‌నెట్, ఔటర్‌రింగ్ రోడ్డు స్కాంలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు.

టిడిసి సభ్యుల తీరు గర్హణీయం : మంత్రి రోజా



స్కిల్ స్కాంలో చంద్రబాబు దోపిడీ దొంగ అని అందరికీ అర్థమైందని, ఈ స్కాం చంద్రబాబు చేయలేదని ఏదోరకంగా చెప్పాలని టిడిపి ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారని పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ.. స్కాంపై చర్చించే ధైర్యం లేక అసెంబ్లీ గౌరవాన్ని దెబ్బతీయడానికి టిడిపి సభ్యులు చూస్తున్నారన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ అసెంబ్లీకి వచ్చింది తక్కువని, కనీసం హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఒక్కసారీ ప్రస్తావించలేదని అన్నారు.

సిఎం బ్యానర్ ఏర్పాటుపై వివాదం

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బ్యానర్ ఏర్పాటు చేయడం వివాదంగా మారింది. మీడియా పాయింట్ బ్యాక్ గ్రౌండ్‌లో ఐఎన్‌పిఆర్ సిబ్బంది గురువారం సిఎం బ్యానర్‌ను ఏర్పాటుచేశారు. దీనిపై స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ పోలీసులు తొలుత అభ్యంతరం చెప్పారు. ఈ విషయం ఐఎన్‌పిఆర్ కమిషనర్‌కు చేరింది. ఐఎన్‌పిఆర్ కమిషనరు తొలుత బ్యానర్ ఏర్పాటుచేసిన మీడియా పాయింట్ చూసే ఐఎన్‌పిఆర్ సిబ్బందిపై సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్ వద్ద సిఎం బ్యానర్ పెట్టొచ్చా? లేదా? అని అధికారులు చర్చించి, తర్వాత బ్యానర్ పెట్టొచ్చని నిర్ధారించారు. ఏర్పాటుచేసిన బ్యానర్‌ను యథాతథంగా ఉంచారు.

ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

- ఆర్థికశాఖ మంత్రికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జులై, ఆగస్టు జీతాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరారు. ఈ మేరకు ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ శాసనమండలిలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. 11వ పిఆర్‌సి ప్రకారం పెంచిన 23 శాతం జీతాలను సిఆర్‌పిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్స్ అకౌంటెంట్స్‌కు కూడా పెంపుదల చేయాలని కోరారు. పెండింగ్ వేతనాల బడ్జెట్ విడుదల చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జీతాలు పెరగని కేటగిరి ఉద్యోగుల జీతాలు పెంపుదలకు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2004 సెప్టెంబరు ఒకటికి ముందు ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగంలో చేరిన వారికి పాత పెన్షన్ పథకం వర్తింపజేయాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా మండలిలో సాబ్జీ ప్రభుత్వాన్ని కోరారు.

ఉక్కును అమ్మే హక్కు మోడీకి ఎవరిచ్చారు?

- విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రజల ఆస్తి : సిపిఎం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



శ్రీకాకుళం జిల్లాలో బైక్ ర్యాలీ

విశాఖ ఉక్కును అమ్మే హక్కు మోడీకి ఎవరిచ్చారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉత్తరాంధ్ర జిల్లాల బైక్ యాత్ర గురువారం శ్రీకాకుళం జిల్లా పొందూరులోకి ప్రవేశించింది. అనంతరం ఆమదాలవలసలోని ఇందిరాగాంధీ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రజల ఆస్తి అని అన్నారు. లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక పరిశ్రమ విశాఖ స్టీల్ అని, అటువంటి పరిశ్రమను మోడీ సర్కారు ప్రయివేట్‌పరం చేయాలని చూస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కును అమ్మేస్తున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకపోవడం శోచనీయమన్నారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి జగన్ మాట్లాడుతూ.. 32 మంది బలిదానాలతో పోరాడి సాధించుకున్న ఉక్కును ప్రయివేట్‌పరం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. అనంతరం ఇందిరాగాంధీ కూడలి నుంచి రైల్వే జంక్షన్ వరకు యాత్ర సాగింది. ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ విద్యాసంస్థల వద్ద బైక్ యాత్రకు టిడిపి జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జీ కార్యకర్తలతో కలిసి వచ్చి సంఘీభావం తెలిపారు. ప్రజా, కార్మిక, రైతు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై సంఘీభావం తెలిపాయి. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకోవడం ఇలానా?

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. పిడిఎఫ్ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఒపిఎస్ మాత్రమే ప్రత్యామ్నాయంగా చెప్పారు. వైఎస్ జగన్ చెప్పారంటే... చెస్తారంటే నినాదాన్ని నిలబెట్టుకోవాలని, లేదా దీనిని మాట తప్పడం, మడప తిప్పడంగానే భావిస్తామన్నారు. దీనికి సిఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. జిపిఎస్‌లో కూడా కంట్రిబ్యూషన్ మాట ఉన్నప్పుడు ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. కేవలం అంకెల్లో మార్పు మాత్రమే చూపిస్తున్నారన్నారు. సిపిఎస్ స్థానంలో జిపిఎస్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని అన్నారు.

ఉద్యోగ సంఘాలన్నీ అంగీకరించాయని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పుడున్న ఉద్యోగ సంఘాలకు ఎవరు అధికారం ఇచ్చారు? ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. బొప్పరాజు, బండి శ్రీనివాసరావు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించి మూడు లక్షల మంది ప్రయోజనాలను తాకట్టుపెట్టారని అన్నారు. తాము ఒపిఎస్ కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. సిపిఎస్‌కు ఒపిఎస్ మాత్రమే ప్రత్యామ్నాయం అని స్పష్టం చేశారు. దేశంలో సిపిఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు ప్రారంభమైన తరువాత ఐదు రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశారన్నారు. ఐదు రాష్ట్రాల్లో సాధ్యపడగా ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. సిపిఎస్ అరగుండు... జిపిఎస్ అంటే బోడిగుండు... అని వ్యాఖ్యానించారు. నిరంకుశంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతి ఈ ప్రభుత్వానికీ పడుతుందన్నారు. జిపిఎస్ బిల్లును తాము సభలోనే వ్యతిరేకిస్తామన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని అధికారంలో కొనసాగుతారో లేక ఓడిపోతారో సిఎం జగన్ తేల్చుకోవాలన్నారు.

9,120 మందికి ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు

- మిగిసిన ఇఎపిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇఎపిసెట్-2023 తుదిదశ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో 9,120 మందికి ఇంజినీరింగ్ సీట్లు కేటాయించినట్లు సెట్ కన్వీనర్ సిహెచ్ నాగరాణి వెల్లడించారు. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన అడ్మిషన్ల కౌన్సెలింగ్ గురువారంతో ముగిసినట్లు తెలిపారు. తుదిదశ కౌన్సెలింగ్‌లో 50,378 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. వీరిలో 9,120 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. 254 ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనరు కోటా కింద 1,21,997 సీట్లు అందుబాటులో ఉన్నాయని, వీటిలో 94,407 సీట్లను భర్తీ చేశామని వివరించారు. 26 విశ్వవిద్యాలయ కళాశాలల్లో 7,531 సీట్లకు గానూ 5,513 భర్తీ అయ్యాయని తెలిపారు. 222 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,10,343 సీట్లలో 85,111 కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. 6 ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 4,123 సీట్లు అందుబాటులో ఉండగా, 3,783 భర్తీ అయ్యాయని వివరించారు. అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 25లోపు ఆయా కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని వివరించారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు రూ.1.10 కోట్ల ప్రమాద బీమా

- మంత్రి పినిపె విశ్వరూప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల కోసం ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ ద్వారా రూ.1.10 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చామని రవాణాశాఖ మంత్రి పినిపె విశ్వరూప్ తెలిపారు. గురువారం విజయవాడలోని ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో మంత్రి విశ్వరూప్, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు సమక్షంలో ఆర్‌టిసి, ఎస్‌బిఐ ఉన్నతాధికారులు ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎస్‌బిఐ జనరల్ మేనేజరు ఓం నారాయణ శర్మ ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పినిపె విశ్వరూప్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగుల కోసం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులందరినీ ప్రభుత్వంలో విలీనం చేసిందన్నారు. అలాగే గతంలో అతితక్కువ పెన్షన్ వస్తుండగా, ఇప్పుడు రూ.5 వేల నుంచి రూ.30 వేలు వరకూ వచ్చేలా హయ్యర్ పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనరు మనీష్ కుమార్ సిన్హా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ కోటేశ్వరరావు, పి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'గురజాడ' నేటి తరానికి స్ఫూర్తి

- మహాకవి జయంతి సందర్భంగా విజయవాడలో 2కె రన్


ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, పాల్గొన్న విద్యార్థులు, యువత

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్, ఏలూరు

సామాజిక రుగ్మతలను రూపుమాపే సాంఘిక పరివర్తనకు అహర్నిశలు కృషి చేసిన మహాకవి గురజాడ అప్పారావును నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వ్యక్తలు అన్నారు. గురజాడ 161వ జయంతిని పురస్కరించుకుని గురువారం విజయవాడలో 2కె రన్, ఏలూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. విజయవాడలో జాషువా సాంస్కృతిక వేదిక, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జిఆర్‌కె పోలవరపు కళాసమితి, సేవ్ సంస్థ, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1920వ శతాబ్ధంలో గురజాడ రచించిన రచనలు నేటికీ ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. ఆనాటి సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలపై గొప్ప రచనలు చేశారని తెలిపారు. సుమారు వేయి మంది విద్యార్థులతో నిర్వహించిన 2కె రన్ ర్యాలీ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నుంచి రెడ్ సర్కిల్, కస్తూరిబాయిపేట గాంధీ బొమ్మలు, మధు గార్డెన్స్, శిఖామణి సెంటర్ మీదుగా తిరిగి ఫుడ్‌కోర్టు వద్దకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు ఎంసి దాస్, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ప్రముఖ విద్యావేత్త ఎస్ఆర్ పరిమి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు జి రశ్మి, అమరావతి బాలోత్సవ్ గౌరవాధ్యక్షులు చలవాది మల్లిఖార్జునరావు, ఎంబివికె కార్యదర్శి పి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో గురజాడ అప్పారావు జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకే ఏలూరులోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పెద్దఎత్తున ఇండోర్ స్టేడియానికి చేరుకున్నారు. 'దేశమును ప్రేమించుమన్న' ప్లకార్డులతో ప్రదర్శనను ప్రారంభించారు. గురజాడ భారీ చిత్రపటం, గురజాడ అప్పారావు వేషధారణతో పలువురు విద్యార్థులు ముందుకు సాగారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అక్కడ దేశభక్తి గేయాలను ఆలపించారు.


తెన్నేటి చిత్రానికి నివాళులర్పిస్తున్న పోరాట కమిటీ నాయకులు

'ఉక్కు' దీక్షలో తెన్నేటి విశ్వనాథం జయంతి

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమ స్ఫూర్తి ప్రధాత తెన్నేటి విశ్వనాథం 128వ జయంతిని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ దీక్షా శిబిరంలో గురువారం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 952వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ సభ్యులు కూర్చున్నారు. దీక్షా శిబిరంలో ముందుగా తెన్నేటి విశ్వనాథం చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప మాట్లాడుతూ.. విశాఖలో ఉక్కు కర్మాగారం నెలకొల్పాలని 1965 జులై 1న రాష్ట్ర అసెంబ్లీలో ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన తీర్మానానికి ఎటువంటి రాజకీయ భేషజాలకు పోకుండా అన్ని ప్రతిపక్ష పార్టీలూ ఏకగ్రీవంగా ఆమోదించడంలో తేన్నేటి విశ్వనాథం ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు నిర్మాణంలో రాజకీయంగా తనదైన పాత్ర పోషించిన తెన్నేటిని విశాఖ ఉక్కు కార్మికులు, యావత్ తెలుగు ప్రజలు స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.అప్పారావు, కారు రమణ, కామేశ్వరరావు, గెద్దాడ అప్పలరాజు, దాసరి పుల్లారావు, కోయిలాడ శ్రీనివాస్, ఆర్‌వి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్ బిల్లును ఎమ్మెల్యేలు వ్యతిరేకించాలి

- మద్దతిస్తే మా ఓట్లు అడగొద్దు
- ఎపి సెక్రటేరియట్ సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గ్యారెంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్) బిల్లును అసెంబ్లీలో వ్యతిరేకించాలని ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కోరినట్లు ఎపి సెక్రటేరియట్ సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎపి స్టేట్ సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు తెలిపారు. అసోసియేషన్ల ఆధ్వర్యంలో సిపిఎస్ ఉద్యోగులు అసెంబ్లీ మీడియా పాయింట్ సమీపంలో జిపిఎస్ బిల్లును తిరస్కరించాలని గురువారం ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ఎపి సెక్రటేరియట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోట్ల రమేష్, నాపా ప్రసాద్, ఎపి స్టేట్ సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మరియదాసు, గౌరవ సలహాదారు పటాన్ బాజీ మీడియాతో మాట్లాడారు. జిపిఎస్ బిల్లుకు మద్దతిచ్చే ఎమ్మెల్యేలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ కుటుంబాలు, తమ బంధువుల ఓట్లు అడగటానికి వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజాసంకల్ప యాత్రలో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరిద్ధరిస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. ఐదు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో సిపిఎస్ కన్నా ప్రమాదకరమైన జిపిఎస్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడానికి ప్రయత్నిస్తుందన్నారు. సిపిఎస్, జిపిఎస్ రెండూ ఉద్యోగులకు నష్టం కలిగించేవే అని, సిపిఎస్ కావాలా? జిపిఎస్ కావాలా అంటూ ప్రభుత్వం అడగడం అంటే బావిలో పడి చస్తావా? ఉరేసుకు చస్తావా? తేల్చుకోమన్నట్లు ఉందన్నారు. ప్రభుత్వం జిపిఎస్‌ను ఉద్యోగులపై రుద్దడానికి ప్రయత్నిస్తోందని, ఇది పూర్తి అప్రజాస్వామికమని అన్నారు. జిపిఎస్ పేరుతో ఇప్పుడు రాష్ట్రంలోని 3.5 లక్షల సిపిఎస్ ఉద్యోగుల పొట్టకొట్టడానికి చూస్తే వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. ఉద్యోగ సంఘాల పేరుతో జిపిఎస్‌కు మద్దతిస్తున్న నాయకులు ప్రభుత్వ సంఘాల నాయకులు మాత్రమేనన్నారు. వారికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సంబంధం లేదన్నారు. అనంతరం సంఘాల నాయకులు పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు వినతిపత్రం అందజేశారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న రమాదేవి

మహిళా రిజర్వేషన్ బిల్లు కంటితుడుపు చర్య

- మద్యనిషేధ హామీని తుంగలో తొక్కారు : సిపిఎం

ప్రజాశక్తి - చీమకుర్తి (ప్రకాశం జిల్లా)

మహిళా రిజర్వేషన్ బిల్లు కంటి తుడుపు చర్య అని, బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే మహిళా బిల్లు తిరిగి అటకెక్కుతుందనిసిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు.జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అమలు చేయడమంటే ఎన్నికల్లో లబ్ధికోసమేనని అన్నారు. సిపిఎం పోరుబాట పాదయాత్ర గురువారం ప్రకాశం జిల్లా చీమకుర్తిలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా స్థానిక నాయుడుపాలెం రోడ్డులో బహిరంగ సభ నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, మద్యం ఆదాయంతోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, మద్య నిషేధం హామీ తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రకాశం జిల్లా ఏర్పాటై దశాబ్దాలు గడుస్తున్నా జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు ఏమి లేవని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం పాకులాడడం తప్ప ఒక్క కొత్త పరిశ్రమ, ప్రాజెక్టులు తెచ్చిన దాఖలాలు లేవన్నారు. పదవులు కాపాడుకోవడం కోసం సిఎం జగన్ నిత్యం ఢిల్లీ చుట్టూ తిరగడమే సరిపోతోందని విమర్శించారు. రూ.1500 కోట్ల విద్యుత్ బిల్లుల వడ్డీ భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి వ్యాపారం నిరాటకంగా సాగుతోందన్నారు. సభకు సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివికొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, ఎస్‌కె మాబు పాల్గొన్నారు.

చంద్రబాబును జైలులోనే చంపే ప్రయత్నం

- టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆధారాలు లేని కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి బెయిల్ రాకుండా రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే చంపేందుకు ప్లాన్ చేస్తున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. జెడ్‌ప్లస్ భద్రతలో ఉన్న ప్రతిపక్ష నేతకు జైలులో హాని తలపెట్టేలా సర్కారు కుట్ర సాగుతోందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబుకు జైలులో భద్రత లేదని తెలిపారు. విపరీతమైన దోమలు కుడుతున్నాయని చెప్పినా జైలు అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. రాజమండ్రి రూరల్ మండలం ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీరవెంకట సత్యనారాయణ డెంగీ బారినపడి మరణించారని పేర్కొన్నారు. చంద్రబాబును ఇలానే చేయాలని సైకో కుతంత్రాలు అమలు చేస్తున్నారని, ఆయనకు ఏం జరిగినా జగన్‌దే బాధ్యత అని అన్నారు.

చంద్రబాబు భద్రతపై ఆందోళన వద్దు : జైళ్ల శాఖ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు భద్రతపై ఆందోళన అవసరం లేదని జైళ్లశాఖ డిఐజి రవి కిరణ్ తెలిపారు. చంద్రబాబు భద్రతపై ఆ పార్టీ నేతలు గత కొన్ని రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. తాజాగా సెంట్రల్ జైలు ఖైదీ ఒకరు డెంగ్యూతో మృతి చెందారు. చంద్రబాబును జైలులోనే హత్య చేసేందుకు కుట్ర జరుగుతోందంటూ చంద్రబాబు తనయుడు లోకేష్‌తోపాటు ఆ పార్టీకి చెందిన పలువురు బహిరంగంగానే ఆరోపించడంతో జైళ్లశాఖ డిఐజి రవి కిరణ్ స్పందించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ వీర వెంకట సత్యనారాయణ దోపిడీ కేసులో ఈ నెల 6న జైలుకు వచ్చాడని, జ్వరం ప్లేట్‌లెట్లు తగ్గిపోవడంతో అత్యవసర వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించామని తెలిపారు. డెంగ్యూతో బుధవారం మృతి చెందారని చెప్పారు. కోర్టు సూచించిన అన్ని సౌకర్యాలను చంద్రబాబుకు ఏర్పాటు చేశామని తెలిపారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు

- బిజెపి పాలనలో దళితులకు రక్షణ కరువు
- దళితరక్షణ యాత్ర ప్రారంభ సభలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి యాత్రను ప్రారంభిస్తున్న కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. బిజెపి పాలనలో దళితులకు రక్షణ కరువైందని, దళితులు, దళిత సంఘాల నేతలు ఒకే తాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అసైన్డ్ భూముల చట్ట సవరణను తక్షణమే విరమించుకోవాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దళిత రక్షణ యాత్రను భీమవరంలో మాల్యాద్రి గురువారం ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి మాల్యాద్రి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతాన్ని శరవేగంగా అమలు చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని రద్దుచేసి మనస్మృతిని అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మేయడమే కాకుండా దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని తెలిపారు. దళితులకు ఉన్న రాజ్యాంగ హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, సిఐటియు, పట్టణ పౌర సమాఖ్య, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్య మండలి నాయకులు యాత్రకు సంఘీభావం తెలిపారు.

టిడిపి నేతలను అరెస్టు చేయొద్దు

హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

అన్నమయ్య జిల్లా, అంగళ్లు, భీమగానిపల్లె క్రాస్ రోడ్‌లో జరిగిన ఘటనల నేపథ్యంలో ముదివేడు, పుంగనూరు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలకు హైకోర్టులో ఊరట లభించింది. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటన సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంలో పోలీసులు నమోదు చేసిన కేసుల్లో పలువురు నేతలను తదుపరి విచారణ వరకు అరెస్ట్‌తోపాటు ఇతర తొందరపాటు చర్యలు తీసుకోవద్దని గురువారం పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది.

విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ కె సురేష్‌రెడ్డి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఇవే కేసుల్లో పలువురు నిందితులకు కోర్టు ముందస్తు బెయిల్ దాఖలు చేయడాన్ని సవాల్ చేస్తూ పోలీసులు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఎస్‌ఎల్‌పిలో సుప్రీంకోర్టు ఇచ్చే ఉత్తర్వులను బట్టి తమ ముందున్న పిటిషన్‌పై నిర్ణయాన్ని వెల్లడిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.

పలువురికి బెయిల్

మాజీ సిఎం చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా పుంగనూరు పోలీసులు నమోదు చేసిన కేసులో చిత్తూరు జిల్లా, వెంకటగిరికోట మండలానికి చెందిన పలువురు టిడిపి నేతలకు ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. పిటిషనర్లు ఘటనా స్థలంలో ఉన్నట్లు తప్పుగా ఫిర్యాదు చేశానని ఫిర్యాదుదారుడు ప్రకటన గురించి పిటిషనర్లు మెమో దాఖలు చేశారు. దీనిని జస్టిస్ కె సురేష్‌రెడ్డి పరిశీలించి టిడిపి నేతలకు ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. ఎఎమ్ రంగనాథ్, ఎం సోమప్ప, బిఆర్ రాంబాబు నాయుడు, ఎస్ కొండారెడ్డి, జిఎ భక్తవత్సలం, సి విశ్వనాథ్, ఆర్ రాంబాబుకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. ఇదే కేసులో అరెస్టయిన 79 మంది టిడిపి కార్యకర్తలకు బెయిల్ మంజూరు చేశారు. మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని పిటిషనర్లను ఆదేశించారు.

బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ డిజైన్ల మార్పు, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలపై సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ ఈ నెల 26కు వాయిదా పడింది.

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి అధికారులు పలు సెక్షన్ల కింద నమోదు చేసిన కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. దీనిని జస్టిస్ కె సురేష్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఇదే కేసుకు సంబంధించి ఎసిబి కోర్టులో సిఐడి పిటి వారెంట్ వేసిందని చంద్రబాబు తరపున న్యాయవాది ఎస్ ప్రణతి తెలిపారు.



స్కిల్ స్కాం సిబిఐకి ఇవ్వాలి

- హైకోర్టులో ఉండవల్లి పిల్

ప్రజాశక్తి-అమరావతి

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ (ఎపిఎస్-ఎస్‌డిసి) నిధుల దుర్వినియోగం కేసు దర్యాప్తును సిబిఐకి బదిలీ చేయాలని కోరుతూ మాజీ ఎంపి, న్యాయవాది ఉండవల్లి అరుణ్ కుమార్ గురువారం హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పలు రాష్ట్రాల జటిల వ్యవహారాలతో సంబంధాలున్నాయని, వేర్వేరు రాష్ట్రాలతో ముడిపడిన వ్యవహారం కాబట్టి సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ కేసులో మహామహులు నిందితులుగా ఉన్నారని కూడా చెప్పారు. ఆర్థిక అవకతవకలు జరిగాయని, ఆర్థిక మోసాలు కూడా ఉన్నాయని, ఈ వ్యవహారంపై లోతుగా, సమగ్రంగా దర్యాప్తు జరగాలంటే సిబిఐకి దర్యాప్తును బదిలీ చేయాలని కోరారు. సిబిఐ కానిపక్షంలో ఇడి లేదా కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలకు అప్పగించాలని కోరారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఇప్పటికే ఇడి చర్యలు చేపట్టిందన్నారు. ఇడి కొంతమంది నిందితులను అరెస్టు చేసిందన్నారు. ఎపి మాజీ సిఎం చంద్రబాబును సిఐడి అరెస్టు చేసిందని, ఎసిబి కోర్టు ఆదేశాలతో రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబు ఉన్నారని చెప్పారు. ఇందులో 44 మందిని ప్రతివాదులుగా పేర్కొన్నారు.

జమ్ముకాశ్మీర్ విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు ఇఇఎఫ్ఐ సంఘీభావం

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల సమ్మెకు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) పూర్తి సంఘీభావం ప్రకటించింది. ఈ నెల 25, 26 తేదీల్లో 48 గంటల సమ్మెకు జమ్ముకాశ్మీర్ పవర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (జెకెపిఇడబ్ల్యుయుఎఫ్) పిలుపునిచ్చింది. జమ్ముకాశ్మీర్ పవర్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (పిడిడి) ఉద్యోగులు, ఇంజనీర్లు గత కొన్ని నెలలుగా జీతాలు లేక, జీతాల్లో తీవ్ర జాప్యం ఎదుర్కొంటున్నారు. సుమారు 4 వేల టెక్నికల్, 750 ఇంజనీరింగ్ పోస్టులు మంజూరైనా ఇంకా భర్తీ కాలేదు. దీంతో ఉద్యోగులు అదనపు పని భారం, ఒత్తిడిని అనుభవిస్తున్నారు. కార్మికుల క్రమబద్ధీకరణ, పదోన్నతులు, సీనియారిటీ విషయంలో 2021 డిసెంబరు 21న పిడిడి, కార్మిక యూనియన్ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో కుదిరిన న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలనే డిమాండ్‌తో ఈ సమ్మె జరగనుంది.

ఎయిరిండియాకు డిజిసిఎ షాక్

న్యూఢిల్లీ : భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎయిరిండియాకు డిజిసిఎ షోకాజు నోటీసులు జారీ చేసింది. జులై 25, 26 తేదీల్లో ఎయిరిండియాలో అంతర్గత ఆడిట్, ప్రమాద నివారణ అంశాల నిబంధనలపై డిజిసిఎ అధికారులు తనిఖీలు జరిపి కొన్ని లోపాలను గుర్తించారు. ఈ నేపథ్యంలో ఎయిరిండియా భద్రత హెడ్‌పై నెల రోజులు వేటు వేసింది.

ఒపిఎస్ సాధన కోసం 25న చలో కలెక్టరేట్

- ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ ఉమ్మడి పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) సాధన కోసం ఈ నెల 25న చలో కలెక్టరేట్ నిర్వహించాలని ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఫ్యాప్టో ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజుల, ఎపిసిపిఎస్ఇఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అప్పలరాజు, కె రాజేశ్వరరావు గురువారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ పాత పెన్షన్ విధానమే కావాలని నినదిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం లెక్కచేయడం లేదని పేర్కొన్నారు. తను అనుకున్న విధంగా గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్)ను ఉపాధ్యాయ, ఉద్యోగులపై మొండిగా రుద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసి కేబినెట్ ఆమోదం పొందిందని అన్నారు. జిపిఎస్‌ను ప్రతిఘటించేందుకు ఈ నెల 25న చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చామని వివరించారు. దీంతోపాటు ఈ నెల 22న నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావడం, 23 సాయంత్రం పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాలను జిపిఎస్‌ను వ్యతిరేకించే అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాజధానిలో పట్టిష్ట బందోబస్తు

- రెండోరోజు ముఖ్యమంత్రికి నిరసనలు

ప్రజాశక్తి-తుళ్లూరు (గుంటూరు)

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రాజధాని ప్రాంతంలో పోలీసులు పట్టిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. సచివాలయానికి వెళ్లే మార్గాల్లో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాన రోడ్డు మార్గాలలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను సోదా చేశారు. ప్రధానంగా రైతులు, మహిళలు దీక్ష శిబిరాల నుంచి బయటకు రాకుండా పెద్ద ఎత్తున మోహరించారు. మందడంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను, వ్యాపార సంస్థలను పోలీసులు మూసివేయించారు. సచివాలయానికి వెళ్లే ఆర్‌టిసి బస్సులను సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా దారి మళ్లించారు. పోలీసుల ఆంక్షలతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

కౌలు చెల్లించాలని నినాదాలు

సిఎం జగన్ మోహన్‌రెడ్డికి రాజధాని రైతుల నుంచి రెండో రోజు కూడా నిరసన సెగ తగిలింది. గురువారం మందడంలోని రైతు దీక్షా శిబిరం ముందుగా సిఎం జగన్ కాన్వాయ్ వెళ్తున్న సమయంలో దీక్షా శిబిరంలోని రైతులు, మహిళలు నల్ల జెండాలు, ప్ల కార్డులు పట్టుకొని రోడ్డుపైకి వచ్చేందుకు యత్నించారు. దీంతో పోలీసులు అడ్డుగా నిలబడి వారిని నిలువరించారు. మే నెలలో చెల్లించాల్సిన కౌలును ఇప్పటివరకు చెల్లించలేదని, ఎప్పుడు చెల్లించేది ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని నినాదాలు చేశారు.


మందడంలో వాహన దారులను వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

మార్కెట్లకు కెనడా గుబులు

- సెన్సెక్స్ 570 పాయింట్ల పతనం
- మూడు రోజుల్లో రూ.5 లక్షల కోట్లు ఫట్



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడితో వరుసగా మూడో రోజూ నష్టాలు చవి చూశాయి. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులకు తోడు దేశీయంగా సానుకూల ఆర్థికాంశాలు ఏమీ కానరాకపోవడంతో ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా భారత్- కెనడా మధ్య సంబంధాలు దిగజారడానికి తోడు అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపునపై సంకేతాలు ఇవ్వడంతో గురువారం సెషన్‌లో ఉదయం నుంచే మొదలైన సూచీల పతనం ఏ దేశలోనూ కోలుకోలేదు. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 570 పాయింట్లు కోల్పోయి 66,230కు జారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 159 పాయింట్ల నష్టంతో 19,742కు వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ -50 సూచీ సెప్టెంబరు 7 నాటి కనిష్టానికి పడిపోయింది. ప్రస్తుతానికి అయితే వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు అమెరికా ఫెడ్ రిజర్వ్ ప్రకటించింది. కాగా.. దీర్ఘకాలం పాటు అధిక వడ్డీ రేట్లు కొనసాగవచ్చని.. రానున్న రోజుల్లో మరోసారి వడ్డీ రేట్ల పెంపు తప్పదని సంకేతాలు ఇచ్చింది. ఈ పరిణామం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. మరోవైపు ముడి చమురు ధరలు కూడా పెరగడం ప్రతికూలతను పెంచాయి. రంగాల వారిగా ఐటి, ఎఫ్ఎంసిజి, ఆటో, ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్ నష్టాలను చవిచూశాయి. ఇంధనం, రియాల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ సూచీలకు మద్దతు లభించింది. డాలర్‌తో రూపాయి మారకం తుదకు యథాతథంగా 83.10 వద్ద ముగిసింది. మూడు సెషన్లలో సెన్సెక్స్ దాదాపు 1600 పాయింట్లు కోల్పోయింది. దీంతో దలాల్ స్ట్రీట్‌లో మదుపర్ల సంపద దాదాపు రూ.5.4 లక్షల కోట్లు ఆవిరయ్యింది. నేటి వారాంతం సెషన్‌లోనూ మార్కెట్లు పడిపోతే.. మదుపర్లు మరింత నష్టాలు చవి చూసే అవకాశం ఉంది.

బ్యాంక్‌ల్లో తగ్గిన నగదు లభ్యత

న్యూఢిల్లీ : భారత బ్యాంకింగ్ రంగంలో నగదు లభ్యత తగ్గింది. అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు, జిఎస్‌టి పేమెంట్స్ వల్ల సెప్టెంబర్ 20 నాటికి బ్యాంక్‌ల్లో నగదు లోటు రూ.1.46 లక్షల కోట్లకు పెరిగిందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఈ లోటు నాలుగేళ్ల గరిష్ట స్థాయి అని పేర్కొంది. 2019 ఏప్రిల్ 23 తర్వాత ఒకే రోజులో ఇదే అత్యధిక కొరత.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆగస్టులో తొలిసారి బ్యాంకింగ్ సిస్టమ్ లిక్విడిటీ లోటులోకి జారుకుంది. బ్యాంక్ డిపాజిట్లలో 10 శాతం నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్ఆర్)కు కేటాయించాలని ఆర్‌బిఐ సూచిస్తున్నప్పటికీ నగదు లభ్యత తగ్గిపోవడం గమనార్హం. లిక్విడిటీ అంటే అందుబాటులో ఉన్న నగదు లభ్యత. బ్యాంకుల స్వల్పకాలిక వ్యాపారం, ఆర్థిక అవసరాలను ఇది తీర్చుతుంది.

సంపాదకీయం

భారత్ కెనడా విభేదాలు!

ఖలిస్థానీ ఉగ్రవాద నాయకుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల పాత్ర ఉందన్న నమ్మకమైన ఆరోపణలు (క్రెడిబుల్ ఎలిగేషన్స్) వచ్చాయని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆ దేశ పార్లమెంటులో ప్రకటించడంతో భారత్ కెనడాల మధ్య ప్రారంభమైన విభేదాలు అంతకంతకూ తీవ్రం కావడం ఆందోళనకరం. నిర్దిష్ట సమాచారం ఉంటే దాన్ని అందజేసి ద్వైపాక్షికంగానో లేక అంతర్జాతీయ న్యాయ వేదికల ద్వారానో పరిష్కరించుకోవాలి తప్ప భారత్‌పై నిందలు వేయడం కెనడాకు తగదు. దీంతో కెనడాలో చదువుకుంటున్న భారత విద్యార్థులు, ఇక్కడి వారి కుటుంబీకులు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రపంచంలో భారత్‌కు వెలుపల ఇంకే దేశం కన్నా అత్యధికంగా సిక్కులున్నది కెనడాలోనే గనుక ఈ వివాదాల మూలంగా ఇరు దేశాల్లోని సిక్కులకు సంబంధ బాంధవ్యాలు, సాంస్కృతిక పరంగా తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. కీలక సరిహద్దు రాష్ట్రమైన పంజాబ్ ప్రజల్లో ఇటువంటి గందరగోళం ఏర్పడితే దాని ప్రభావం దేశంపై ఎంతగానో ఉంటుంది. ముఖ్యంగా 70, 80వ దశకాల్లో అక్కడ తలెత్తిన ఉగ్రవాదం దేశ సమైక్యత, సమగ్రతలకు సవాల్‌గా మారిన విషయం మనందరికీ తెలుసు. ఆపరేషన్ బ్లూ స్టార్ తో అణచివేసినా ఆ తరువాత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ వెంటనే ఢిల్లీలో సిక్కుల ఊచకోత వంటివి భారత్‌కు ఎన్నటికీ మానని గాయాలే!

'ఖలిస్తానీ టైగర్ ఫోర్స్' అధ్యక్షుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ ఈ ఏడాది జూన్‌లో బ్రిటిష్ కొలంబియా లోని సర్రే ప్రాంతంలో హత్యకు గురి కాగా మరో ఉగ్రవాది సుఖా దుంకెన్ విన్నిపెగ్‌లో బుధవారం ప్రత్యర్థి గ్యాంగ్ జరిపిన దాడిలో మరణించాడు. కెనడా ప్రధాని ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా నిజ్జర్ హత్యకు ఇండియా కారణం అంటూ ఆరోపణలు చేయడమేగాక సీనియర్ భారత దౌత్యవేత్తను ఆ దేశం నుంచి బహిష్కరించారు. అందుకు ప్రతిగా భారత్ కూడా కెనడియన్ సీనియర్ దౌత్యవేత్తను ఐదు రోజుల్లో ఇండియా వదిలి వెళ్లాలని ఆదేశించింది. కెనడా ఆరోపణల్ని అసంబద్ధ, ప్రేరేపిత ఆరోపణలుగా ఖండించింది. నిజ్జర్ హత్యోదంతంలో తమకు ఎలాంటి నిర్దిష్ట సమాచారం అందించినా పరిశీలించేందుకు సిద్ధమని చెప్పినా ఇప్పటివరకూ కెనడా నుంచి అటువంటివి అందలేదని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. కెనడాలోని భారత పౌరులు, విద్యార్థులు, అక్కడకు ప్రయాణించాలనుకునేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భారత ప్రభుత్వం తన పౌరులను హెచ్చరించింది. భారత్‌లో ఉంటున్న కెనడా పౌరులు జాగ్రత్తగా ఉండాలని ట్రూడో ప్రభుత్వం సలహా జారీ చేసిన కొన్ని గంటల్లోనే భారత్ ఈ ప్రకటన విడుదల చేసింది. కెనడా పౌరులకు భారతీయ వీసాలను సస్పెండ్ చేసింది. దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

నాటో, జి-7, ఫైవ్ ఐస్ తదితర కూటముల్లోని మిత్ర దేశాలైన అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి దేశాలను తనకు మద్దతుగా కూడదీసుకోవాలని కెనడా యత్నిస్తోంది. ట్రూడో ఆరోపణల్లో నిజాలు తేలాలంటే దర్యాప్తు జరగాలని, అందుకు భారత్ సహకరించాలని అమెరికా జాతీయ భద్రతా మండలి సమన్వయకర్త గురువారం సాయంత్రం ప్రకటించారు. మిగతా సంపన్న దేశాలు ఎలా వ్యవహరిస్తాయో భారత ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

కెనడా జనాభాలో సిక్కులు 2.1 శాతం కావడం, 30 మంది ట్రూడో మంత్రివర్గంలో నలుగురు సిక్కులు ఉండడం గమనార్హం. ఓట్ల పరంగానూ పార్టీలోనూ కీలకమైన పాత్ర కలిగినందునే అక్కడి సిక్కులను బుజ్జగించడానికి ట్రూడో ప్రభుత్వం భారత్ తో ఇంత ఘర్షణపూరిత వైఖరి ప్రదర్శిస్తోందన్న వాదన కాదనలేనిది. ఉగ్రవాదం పట్ల భారతీయుల్లో సహజంగానే ఉన్న వ్యతిరేకతను తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బిజెపి సంఘపరివార్ కు పరిపాటి. ఉగ్రవాదాన్ని ప్రతిఘటించే 56 అంగుళాల ఛాతీ గల నాయకుడంటూ వాట్సప్ యూనివర్సిటీ నుండి ఇప్పటికే కొన్ని పోస్టులు వెలువడుతున్నాయి. జాతీయ దురభిమానాన్ని రెచ్చగొట్టి ఓట్లు రాబట్టుకోవడం దానికి కొత్త కాదు. ఈ నేపథ్యంలో ఇరు దేశాధినేతలూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడితే నష్టపోయేది మాత్రం ప్రజలే! విభేదాలను విడనాడి వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం రెండు దేశాలకూ శ్రేయస్కరం.

మహనీయుల మాట

అడవి బాపిరాజు

8.10.1895–22.9.1952



రచయిత, చిత్రకారుడు, గాయకుడు, శిల్పి, పత్రిక సంపాదకులుగా పనిచేశారు. తొలకరి పాటల సంపుటి, నారాయణరావు, హిమబిందు, తుఫాను, గోన గన్నారెడ్డి, కోణంగి నవలలు ప్రసిద్ధం. కథలు కూడా రాశారు. అనసూయ, ధ్రువ విజయం, మీరా బాయి... తదితర చిత్రాలకు కళా దర్శకత్వం వహించారు.

వ్యాఖ్య

మహిళా రిజర్వేషన్ : నిరవధిక జాప్యంతో ఆమోదం!

ఇరవైఏడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు ఎంతగానో అందరూ ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది. కానీ, ఇది ఆనందించే అంశంగా లేదు. ఇన్నేళ్ళూ, వరుసగా వచ్చిన ప్రభుత్వాలన్నీ కూడా ఈ బిల్లును చంపేయడానికే చూశాయి, ఉదాసీనతతో మూటగట్టి మూలన పెట్టడానికే ప్రయత్నించాయి. కానీ, వామపక్షాలు, ఐద్వాతో సహా కొన్ని మహిళా ఉద్యమ విభాగాలు మాత్రమే నిరంతరంగా పోరాడుతూ, ఈ బిల్లును సజీవంగా వుంచేందుకు పోరాటం, ప్రచారం చేస్తూ వచ్చాయి.

తాజా అధ్యాయంలో విషాదకరమైన అంశమేమంటే, బిల్లు ఆమోద ముద్ర పొందినా, దీని అమలు మాత్రం 2029 సార్వత్రిక ఎన్నికల వరకు, అది కూడా తీవ్రమైన స్థాయిలో ప్రశ్నించదగ్గ కారణాలతో వాయిదా వేశారు. తదుపరి జన గణన ప్రక్రియ పూర్తయిన పిదప 2026లో సీట్ల పునర్విభజన ప్రారంభమైన తర్వాత మాత్రమే చట్టసభల్లో మహిళలకు సీట్ల రిజర్వేషన్ జరుగుతుందని ముసాయిదా బిల్లు పేర్కొంటోంది. మహిళా రిజర్వేషన్ వాస్తవ రూపం దాల్చడానికి జనాభా లెక్కల నిర్వహణ లేదా పునర్విభజన ప్రక్రియ ఏదీ అవసరం లేదు. బిల్లును ఆమోదించిన తక్షణమే రిజర్వేషన్‌ను అమలు చేయవచ్చు, జనగణన, పునర్విభజన ప్రక్రియలు నిర్వహించినపుడు సీట్ల సంఖ్య ఆ దామాషా ప్రకారం పెరుగుతాయి. కానీ, ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునేందుకు మహిళలకు గల హక్కును మరికొన్ని సంవత్సరాల పాటు నిరాకరించడానికి వీటిని ముందుకు తీసుకువచ్చారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును బిజెపి క్రమం తప్పకుండా తన ఎన్నికల ప్రణాళికల్లో చేరుస్తూ వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లోగా అమలు చేస్తామంటూ 2014 లోనే ఈ దేశ మహిళలకు హామీ ఇచ్చింది. ఆ రెండు ఎన్నికల తర్వాత లోక్‌సభలో బిజెపికి మెజారిటీ వచ్చింది. దాంతో ఈ బిల్లును తొక్కిపారేసింది. అధికారంలో వున్న తొమ్మిదేళ్లలో బిల్లును ఆమోదిస్తామన్న హామీని మాత్రం నెరవేర్చలేదు. ఇప్పుడు, రెండో పదవీ కాలం చివరిలో బిల్లును ప్రవేశ పెట్టింది. దీంతో తమ పని సులువైపోతుందని, పితృస్వామ్యపు తుట్టెను కదపకుండానే, తమకు రావాల్సిన ఓట్లు వచ్చేస్తాయని



> **దీంతో తమ పని సులువైపోతుందని, పితృస్వామ్యపు తుట్టెను కదపకుండానే, తమకు రావాల్సిన ఓట్లు వచ్చేస్తాయని బిజెపి, ప్రధాని గట్టి నమ్మకంతో వున్నట్లు కనిపిస్తోంది. కానీ కచ్చితంగా ఇదేదీ జరిగేది కాదు. దేశవ్యాప్తంగా మహిళలందరూ సంతోషంతో పొంగిపోయేందుకు ఇందులో ఏమీ లేదని, నిజానికి మోసపోయామని భావిస్తున్నారు. పార్లమెంట్‌లో కానీ, రాష్ట్రాల అసెంబ్లీల్లో గానీ తమ సంఖ్య పెరగకుండానే మరో సార్వత్రిక ఎన్నిక, అనేక రాష్ట్రాల ఎన్నికలు జరుగుతాయనే క్రూరమైన వాస్తవం వారి కళ్ళ ముందుంచబడింది.**

బిజెపి, ప్రధాని గట్టి నమ్మకంతో వున్నట్లు కనిపిస్తోంది.

కానీ కచ్చితంగా ఇదేదీ జరిగేది కాదు. దేశవ్యాప్తంగా మహిళలందరూ సంతోషంతో పొంగిపోయేందుకు ఇందులో ఏమీ లేదని, నిజానికి మోసపోయామని భావిస్తున్నారు. పార్లమెంట్‌లో కానీ, రాష్ట్రాల అసెంబ్లీల్లో గానీ తమ సంఖ్య పెరగకుండానే మరో సార్వత్రిక ఎన్నిక, అనేక రాష్ట్రాల ఎన్నికలు జరుగుతాయనే క్రూరమైన వాస్తవం వారి కళ్ళ ముందుంచబడింది.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ళలో, ప్రజాస్వామ్యానికి మూలాధారం అంటూ బిజెపి చెబుతున్న దానిలో లోక్‌సభలో మహిళల సీట్ల శాతం 5 శాతం నుండి ఈనాటి 15 శాతానికి మాత్రమే పెరిగింది. ఇది సిగ్గుపడాల్సిన వాస్తవంగా వుంది. ప్రపంచంలోని అనేక ఇతర దేశాలు మెరుగైన రికార్డును కలిగి వున్నాయి. పార్లమెంట్లకు ఎన్నికైన మహిళల సీట్ల సంఖ్య పరంగా చూస్తే భారత్ ఇరవయ్యవ స్థానంలో వుంది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇది మారవచ్చు, కానీ మారదు. మన దేశంలో మహిళలు పెద్ద సంఖ్యలో ఓటు వేస్తున్నారు, పైగా ప్రతి ఎన్నికతో ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది.

పైగా గాయాన్ని మరింత రేపేలా, 'బిల్లు లక్ష్యాలు–కారణాలు'ను ప్రభుత్వం పేర్కొంది. "మహిళా సాధికారత, మహిళల నేతృత్వంలో అభివృద్ధి ద్వారా, మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం గణనీయంగా మెరుగు పరచబడింది. విద్య, ఆరోగ్యానికి సమాన అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా 'నారీ శక్తి'కి పెద్ద పీట వేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్ మిషన్ కింద టాయిలెట్లకు అవకాశం, ముద్ర యోజన ద్వారా ఆర్థిక క్రమంలోకి తీసుకురావడం వంటి వివిధ చొరవల ద్వారా ముఖ్యంగా మహిళలకు ప్రశాంత జీవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే, మహిళల నిజమైన సాధికారతకు...నిర్ణయం తీసుకునే ప్రక్రియలో మహిళలు మరింత ఎక్కువగా పాల్గొనడం అవసరం. వారు విభిన్నమైన దృక్కోణాలతో చట్టసభల్లో చర్చలు జరిపి, నిర్ణాయక క్రమాన్ని మరింత పరిపుష్టం చేసి, నాణ్యతగా మారుస్తారు." అని ప్రభుత్వం పేర్కొంది.

ఉజ్వల యోజన అనేది లక్షలాదిమంది నిరుపేద మహిళలపై క్రూరమైన జోక్‌గా మారిందని రుజువైంది. వివిధ సాంకేతిక అభ్యంతరాల కారణంగా వారికి ఉచితంగా సిలిండర్లు రావడం లేదు. దాంతో ఇప్పుడు అత్యంత వ్యయభరితంగా మారిన సిలిండర్లను వారు కొనుగోలు చేయలేకపోతున్నారు. అలాగే, దేశంలో పలు ప్రాంతాల్లో నిర్మించిన తర్వాత, పని చేస్తున్న టాయిలెట్ల సంఖ్యకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న గొప్పలు కూడా కేవలం కాగితాలపైనే. కానీ, నిరుపేద మహిళల పారిశుధ్య పరిస్థితులు పెద్దగా మారలేదని, ఇంకా అలానే కొనసాగుతున్నాయనేది సిగ్గుచేటైన వాస్తవికతగా వుంది. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్‌కు హామీ కల్పించే బిల్లు అమలుకు సుదీర్ఘకాలం పట్టనుండడంతో...ఆచరణలో అత్యంత నిరుత్సాహకరంగా మారిన ఈ పథకాల ప్రస్తావన, సముచితంగా వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

> **మహిళా రిజర్వేషన్ వాస్తవ రూపం దాల్చడానికి జనాభా లెక్కల నిర్వహణ లేదా పునర్విభజన ప్రక్రియ ఏదీ అవసరం లేదు. బిల్లును ఆమోదించిన తక్షణమే రిజర్వేషన్‌ను అమలు చేయవచ్చు, జన గణన, పునర్విభజన ప్రక్రియలు నిర్వహించినపుడు సీట్ల సంఖ్య ఆ దామాషా ప్రకారం పెరుగుతాయి. కానీ, ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునేందుకు మహిళలకు గల హక్కును మరికొన్ని సంవత్సరాల పాటు నిరాకరించడానికి వీటిని ముందుకు తీసుకువచ్చారు.**

జనవాక్యం

మత్తుకు బానిసవుతున్న యువత

అతి చిన్న వయసులోనే మత్తు మందులకు బానిసలవుతూ అటు అనారోగ్యం బారిన పడుతూ ఇటు ఇంటిని గుల్ల చేస్తూ తమ బంగారు భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుంటోంది యువత. వారిని సరయిన దారిలో నడిపించే వారెవరు? క్షణికావేశంలో విచక్షణా జ్ఞానం కోల్పోయి చెడు స్నేహాల బారినపడి ఇటు ధూమపానం అటు మద్యపానం చేస్తూ తల్లిదండ్రులకు పుట్టెడు దు:ఖాన్ని మిగులుస్తున్నారు. ఇది ఏ మేరకు భావ్యమో ఒక్కసారి యువత విచక్షణాజ్ఞానంతో ఆలోచించాలి. అలాకాకుండా చదువు మీద ఏ మాత్రం ధ్యాస పెట్టకుండా ఆడింది ఆటగా పాడింది పాటగా ఇష్టనుసారంగా వ్యవహరిస్తూ పోతే మాత్రం ఇటు మీ బంగారు భవిష్యత్, అటు మీ తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న కోటి ఆశలు అడియాశలుగా మారతాయి. వారి శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. యువత తమతో పాటు ఆరోగ్యకరమైన సమాజాన్ని సైతం భ్రష్టుపట్టించిన వారవుతారు. ఇప్పటికైనా నిద్రాణావస్థలో వున్న యువత మేల్కొని, బాధ్యతతో మెలుగుతూ ధూమపానం, మద్యపానం వంటి వాటికి ఆమడ దూరంలో వుండాలి. దీనివల్ల తమ విలువైన కెరీర్‌ను అభివృద్ధి చేసుకుంటూ అటు తమ జీవితాలను చక్కబెట్టుకోవడంతో పాటు దేశాన్ని, తల్లిదండ్రులను సైతం ఉద్ధరించిన వారవుతారు.

– బి.ఎం.రెడ్డి, బేతంచెర్ల.

ప్రచారాల వంచన

సుపరిపాలన చేస్తుంటే పలు పత్రికల్లో భారీ ప్రకటన లెందుకు? కోట్ల కొలది ప్రజాధనం దుర్వినియోగం ఎందుకు? అభివృద్ధి సున్నా కాబట్టే...ప్రచారాల ద్వారా ప్రజలను నమ్మించేందుకు పాలకులు సరికొత్త పన్నాగం..!? అధినేతలు శంకుస్థాపనలకొచ్చినా..ప్రారంభోత్సవాలు చేస్తున్నా సంక్షేమ పథకాలు అందిస్తున్నా...కుప్పలు తెప్పలుగా....గొప్పలుగా అస్మదీయ పత్రికలలో విస్తృత గోబెల్స్ ప్రచారం. అప్పుల్లో వున్న రాష్ట్రానికి నొప్పి కలిగించే ఉదంతం ఇది. పాలకులారా... అధికార దండాన్ని ప్రజలు మీ చేతికిచ్చారు. పరిపాలన, ప్రచారం మీ ఇష్టం మరి! మీరు అధికారంలోకి వచ్చాక..ఏయే వస్తువులు ధరలు ఎంతెంత పెంచారో..పెరిగాయో కూడా ...పత్రికల్లో కాస్త ప్రచారం చేస్తే ప్రజలు వాస్తవం తెలుసుకుంటారు. మీ నిజాయితీని, పారదర్శకతను జనం మెచ్చుకుంటారు. లేకుంటే ప్రజలను మీరు నిజంగా వంచించినట్లే!

– జి.సూర్యనారాయణ, దివిసీమ.

సందర్భం

పండుగలు, ఉత్సవాలు - యువత

సామాజిక ఉత్సవాలు, పండుగల్లో యువత, పిల్లలు పాల్గొనడం ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. వినాయకచవితి, సంక్రాంతి, పీర్ల పండుగ లాంటి ప్రజల భాగస్వామ్యంతో జరిగే పండుగలు, ప్రార్థనమందిరాలు నిర్వహించే మత కార్యక్రమాలు, స్కూళ్లు, కాలేజీలు, అపార్ట్‌మెంట్లలో జరుపుకునే సామూహిక ఉత్సవాలు, బంధువులు, కుటుంబ సభ్యులు జరుపుకునే వేడుకల్లో అనేక కొత్త ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీటిని చూసి 'ఇది ఏమి వింతమ్మా! మా కాలం ఇలా లేదని' నిష్టూరంగా మాట్లాడే పాతకాలం పెద్దలు, 'ఇదే ఇప్పటి ట్రెండ్' అని సమర్థించుకుంటున్న యువత మనకు కనిపిస్తుంటారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఉత్సవాల్లో యువతీయువకులు, పిల్లలు పెద్ద సంఖ్యలో చొరవతో పాల్గొనడమేకాక, వారి కుటుంబ సభ్యులు కూడా ఆశ్చర్యపోయే రీతిలో వీరు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. 'మనిషి అన్నవాడు మాయమవుతున్నాడు' అని ఆవేదన చెందుతున్న పరిస్థితుల్లో ఈ రకమైన సామాజిక సంబంధాల్లోకి యువత వస్తుండడం మంచి పరిణామం. అయితే ఇక్కడే రెండు ప్రమాదాలు పొంచి వున్నాయి. తమ స్వంత చొరవతో ప్రజలు నిర్వహించుకునే పండుగలు, ఉత్సవాల్లోకి కొందరు మతతత్వవాదులు చేరి వాటిలో మతోన్మాదాన్ని ఎక్కించే ప్రయత్నాలు ఒకవైపు చేస్తుండగా, మరోవైపు ఈ కార్యక్రమాల్లో వ్యాపార సంస్కృతిని పెద్ద ఎత్తున పెంచుతున్నారు. ఈ రెండు ధోరణులు విడివిడిగానూ, జమిలిగానూ జొరబడుతున్నాయి.



వి. రాంభూపాల్

చదువుల్లో వచ్చిన మార్పులు

ఏ కాలంలోనైనా సామూహిక పండుగలు, ఉత్సవాల్లో యువత చురుకుగా పాల్గొంటారు. అయితే గత 30 సంవత్సరాలుగా దేశంలో అమలవుతున్న ప్రపంచీకరణ విధానాలు యువత జీవన పద్ధతుల్లో పెద్ద మార్పులు తెచ్చాయి. అప్పటి వరకు దేశ యువతలో అత్యధిక మంది గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. అక్షరాలు తెలుసుకునే కనీస చదువు వుంటే చాలనే భావన తల్లిదండ్రుల్లో వుండేది. అందుకని ఉన్నత పాఠశాలకు మించి చదివిన వారు గ్రామాల్లో అతి తక్కువగా వుండేవారు. గ్రామాల్లో జరిగే అన్ని రకాల ఉత్సవాలు, పండుగల ఏర్పాట్లు ప్రధానంగా గ్రామ పెద్దలు చేసేవారు, వీటి నిర్వహణలో యువకులు పాల్గొనేవారు. ఈ ఉత్సవాలను మహిళలు ఉత్సాహంతో తిలకించేవారు. తర్వాతి కాలంలో చదువుల్లో వచ్చిన మార్పులు గ్రామీణ, పట్టణ జీవితాలను మార్చివేశాయి. ప్రపంచంలో ఉత్పత్తి రంగం స్థంభించి, సేవారంగం విస్తరించడంతో అందులో పని చేయడానికి అవసరమైన నిపుణుల తయారీకి గిరాకీ పెరిగింది. అందుకనే మన రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా ఇంజనీరింగ్ కాలేజీలు వచ్చాయి. ఈ కోర్సులు చదివితే విదేశాలకు వెళ్లి డాలర్లు తేవచ్చనే ప్రచారం మారుమూల గ్రామాల్లోకి కూడా చేరింది.



ఇంజనీరింగ్ కోర్సులకు కృతిమ డిమాండ్ పెరిగింది. దేశంలో 2006–07లో 1151 ఇంజనీరింగ్ కాలేజీలు వుండగా, 2014–15 నాటికి 3345కు పెరిగాయి. అందులో మన రాష్ట్రంలోనే 700 కాలేజీలు వచ్చాయి. ఈ సంవత్సరం 1,49,154 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ చదువుతున్నారు. కేవలం ఇంజనీరింగే కాదు ఇంటర్, డిగ్రీ ఇలాంటి అనేక రకాల కోర్సులు వచ్చాయి. వీటి వల్ల కొద్దిమందికి కొత్త ఉపాధి అవకాశాలు వచ్చాయి. చూస్తుండగానే గ్రామాల్లో కొన్ని ఇళ్ల ముందుకు కొత్త కార్లు, ఇంట్లోకి కొత్త ఫర్నిచర్, కొత్తకొత్త వస్తువులు, రకరకాల దుస్తులు, కొత్త అలవాట్లు పెరిగాయి. ఇది మరింతగా కొత్త చదువుల వైపు ప్రజలను తరిమింది. తల్లిదండ్రుల ఆర్థికశక్తితో, పిల్లల శక్తిసామర్థ్యాలతో సంబంధం లేకుండా చదువులు కొనే సంస్కృతిని పెంచింది. చిన్నవయసు పిల్లలను ప్రైవేట్ లేదా కార్పొరేట్ స్కూళ్లు, హాస్టళ్లలో వేయడం పెరిగింది. ఇంటర్ చదువంటే నారాయణ, చైతన్య అనేట్లుగా పరిస్థితి మారింది. పండుగలు, ఉత్సవాలు, పెళ్ళిళ్లు, చావులు ఏదైనా సరే చదువు తర్వాతే అనే వింత మనస్తత్వం పెరిగింది. ఈ క్రమంలో పిల్లలు సామూహిక, సామాజిక కార్యక్రమాలకు పూర్తిగా దూరమయ్యారు. తమ చేతిలో ప్రపంచాన్ని చూడగలిగే సెల్‌ఫోన్, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్ లాంటి అనేక పరికరాలు, మంచి వేతనాలు వున్నాయి. కాని తాము ఉత్సాహంగా పాల్గొనే కార్యక్రమాలు కరువయ్యాయి. మనుషులతో కలిసి జీవించే రోజులు కుదించుకుపోయాయి.

> **సరళీకరణ విధానాల వల్ల సమిష్టి జీవనం నుండి ఒంటరైపోయి, అన్నీ ఉన్నా ఏమీ లేని వైరాగ్యజీవనం నుండి తమకు తాము బయటపడడానికి యువత పడుతున్న ఘర్షణలో భాగంగా జరుగుతున్న సామూహిక, సామాజిక ఉత్సవాల్లోకి..మతతత్వం, వినిమయతత్వం జొరబడుతున్నాయి. వినాయకచవితి ఉత్సవాల్లో ప్రజల డబ్బుతో, వారి భాగస్వామ్యంతో నిర్వహించుకునే మండపాలను తమ మతోన్మాద ఎజెండాకు అనుగుణంగా ఏర్పాటు చేయించడం, అక్కడ మత జెండాలు పెట్టడం, యువత తలలకు రిబ్బన్లు పెట్టించడం, రెచ్చగొట్టే నినాదాలను ఇవ్వడం, భక్తిపేరుతో ద్వేషాన్ని నూరిపోయడం జరుగుతున్నది. వీటిపట్ల విజ్ఞులైన యువత అప్రమత్తంగా ఉండాలి. తాము కోరుకుంటున్న సామూహిక నవజీవన బృందావనానికి చీడపురుగుల లాంటి వారిని ఏరివేయాలి.**

'జగమంత కుటుంబం నాది... ఏకాకి జీవితం నాది'గా మారింది.

యువత ఎందుకు ఆకర్షితులవుతున్నారు?

ఈ నేపథ్యంలో యువత ఎక్కువగా మాస్ ఫెస్టివల్స్, ఉత్సవాల పట్ల ఆకర్షించబడడానికి అనేక కారణాలు ఉన్నాయి. సంక్రాంతి, వినాయకచవితి, పీర్ల పండుగ లాంటి సాంస్కృతిక వారసత్వ పండుగల్లో సమూహాలుగా పాల్గొనే అంశం యువతను ఆకర్షిస్తుంది. ఈ పండుగల సందర్భంగా జరిగే సామూహిక అంశాల్లో యువతదే ప్రధాన పాత్ర. వినాయకచవితి, పీర్ల పండుగల్లో నిర్వహణ కమిటీలుగా ఏర్పడడం, విరాళాలు వసూలు చేయడం, సమిష్టిగా నిర్ణయించుకోవడం, వ్యక్తిగతంగా పని చేయడం, కార్యక్రమాల నిర్వహణ పర్యవేక్షణ, కార్యక్రమానంతరం సమీక్షించుకోవడం జరుగుతుంది. ఇది ఏదో సంఘటిత సంస్థ నిర్ణయించుకున్న క్రమపద్ధతి లాగా అమలవుతుంటాయి. వాస్తవంగా ఇది తరతరాల నాటి సామూహిక సహ జీవన విధానం.

ఈ పండుగలు, ఉత్సవాల సందర్భంగా వినూత్నంగా వేదికలు (మండపాలు), కొత్త సంప్రదాయాలు, కళారూపాలు, సంగీతనృత్యాలు మరియు వంటకాల ఏర్పాటుకు, ఆనందంగా పాల్గొనడానికి యువత వీటిని వేదికలుగా చూస్తున్నారు. తమ లాంటి అభిరుచులు కలిగిన వారితో బృందాలుగా ఏర్పడడానికి, కొత్త సంబంధాలు పెంచుకోవడానికి, కొత్త అనుభవాలను పొందడానికి ఇవి తోడ్పడుతున్నాయి. వ్యక్తిగతంగా ఎంత మంచి ఆర్థిక స్థాయిలో వున్నా సమూహంలో పాల్గొని సంతృప్తి పొందడం అంత సులభం కాదు. ఏ పరిస్థితుల నుండి వారు దూరమయ్యారో ఆ పరిస్థితులను కొద్దిరోజుల పాటైనా ఇక్కడ పొందగలుగుతున్నారు. తమ లోని సృజనాత్మకతను ప్రదర్శించుకునేందుకు ఇవి సరైన వేదికలు. చదువులు, ఉద్యోగాల ఒత్తిళ్ళతో తమలోని అనేక నైపుణ్యాలను అనేక సంవత్సరాలుగా అణుచుకోవాల్సిన పరిస్థితి. దాంతో డిజైనింగ్, ఫ్యాషన్, కళ, సంగీతం, నృత్యం లాంటి అంశాల్లో తమలో దాగివున్న ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శించుకునేందుకు ఇక్కడ పోటీలు పడుతున్నారు. పీర్ల పండుగల్లో నిప్పుల గుండం దగ్గర చేసే అలాయి (చిందు) సందర్భంగా కొద్దిమంది యువకులు ఒకేతరహా డ్రస్సులు, గొడుగులు, చేతిలో ధరించే పరికరాలతో పాల్గొంటుండడాన్ని మనం చూస్తున్నాము. అనే శతాబ్దాలుగా చిందు వేసే ఆచారం వున్నప్పటికీ ఇలాంటి ప్రత్యేక ఆకర్షణలు లేవు. ఎక్కడెక్కడో వున్న యువత సెల్‌ఫోన్ నెట్‌వర్కు ద్వారా ముందుగా సన్నాహాలు చేసుకొని పండుగ సందర్భంగా గ్రామాలకు, పట్టణాలకు రావడం వాటిని ప్రదర్శించడం జరుగుతున్నది. గతంలో పీర్ల పండుగలో మగవారు మాత్రమే అలాయి ఆడేవారు, ఇప్పుడు అమ్మాయిలు కూడా పెద్ద సంఖ్యలో ఆడుతున్నారు.

వినాయక చవితి సందర్భంగా కూడా ఇలాంటి అంశాలు అనేకం ఉన్నాయి. మండపాల దగ్గర నిర్వాహకులంతా ఒకే డ్రస్సుతో వుండడం, రోజుకో రకం సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, మిమిక్రీలు, అభినయాలు, డి.జె సంగీత వాద్యాల పట్ల ఆసక్తి వున్న వారిని ఈ పండుగ అయస్కాంతంలా ఆకర్షిస్తున్నది. తమ ప్రతిభను ప్రదర్శించుకోవడానికి ఇవి సరైన స్థలాలుగా యువత భావిస్తున్నారు. రొటీన్ కార్యక్రమాల నుండి విరామం పొందడానికి ఈ పండుగలు, ఉత్సవాలు ఉపయోగ పడుతున్నాయి. రోజువారీ ఒంటరితనం, నీరసం నుండి కొద్ది రోజులైనా ఉపశమనం పొందడానికి, కొత్త పరిసరాల్లో కొత్త పద్ధతులను అమలు చేయడానికి ఇవి వారికి ఉత్సాహాన్నిస్తున్నాయి. ఇక్కడ చేసే కార్యక్రమాలను, ప్రదర్శలను, తమ నైపుణ్యాన్ని, తమ అస్థిత్వాన్ని ఇతరులతో పంచుకోవడానికి సోషల్ మీడియా ముఖ్య పాత్ర పోషిస్తున్నది. వాట్సప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో, ఇన్‌స్టాగ్రాముల్లో వీడియోలు, ఫోటోల పోస్టింగ్‌లు, రీల్స్...ఈ కార్యక్రమాల్లో పాల్గొనడానికి మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

ఉత్సవం ఏదైనా ఉత్సాహం, ఉల్లాసం కావాలి

ప్రార్థనా మందిరాలు నిర్వహించే కార్యక్రమాల్లో కూడా యువత ఈ రకమైన ఆసక్తులతో పాల్గొంటున్నారు. రథం, విగ్రహాల ఊరేగింపులు, రంజాన్, క్రిస్మస్ సందర్భంగా జరిగే అన్ని కార్యక్రమాల్లో ఒకే తరహా డ్రస్సులతో పాల్గొంటున్న ధోరణి పెరుగుతున్నది. వివాహాల్లో కూడా ఇదే పద్ధతి వచ్చింది. ఒంటరిగా అదనపు డబ్బు చెల్లించి దైవదర్శనం పొందవచ్చేమో కాని...ఇలాంటి సామూహిక సంతృప్తిని పొందలేరు. నైవేద్యాల కోసమని చేసే రకరకాల వంటకాలు ప్రదర్శించుకోవడానికి, కొత్త వ్యక్తులతో సంబంధాలు కలుపుకోవడానికి ఈ ఉత్సవాలు తోడ్పడుతున్నాయి. వీటిలో భక్తిభావం ఉన్నప్పటికీ సామూహిక, సామాజిక సృజనాత్మకత ప్రధానంగా వుంటుంది. పాఠశాలలు, కాలేజీలు నిర్వహించే ఉత్సవాల్లో పిల్లలు, తల్లిదండ్రులు ఎంతో ఆసక్తితో పాల్గొంటున్నారు. వీటిల్లో తమ పిల్లలు పాల్గొనేందుకు వేలకు వేలు ఖర్చుపెట్టి విచిత్ర వేషాలు, నాట్యాలు, డ్యాన్సులు వేయిస్తున్నారు. ఈ ప్రదర్శనలను సెల్‌ఫోన్లలో బంధించి బంధువులకు, మిత్రులకు చూపించి వారి నుండి ప్రశంసలు పొందడం చూస్తున్నాము. ఇలాంటి వాటిల్లో పాల్గొనడానికి పిల్లల కంటే తల్లులే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. తాము కోల్పోయిన బాల్యాన్ని తమ పిల్లల్లో చూసుకొని ఆనందం పొందడం జరుగుతుంది. ఆపార్ట్‌మెంట్ ఫంక్షన్లు, ఫ్యామిలీ గెట్‌టుగెదర్లు కూడా ఇలాంటి సామూహిక ఆసక్తిలో భాగమే.

మతతత్వం, వినిమయతత్వాల చొరబాటు

సరళీకరణ విధానాల వల్ల సమిష్టి జీవనం నుండి ఒంటరైపోయి, అన్నీ ఉన్నా ఏమీ లేని వైరాగ్య జీవనం నుండి తమకు తాముగా బయటపడేందుకు యువత పడుతున్న ఘర్షణలో భాగంగా జరుగుతున్న సామూహిక, సామాజిక ఉత్సవాల్లోకి..మతతత్వం, వినిమయతత్వం జొరబడు తున్నాయి. వినాయక చవితి ఉత్సవాల్లో ప్రజల డబ్బుతో, వారి భాగస్వామ్యంతో నిర్వహించుకునే మండపాలను తమ మతోన్మాద ఎజెండాకు అనుగుణంగా ఏర్పాటు చేయించడం, అక్కడ మత జెండాలు పెట్టడం, యువత తలలకు రిబ్బన్లు పెట్టించడం, రెచ్చగొట్టే నినాదాలను ఇవ్వడం, భక్తి పేరుతో ద్వేషాన్ని నూరిపోయడం జరుగుతున్నది. వీటి పట్ల విజ్ఞులైన యువత అప్రమత్తంగా ఉండాలి. తాము కోరుకుంటున్న సామూహిక నవజీవన బృందావనానికి చీడపురుగుల లాంటి వారిని ఏరివేయాలి. విచ్చలవిడిగా వినిమయ సంస్కృతిని పెంచే వ్యాపార ధోరణులను అరికట్టాలి. భారీ ఖర్చులతో తాము చేసే ప్రతి ఉత్సవం అంతిమంగా తమను అప్పుల్లో ముంచి కార్పొరేట్ కంపెనీలు లాభాలు పెంచేందుకే అని గుర్తించాలి. సమూహాలతో కలిసి చేసుకునే కార్యక్రమాలకు ఆటంకమయ్యే అన్ని ధోరణులను ప్రతిఘటించాలి. మనస్సుల్లో ఐక్యతాభావం వెల్లివిరియాలి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref: B1/227/2021 **ఫారం నెం.VII** ది.19-09-2023

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్-25, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్ధిష్టపరచిన కట్టడములు మరియు చెట్లు ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపునకు గురయ్యే నిమిత్తం అల్లూరి సీతారామరాజు కూనవరం మండలం వాల్‌ఫర్డ్‌పేట గ్రామమునకు సంబంధించిన కట్టడములు మరియు చెట్లు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు భావించినందున 2013వ సంవత్సరము, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్‌లను సమకూర్చినారు. ఈక్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా కట్టడములు మరియు చెట్లు ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ముంపునకు గురయ్యే నిమిత్తం అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: అల్లూరి సీతారామరాజు | మండలం: కూనవరం | గ్రామం: వాల్‌ఫర్డ్ పేట

వ. నెం.	సర్వే నెం.	భూ వివరములు	డోర్. నెం.	ప్లాటు నెం.	ఇంటి యజమాని పేరు	ఇంటి స్వభావం	ప్రహరీ గోడ	హద్దులు తూ	ప	ఉ	ద	ఇతర కట్టడములు	చెట్లు వివరాలు
1	3/p	పట్టా	--	1	కారం వెంకటరావు తండ్రి కన్నయ్య (చర్చి)	సిమెంటు రేకుల చర్చి	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల షెడ్డు	తాటి-2
2	3/p	పట్టా	4-29	2	కారం వెంకటరావు తండ్రి కన్నయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	ఐ.టి.డి.ఏ రోడ్డు	ఖాళీ స్థలం	పూసం అక్కమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్	తాటి-1
3	3/p	పట్టా	4-37	3	పూసం అక్కమ్మ భర్త ప్రసాదు	తాటాకుల ఇల్లు	లేదు	కారం కన్నయ్య	ఐ.టి.డి.ఏ రోడ్డు	కారం వెంకటరావు	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్	తాటి-2
4	3/p	పట్టా	4-38	4	కారం కన్నయ్య తండ్రి లచ్చయ్య	సిమెంటురేకుల ఇల్లు	లేదు	కారం కన్నయ్య	పూసం అక్కమ్మ	కారం వెంకటరావు	అంగన్‌వాడీ సెంటర్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల కోళ్ళ పాక, సిమెంటు రేకుల వంట షెడ్డు, బోర్‌వెల్, పశువుల పాక	సీతాఫలం-1 జామ-1 మామిడి-2 కొబ్బరి-1 తాటి-1
5	3/p	పట్టా	4-25	5	కారం కుమారి భర్త బుచ్చయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	కారం కుమారయ్య	ఖాళీ స్థలం	గాలి నర్సమ్మ	----	..
6	3/p	పట్టా		6	అంగన్‌వాడీ బిల్డింగ్	డాబా బిల్డింగ్	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	కారం కన్నయ్య	గాలి నర్సమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్	..
7	3/p	పట్టా	4-34	7	గాలి నర్సమ్మ భర్త నాగయ్య	డాబా బిల్డింగ్	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	అంగన్‌వాడీ సెంటర్	మల్లెం ధర్మరాజు	సిమెంటు రేకుల బాత్‌రూమ్, సిమెంటు రేకుల షెడ్డు, కోళ్ల పాక, సిమెంటు రేకుల షెడ్	జామ-2 నిమ్మ-2
8	3/p	పట్టా		8	పి.త్యాగరాజన్ చర్చి	సిమెంటు రేకుల చర్చి	1 సైడు	దారి	ఐ.టి.డి.ఏ రోడ్డు	ఖాళీ స్థలం	దారి	సిమెంటు రేకుల షెడ్డు	..
9	3/p	పట్టా	4-33	9	మల్లం భద్రమ్మ భర్త సింగయ్య	సిమెంటు గోడలతో తాటాకుల ఇల్లు	లేదు	మల్లెం ధర్మరాజు	చర్చి	గాలి నర్సమ్మ	సోడి వీరభద్రం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, కోళ్లపాక	జామ-1 మామిడి-1 వేప-1
10	3/p	పట్టా	4-33/1	10	మలం ధర్మ రాజు తండ్రి సింగయ్య	డాబా బిల్డింగ్	లేదు	ఖాళీ స్థలం	మల్లెం భద్రమ్మ	గాలి నర్సమ్మ	సోడి వీరభద్రం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ సిమెంట్ రేకుల రూమ్స్-2 తాటాకుల వంటపాక బోర్‌వెల్	సీతాఫలం-1 మామిడి-3
11	3/p	పట్టా	4-28/1	11	సోడె వీర భద్రం తండ్రి పిచ్చయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	దారి	మల్లెం ధర్మరాజు	కారం ముత్తయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్, యాష్ బ్రిక్స్ పునాది	దానిమ్మ-1
12	3/p	పట్టా	4-28	12	కారం రామతులసి భర్త లేటు ముత్తయ్య	సిమెంటురేకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	దారి	సోడి వీరభద్రం	కారం రత్తయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు, పశువుల పాక	జామ-1 దానిమ్మ-1
13	3/p	పట్టా	4-26	13	కారం రత్తయ్య తండ్రి పిచ్చయ్య	సిమెంటు గోడలతో తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	దారి	కారం ముత్తయ్య	ముర్రం సీతయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్, కోళ్లపాక	జామ-1 మామిడి-1 సీతాఫలం-2
14	3/p	పట్టా	4-31/1	14	సోడె రాము తండ్రి పిచ్చయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ముర్రం చిన్నక్క	ఆర్ & బి రోడ్డు	దారి	కారం భద్రమ్మ	-----	..
15	3/p	పట్టా	4-31/2	15	ముర్రం చిన్నక్క భర్త బుచ్చయ్య	తాటాకుల ఇల్లు	లేదు	దారి	సోడె రాము	దారి	కారం భద్రమ్మ	---	..
16	3/p	పట్టా	4-31	16	కారం భద్రమ్మ భర్త నారాయణ	తాటాకుల ఇల్లు	లేదు	దారి	ఆర్ & బి రోడ్డు	ముర్రం చిన్నక్క	కారం శాంతమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్	జామ-2 నిమ్మ-1
17	3/p	పట్టా	4-30	17	కారం శాంతమ్మ భర్త నారాయణ	సిమెంటు గోడలతో తాటాకుల ఇల్లు	లేదు	దారి	ఐ.టి.డి.ఏ రోడ్డు	కారం భద్రమ్మ	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, పశువుల పాక	నిమ్మ-1 తాటి-1 చింత-1
18	3/p	పట్టా	4-24	18	ముర్రం సీతయ్య తండ్రి ముత్తయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	కారం రత్తయ్య	కిచ్చా శంకురు	సిమెంటు రేకుల బాత్‌రూమ్	నిమ్మ-1
19	3/p	పట్టా	4-23	19	కిచ్చా శంకురు తండ్రి ఎర్రయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	దారి	ఖాళీ స్థలం	కారం కన్నారావు	సిమెంటు రేకుల బాత్‌రూమ్	మామిడి-2 జామ-2 నిమ్మ-1
20	3/p	పట్టా	4-22	20	కారం కన్నారావు తండ్రి వెంకయ్య	సిమెంటు రేకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	దారి	కిచ్చా శంకురు	కారం కన్నారావు	సిమెంటు రేకుల బాత్‌రూమ్ పాత గోడలు కొత్తగా నిర్మాణముతో ఉన్నది, పశువుల పాక	నిమ్మ-3 జామ-2 సీతాఫలం-1
21	3/p	పట్టా	4-20	21	కారం రాజారావు తండ్రి వీరయ్య	తాటాకుల ఇల్లు	లేదు	దారి	కారం చంద్రయ్య	ఖాళీ స్థలం	కిచ్చా వీరయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు.	మామిడి-1
22	3/p	పట్టా	4-21	22	కారం చంద్రయ్య తండ్రి దారయ్య	తాటాకుల ఇల్లు	లేదు	కారం రాజారావు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు, కోళ్లపాక	నిమ్మ-2 మామిడి-1 చింత-1
23	4/p	పట్టా	4-15	23	కారం కన్నమ్మ భర్త వెంకయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	దారి	కారం కన్నారావు	కారం శంకురు	సిమెంటు రేకుల బాత్‌రూమ్	సీతాఫలం-2 కొబ్బరి-1 జామ-1 మామిడి-1 సపోట-1 టేకు-1 వేప-1 ఉసిరి-2
24	4/p	పట్టా	4-14	24	కారం శంకర్ తండ్రి వెంకయ్య	సిమెంటు రేకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	దారి	కారం కన్నమ్మ	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు.	సీతాఫలం-2 మామిడి-2 కొబ్బరి-1 దానిమ్మ-1 నిమ్మ-1 జామ-1
25	4/p	పట్టా	4-18	25	బొడ్డు బాబు తండ్రి కన్నయ్య	సిమెంటు రేకుల ఇల్లు	లేదు	దారి	ఆర్ & బి రోడ్డు	కారం చంద్రయ్య	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు-2 పశువుల పాక	నిమ్మ-4 జామ-1 తాటి-6
26	4/p	పట్టా	4-17	26	బొడ్డు చందు తండ్రి సిరమయ్య	పెంకుటిల్లు	లేదు	బొడ్డు సిరమయ్య	బొడ్డు బాబు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	----	..
27	4/p	పట్టా	4-16	27	బొడ్డు సిరమయ్య తండ్రి కన్నయ్య	డాబా బిల్డింగ్	లేదు	దారి	బొడ్డు చందు	కారం రాజారావు	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు, సిమెంటు రేకుల ఎదుట షెడ్డు, బోరు బావి, తాటాకుల షెడ్డు తాటాకుల గోడ్ల పాక.	కొబ్బరి-1 నిమ్మ-1 చింత-1
28	4/p	పట్టా	4-10	28	బొడ్డు జోగారావు తండ్రి పిచ్చయ్య	తాటాకుల ఇల్లు	లేదు	సోడి పిచ్చయ్య	ఆర్ & బి రోడ్డు	బొడ్డు సిరమయ్య	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు, సిమెంటు రేకుల షెడ్, తాటాకుల పశువులపాక	నిమ్మ-1 జామ-2 సీతాఫలం-1 మామిడి-1 విప్ప-1 వేప-1
29	4/p	పట్టా	4-12	29	సోడి పిచ్చయ్య తండ్రి రామయ్య	తాటాకుల ఇల్లు	లేదు	దారి	బొడ్డు జోగయ్య	బొడ్డు సిరమయ్య	దారి	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు.	మామిడి-1 చింత-1
30	4/p	పట్టా	4-6	30	కొమరం వెంకన్న బాబు తండ్రి రామారావు	పెంకుటిల్లు	లేదు	దారి	ఖాళీ స్థలం	దారి	కారం ఎర్రయ్య	సిమెంటురేకుల బాత్ రూమ్, తాటాకుల వంట షెడ్డు.	నేరేడు-1 చింత-1
31	4/p	పట్టా	4-7	31	కారం ఎర్రయ్య తండ్రి నారాయణ	తాటాకుల ఇల్లు	లేదు	కారం సీతమ్మ	ఖాళీ స్థలం	కారం వెంకన్నబాబు	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు.	మామిడి-1 సీతాఫలం-1
32	4/p	పట్టా	4-8	32	కారం సీతమ్మ భర్త పెద నారాయణ	సిమెంటురేకుల ఇల్లు	లేదు	దారి	కారం ఎర్రయ్య	కారం వెంకన్నబాబు	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్	..
33	4/p	పట్టా	4-9	33	కారం వెంకయ్య తండ్రి నారాయణ	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	ఆర్ & బి రోడ్డు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట షెడ్డు, తాటాకుల కోళ్ళ షెడ్డు.	సీతాఫలం-1 మామిడి-1 నిమ్మ-1 తాటి-13
34	4/p	పట్టా	4-4	34	కారం శ్రీను తండ్రి బుచ్చయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	కారం వెంకటేశ్వర్లు	ఖాళీ స్థలం	సోడి నాగమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల గోడ్ల పాక, బడ్డీ కొట్టు. కోళ్ల పాక	నిమ్మ-1 సీతాఫలం-5 జామ-2 దానిమ్మ-2 మామిడి-2 కొబ్బరి-1 నేరేడు-1
35	4/p	పట్టా	4-3	35	సోడె నాగమ్మ భర్త వెంకటేశ్వర్లు	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	కారం శ్రీను	ఖాళీ స్థలం	తాటాకుల కోళ్ళపాక	నిమ్మ-1 దానిమ్మ-1
36	4/p	పట్టా	4-19	36	కారం చెన్నకేశవరావు తండ్రి చిన వెంకయ్య	తాటాకుల ఇల్లు	లేదు	దారి	ఖాళీ స్థలం	దారి	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్ రూమ్, తాటాకుల కోళ్ళ పాక.	జామ-2 చింత-1
37	4/p	పట్టా	4-5	37	కారం చినవెంకయ్య తండ్రి నారాయణ	తాటాకుల ఇల్లు, గోడలు లేవు	లేదు	దారి	ఖాళీ స్థలం	కారం వెంకటేశ్వర్లు	ఖాళీ స్థలం	-----	..
38	4/p	పట్టా	4-2/1	38	కారం బాలరాజు తండ్రి వెంకటేశ్వర్లు	సిమెంటురేకుల ఇల్లు	లేదు	కారం వెంకటేశ్వర్లు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	ఫాస్ట్ ఫుడ్ సెంటర్ షెడ్ పాక	..
39	4/p	పట్టా	4-2	39	కారం వెంకటేశ్వర్లు తండ్రి వెంకయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	కారం బాలరాజు	ఖాళీ స్థలం	కారం భద్రయ్య	సిమెంటు రేకుల బాత్ రూమ్, తాటాకుల వంట షెడ్డు.	జామ-1 నిమ్మ-5 ఉసిరి-1 చింత-1
40	4/p	పట్టా	4-1	40	కారం భద్రయ్య తండ్రి తమ్మయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	కారం వెంకటేశ్వర్లు	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్ రూమ్, తాటాకుల కోళ్ళ పాక. సిమెంటు రేకుల షెడ్డు.	జామ-1 మామిడి-1 నిమ్మ-1 చింత-1
41	5/p	పట్టా	5-247	41	కారం వీరభద్రం తండ్రి రాజారావు	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	కారం బాబు	సిమెంటు రేకుల బాత్ రూమ్	నిమ్మ-1 విప్ప-1 తాటి-1
42	5/p	పట్టా	4-13	42	కారంచిన్నబ్బి తండ్రి ఎర్రయ్య	తాటాకుల ఇల్లు	లేదు	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	కారం వీరభద్రం	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్ రూమ్, తాటాకుల వంట షెడ్డు, పశువుల పాక	..
43	3/p	పట్టా	4-30/1	43	కారం బాలు తండ్రి నారాయణ	తాటాకుల ఇల్లు	లేదు	దారి	కారం నాగమ్మ	కారం భద్రమ్మ	ఖాళీ స్థలం	-----	జామ-1 మునగ-1 ఉసిరి-1

పైన తెలిపిన రూఢీ ప్రకటన నిమిత్తం వచ్చిన అభ్యంతరములు అన్నియూ పరిశీలించిన పిదప 2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం 30/2013 ప్రకారం బొజ్జరాయగూడెం గ్రామములో నిర్వాసిత కుటుంబముల వారికి పునరావాసం నిమిత్తం యీ క్రింది తెలిపిన గ్రామము నందు భూమి సేకరించుట జరిగియున్నది.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

పునరావాస మరియు పున:స్థాపన ప్రతిపాదన ఉత్తర్వులు దీనికి జతపరచడమైనది. ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కూనవరం యూనిట్, చింతూరు నందు ఉంచడమైనది. దానిని ఆ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

సం/- **ఎస్.సరళవందనం,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఎయుతో శ్రీలంక వర్సిటీ అధికారుల చర్చలు

ప్రజాశక్తి- విశాఖపట్నం

ఆంధ్రవిశ్వవిద్యాలయం అధికారులతో శ్రీలంకకు చెందిన శ్రీజయవర్ధన విశ్వవిద్యాలయం అధికారులు సమావేశం అయ్యారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి,రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య పి.డి.సత్యపాల్, డాక్టర్ హెచ్.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. శ్రీలంకలోని శ్రీ జయవర్ధన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం.పద్మలాల్, పాలి-బుద్దిస్ట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఎం.విజితానందలు పాల్గొన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం పాలి-బుద్దిస్ట్ స్టడీస్ అంశంలో ఎం.ఏ కోర్సును ప్రారంభించే దిశగా అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకోవడానికి సన్నాహకంగా ఈ సదస్సు నిర్వహించారు. రెండు విశ్వవిద్యాలయాలలో వసతులు, కోర్సు నిర్వహణకు సాధ్యాసాధ్యాలను చర్చించారు.

ఇళ్లకు నిబంధన అడ్డంకి

- తమ వాటా నగదుగానే ఇవ్వాలంటున్న కేంద్రం
- తక్కువ ధరకు సామగ్రి ఇస్తున్నామంటున్న రాష్ట్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద నిర్మించాల్సిన ఇళ్లపై నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయి. కేంద్రం ఒక విధంగా ఆదేశాలు జారీ చేస్తుండగా, అందుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తన కొత్త వాదనను తెరపైకి తీసుకొస్తోంది. దీని ప్రభావం ఇళ్ల నిర్మాణంపై పడుతోందని అధికారులు, బ్యాంకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మరోసారి కేంద్రానికి లేఖ రాయాలని కూడా గృహనిర్మాణ సంస్థ భావిస్తోంది. ఈ ఇళ్ల నిర్మాణానికి కేంద్రం, రాష్ట్రం కొంత నిధులను వాటాలుగా భరిస్తాయి. ఇందులో కేంద్రం ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు భరిస్తుంది. అయితే ఈ నిధులను లబ్ధిదారులకు నగదు రూపంలోనే ఇవ్వాలని కేంద్రం నిబంధన పెట్టింది. ఇందులోనే ఒక మెలిక కూడా పెట్టింది. సిమెంట్, స్టీల్, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రిని అందించలేని పక్షంలో తమ నిధులను నగదు రూపంలో ఇవ్వాలని పేర్కొంది. అలాగే ఈ ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని కూడా కేంద్రం నిర్దేశించింది. ఈ రెండింటిలో ఏది పాటించకపోయినా నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమన్న భావాన్ని వ్యక్తం చేసింది.

తాము 13 రకాల ఇళ్ల నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు తక్కువ ధరకే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. ఈ రేట్లను కూడా తాజాగా ఖరారు చేసి తమ వాటా నిధుల ద్వారా అందిస్తున్నట్లు వారు వెల్లడించారు. రివర్స్ టెండరింగ్ ద్వారా ముందుకు సాగుతున్నట్లు వివరించింది. అయితే సామగ్రిని తమ వాటా నిధులతో అందిస్తుండడంతో కేంద్రం ఇచ్చే నిధులను నగదు రూపంలోనే అందించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను ఇతర అవసరాలకు వ్యయం చేయడంతో ఇప్పుడు తలనొప్పులు కలుగుతున్నట్లు వారంటున్నారు. అందుకే బ్యాంకుల ద్వారా ఈ నిధులను లబ్ధిదారులకు అందించాలన్న యోచనలో రాష్ట్ర అధికారులు ఉన్నట్లు సమాచారం. కేంద్రం నుంచి బ్యాంకర్లకు కూడా ఇళ్ల నిర్మాణంపై స్పష్టమైన సూచనలు వచ్చినట్లు తెలిసింది. దీంతో నిధులు సర్దుబాటు చేయలేకపోతే ఇళ్ల నిర్మాణంలో జాప్యం తప్పదన్న భావాన్ని కొంతమంది బ్యాంకర్లు వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న పంటలు

- వర్షం కోసం రైతన్నల ఎదురుచూపు
- బనగానపల్లె మండలంలో 40 శాతం మాత్రమే సాగు

ప్రజాశక్తి - బనగానపల్లె (నంద్యాల)

ఆరుగాలం కష్టపడే రైతులు ఏటా అతివృష్టి, అనావృష్టితో నష్టపోతునే ఉన్నారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఇటీవల అరకొర వర్షాలు పడినా పూర్తిస్థాయిలో అదను కాకపోవడంతో 15 రోజులకే రైతులు సాగు చేసిన కంది, కొర్ర పంటలు ఎండిపోతున్నాయి. మండలంలో 45 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఈ ఖరీఫ్‌లో 24,250 ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉంది. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల మండలంలో ఇప్పటివరకు 10,250 ఎకరాల్లో మాత్రమే పంటలను సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని కటికవానికుంట, ఫతేనగరం, పసుపుల, పెద్దరాజుపాలెం, చిన్నరాజుపాలెం, క్రిష్ణగిరి, చెర్లో కొత్తూరు, జోలాపురం, పాతపాడు, మీరాపురం, యాగంటి పల్లె, యనకండ్ల ఎర్రగుడి, హుస్సేనాపురం, రామకృష్ణాపురం, రాళ్ల కొత్తూరు తదితర గ్రామాలలో కంది 3405 ఎకరాలు, కొర్ర 375 ఎకరాలు, పత్తి 450 ఎకరాల్లో వర్షాధారం కింద రైతులు పంటలను సాగు చేశారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 65.3 మి.మీ గాను 42.8 మి.మీ, జూలైలో 106.3 మి.మీ గాను 99.4, ఆగస్టులో 116.4 మి.మీ గాను 62.8 మి.మీ వర్షపాతం నమోదయింది. సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షం కురవడంతో రైతులు ఖరీఫ్‌లో సాధారణ సాగు కంటే తక్కువగా సాగు చేశారు. దీనికి తోడు ఎస్‌ఆర్‌బిసి కాల్వకు నీరు రాకపోవడంతో కాల్వ కింద రైతులు పంటలు సాగు చేయలేదు. సెప్టెంబర్ నెలలో ఒక మోస్తరు వర్షాలు కురిసినా పూర్తిస్థాయిలో అదును కాకపోవడంతో వర్షం కురిసిన 15 రోజులకే పంటలు వాడుముఖం పడుతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు పంటలను సాగు చేస్తే వర్షాలు లేక ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బోర్లు, బావుల కింద రైతులు మొక్కజొన్న, పత్తి, మిరప, వరి పంటలను సాగు చేయగా బోర్లలో భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలకు నీరందని పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాలలో బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం బనగానపల్లె ప్రాంతాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కిసాన్ రైలు జాడ ఎక్కడ?

- 2020లో హడావుడి
- ఆ తరువాత ఊసెత్తని పాలకులు
- ఉద్యానవన రైతులకు ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉద్యానవన రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ రైల్ పేరుతో మూడేళ్ల క్రితం హడావుడి చేశాయి. ముచ్చటగా మూడు రైళ్లు నడిపాయి. ప్రస్తుతం ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా... పట్టించుకునే వారు లేరు. టమోటా లాంటి పంటలైతే ధరలేక రోడ్లపైనే పడేసే పరిస్థితి నెలకొంది.

ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ రైల్‌ను 2020 సెప్టెంబర్ తొమ్మిదన ప్రారంభించారు. అనంతపురం నుంచి నేరుగా ఢిల్లీకి ఈరైలు వెళ్లే ఏర్పాటు చేశారు. 332 టన్నులు టమోటా, అరటి, బత్తాయి, బొప్పాయి తదితర పంటలను ఎగుమతి చేశారు. ఆ తరువాత రెండు పర్యాయాలు ఇదే రకంగా ఎగుమతి చేశారు. అనంతరం పంటలను పంపే ఏర్పాట్లపై ఎవ్వరూ పట్టించుకోకుండా వదిలేశారు.

అంతన్నారు...ఇంతన్నారు..!

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తొమర్, రైల్వే శాఖ మంత్రి సురేష్ సి.అంగడి, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారులందరూ కలసి పచ్చ జెండాను ఊపి కిసాన్ రైల్‌ను ప్రారంభించారు. ఈ సమయంలో కిసన్ ఉడాన్, కిసాన్ రైల్‌ను నడుపుతున్నట్టు తొమర్ తెలిపారు. కిసాన్ రైల్ వల్ల వ్యవసాయ ఆర్థికాభివృద్ధి ఉపయోగపడుతుందని చెప్పారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద రూ. లక్ష కోట్ల నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. అయితే ఇవన్నీ ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయి.

ఉద్యానవపంటలకు అనంత ప్రసిద్ధి

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యానవ పంటలకు ప్రసిద్ధి. సుమారు నాలుగున్నర లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగవుతాయి. ఏడాదికి సుమారు 58 లక్షల మెట్రిక్ టన్నులు పండ్లు, కాయగూరలు, పూలు దిగుబడి వస్తాయి. రాష్ట్రంలో వచ్చే దిగుబడుల్లో 80 శాతం ఇక్కడే పండుతాయి. ఒక్కోసారి పంటలకు ధర ఉండటం లేదు. ప్రధానంగా టమోటా పంట ఏటా ధర లేక రోడ్డుపై పడేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆగస్టు వరకు ధర అధికంగా ఉండేది. ఆ తరువాత నుంచి ధర పడిపోయింది. కొనేవాళ్లు లేక రోడ్డుపై టమోటాలను పడేస్తున్నారు. ఈ సమయంలో ధరవున్న ప్రాంతాల్లోకి ఈ పంటను తరలించే ప్రత్యేకమైన ఏర్పాట్లు ఏవీ లేకపోవడం గమనార్హం.

మహానందిలో ఎలుగుబంట

- గత నాలుగు రోజులుగా సంచారం
- భయాందోళనలో గ్రామస్తులు, యాత్రికులు

ప్రజాశక్తి - మహానంది, నంద్యాల

మహానంది క్షేత్రంలో గత నాలుగు రోజులుగా ఎలుగుబంటి సంచరిస్తోంది. స్థానికులు, యాత్రికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం రాత్రి పాత వివేకానంద పాఠశాల మైదానం పరిసర ప్రాంతాల్లో ఎలుగుబంటి ప్రత్యక్షం కావడంతో స్థానికులు కెమెరాల్లో బంధించి అటవీ శాఖ అధికారులకు చేరవేశారు. స్థానికులు కేకలు వేయడంతో ఎలుగుబంటి మళ్లీ అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిది. గత కొన్ని రోజుల క్రితం ఇలాగే అటవీ ప్రాంతం నుండి క్షేత్రంలోని జనావాస ప్రాంతంలోకి ఎలుగుబంటి వస్తుండడంతో స్థానికులు, దేవస్థానం అధికారులు అటవీ శాఖకు సమాచారాన్ని ఇచ్చారు. దీంతో ఎలుగుబంటిని బంధించి అటవీ ప్రాంతంలో వదిలారు. మళ్లీ ప్రస్తుతం మూడు నాలుగు రోజుల నుంచి క్షేత్ర సమీప ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో స్థానికులతో పాటు యాత్రికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాత్రికులకు గ్రామస్థులకు ఎలుగుబంటి నుంచి ఎలాంటి హాని జరగకముందే త్వరగా అటవీ శాఖ అధికారులు బంధించి అడవిలో లోపలి వదిలిపెట్టాలని కోరుతున్నారు.

దక్షిణాది రాష్ట్రాలకు ఇబ్బందే!

పునర్విభజనతో తగ్గనున్న స్థానాలు

న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలోని జనాభాను పరిగణనలోకి తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన జరిపితే ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుంది. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలు కొన్ని స్థానాలను కోల్పోతాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఉత్తర భారత రాష్ట్రాలకు మరో 32 స్థానాలు కలుస్తాయి. దక్షిణ భారత రాష్ట్రాలు 24 స్థానాలను కోల్పోతాయి. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనితోడు పార్లమెంటులోనూ, రాష్ట్రాల శాసనసభలోనూ మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తే దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ప్రధానంగా రెండు మార్పులు చోటుచేసుకుంటాయి. దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గ ఉత్తరాది, తూర్పు రాష్ట్రాల ప్రాభవం పెరుగుతుంది. దేశ రాజకీయాలలో పురుషుల ఆధిపత్యం తగ్గి మహిళలకు సముచిత ప్రాధాన్యత లభిస్తుంది. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే జనాభా స్థిరంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలు తగ్గడంతో పాటు ఆయా రాష్ట్రాల నుండి మహిళల ప్రాతినిధ్యం కూడా తగ్గిపోతుంది.

పారిశుధ్య కార్మికుల సమస్యలపై

అసెంబ్లీలో చర్చించాలి

● ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాలను పర్మినెంటు చేయడంపై శాసనసభలో చర్చ జరగాలని గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావుతో పాటు వివిధ జిల్లాల నుంచి ఇంజినీరింగ్ కార్మిక నేతలు పాల్గొన్నారు. దీక్షలను సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనైనా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు వర్తించే ఏ ప్రయోజనాలూ ఆప్కాస్ ఉద్యోగులకు కల్పించలేదన్నారు. కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ జీతాలు చెల్లింపు విషయంలో సర్టిఫికెట్స్‌తో ముడిపెట్టడం దారుణమని అన్నారు. పబ్లిక్ హెల్త్ అలవెన్స్ విభాగానికి చెందిన డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మాలేరియా, పార్కుల్లో పనిచేసే కార్మికులకు గత నాలుగేళ్లలో హెల్త్ అలవెన్స్ చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసగిస్తోందన్నారు. దీక్షల్లో పి శ్రీనివాసరావు, నారాయణ, షేక్ అల్లాబక్షు, పూర్ణచంద్రరావు, జుబేర్, రాజు, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూకాలర్ రీబ్రాండింగ్

బెంగళూరు : ప్రముఖ ఫోన్ నెంబర్ల గుర్తింపు యాప్ ట్రూకాలర్ కార్పొరేట్ రీబ్రాండింగ్‌లో భాగంగా కొత్త లోగోను ఆవిష్కరించినట్లు తెలిపింది. శక్తి, ఉత్సాహం దీని ప్రధాన ఉద్దేశ్యమని ఆ సంస్థ వ్యవస్థాపకులు, సిఇఒ అలాన్ మామెడి తెలిపారు."మా కొత్త బ్రాండ్ గుర్తింపు, లోగోను ఆవిష్కరించుటకు మాకెంతో సంతోషంగా ఉంది. ప్రతిరోజు నిరంతరంగా అభివృద్ధిని మెరుగుపరచడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నాము." అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 35.6 కోట్ల మంది ట్రూకాలర్‌ను వాడుతున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.

చంద్రబాబు అరెస్టుతోనే జగన్ పతనం

ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన అఖిలప్రియ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పతనం ప్రారంభమైందని మాజీ మంత్రి భూమ అఖిల ప్రియ అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి గురువారం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అఖిలప్రియ మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన చోటు నుంచే తమ పోరాటం ప్రారంభిస్తున్నామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఎలాంటి అవకతవలు జరగలేదని తెలిపారు. తక్షణమే నారా చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న అఖిల ప్రియ, జగత్ విఖ్యాత్ రెడ్డి

నిజ్జార్ హత్యపై కెనడా దర్యాప్తుకు అమెరికా మద్దతు

● భారత్ కూడా సహకరించాలని కోరిన వైట్‌హౌస్



వాషింగ్టన్ : ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్య చుట్టూ నెలకొన్న తీవ్రమైన ఆరోపణలపై కెనడా ప్రభుత్వం జరుపుతున్న దర్యాప్తుకు వైట్‌హౌస్ మద్దతునిచ్చింది. భారత్ కూడా ఈ విషయంలో సహకరించాలని వైట్‌హౌస్ వ్యూహాత్మక కమ్యూనికేషన్స్ చీఫ్ జాన్ కిర్బీ కోరారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఈ తీవ్రమైన ఆరోపణల గురించి ఆలోచిస్తున్నారని, నిజంగానే అవి చాలా తీవ్రమైనవని, ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న కెనడాకు తాము మద్దతిస్తున్నామని కిర్బీ తెలిపారు. సరైన దిశలో, పూర్తి స్థాయిలో పారదర్శకమైన, సమగ్రమైన దర్యాప్తు జరగాలని మేం విశ్వసిస్తున్నాం. అప్పుడే ఏం జరిగిందో మనందరికీ తెలుస్తుంది. ఈ ప్రక్రియతో భారత్ సహకరించాలని కూడా తాము కోరుకుంటున్నామని చెప్పారు. కెనడాతో ఇంటెలిజెన్స్‌ను పంచుకునే భాగస్వామిగా అమెరికాకు ఈ ఆరోపణలను ఏ ప్రాతిపదికన చేశారో తెలుసా అని ప్రశ్నించగా, తాము దర్యాప్తు పవిత్రతను గౌరవించాలను కుంటున్నామని మాత్రమే ఆయన వ్యాఖ్యానించారు. ఒకవేళ ఆరోపణలను నిజమని రుజువైతే వాటి ప్రభావం ఎలా వుంటుందని ప్రశ్నించగా, వాస్తవాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత, అనుసరించాలనుకున్న సిఫార్సులను పరిశీలించవచ్చని కిర్బీ పేర్కొన్నారు.

జూన్ 18న జరిగిన నిజ్జార్ హత్యకు భారత ప్రభుత్వ ఏజెంట్లే కారణమని కెనడా ప్రధాని ట్రుడెయు సోమవారం ఆరోపించారు. ఆ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది.

ఆర్‌టిసి బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు డిజిటల్ ఐడిలకు రాయితీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి కీలక నిర్ణయం తీసుకుంది. సీనియర్ సిటిజన్లకు బస్ టికెట్లలో రాయితీ కోసం డిజిటల్ ఐడి కార్డులను కూడా గుర్తింపు కార్డులుగా పరిగణించాలని నిర్ణయించింది. సీనియర్ సిటిజన్లకు ఆర్‌టిసి టికెట్ల ధరల్లో 25 శాతం రాయితీ ఇస్తున్న సంగతి తెలిసిందే. అందుకే ఆధార్ కార్డు, సీనియర్ సిటిజన్ ఐడి కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడి కార్డు, పాస్‌పోర్టు, రేషన్ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణిస్తున్నారు. ఇకపై డిజిటల్ ఐడి కార్డులనూ గుర్తింపు కార్డుగా పరిగణించాలని అధికారులను ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు కెఎస్ బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

జమ్ముకాశ్మీర్ విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు ఇఇఎఫ్ఐ సంఘీభావం

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్ల సమ్మెకు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) పూర్తి సంఘీభావం ప్రకటించింది. ఈ నెల 25, 26 తేదీల్లో 48 గంటల సమ్మెకు జమ్ముకాశ్మీర్ పవర్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (జెకెపిఇడబ్ల్యూయుఎఫ్) పిలుపునిచ్చింది. జమ్ముకాశ్మీర్ పవర్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (పిడిడి) ఉద్యోగులు, ఇంజనీర్లు గత కొన్ని నెలలుగా జీతాలు లేక, జీతాల్లో తీవ్ర జాప్యం ఎదుర్కొంటున్నారు. సుమారు 4 వేల టెక్నికల్, 750 ఇంజనీరింగ్ పోస్టులు మంజూరైనా ఇంకా భర్తీ కాలేదు. దీంతో ఉద్యోగులు అదనపు పని భారం, ఒత్తిడిని అనుభవిస్తున్నారు. కార్మికుల క్రమబద్ధీకరణ, పదోన్నతులు, సీనియారిటీ విషయంలో 2021 డిసెంబరు 21న పిడిడి, కార్మిక యూనియన్ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో కుదిరిన న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలనే డిమాండ్‌తో ఈ సమ్మె జరగనుంది.

అమెరికాలో భారత కాన్సులేట్‌పై దాడి

నిందితుల ఫొటోలు విడుదల

శాన్ ఫ్రాన్సిస్కో : అమెరికా శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై గత మార్చిలో దాడి చేసిన ఖలిస్థానీ సానుభూతిపరులలో 10 మంది నిందితుల ఫొటోలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) గురువారం విడుదల చేసింది. దాడికి పాల్పడిన వారిపై అప్పట్లో 'చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యుఎపిఎ) సహా ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఎన్ఐఎ విచారణ ప్రారంభించింది. నిందితులను గుర్తించేందుకు సహకరించాలని, వారి గురించి ఏమైనా సమాచారం ఉంటే తమతో పంచుకోవాలని ప్రజలను కోరింది. ఖలిస్థాన్ సానుభూతిపరుడు, 'వారిస్ పంజాబ్ దే' నాయకుడు అమృత్‌పాల్ సింగ్ అరెస్టుకు భారత్‌లో ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు పలు దేశాల్లో ఖలిస్థాన్ సానుభూతిపరులు దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారు. ఈ క్రమంలోనే మార్చిలో కొంతమంది ఖలిస్థాన్ అనుకూలవాదులు.. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌లో విధ్వంసానికి పాల్పడ్డారు. జులై 1వ తేదీ రాత్రి సైతం.. అధికారులు లోపల ఉండగానే, కొంతమంది నిందితులు కాన్సులేట్‌లోకి చొరబడి నిప్పంటించడానికి ప్రయత్నించారని ఎన్ఐఎ పేర్కొంది. తాజాగా అక్కడి భారత దౌత్యకార్యాలయంపై దాడులకు పాల్పడినట్లు భావిస్తున్న నిందితుల ఫొటోలు విడుదల చేసింది. ప్రస్తుతం కెనడాలో 20 మంది ఖలిస్తానీ-గ్యాంగ్‌స్టర్లు తలదాచుకుంటున్నారని ఎన్ఐఎ ప్రకటించింది. ఇదిలా ఉండగా.. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై దాడి జరిగిన సమయంలోనే.. కెనడాలోని దౌత్యకార్యాలయం వద్ద కూడా ఖలిస్థానీ మద్దతుదారులు దుశ్చర్యలకు పాల్పడ్డారు. దీనిపై స్థానిక కెనడా హైకమిషనర్‌నుంచి భారత్ వివరణ కోరింది.

కూపర్ సర్జికల్‌తో ఫెర్టి9 భాగస్వామ్యం

హైదరాబాద్ : సంతానోత్పత్తి సంరక్షణను మెరుగుపర్చడానికి కూపర్ సర్జికల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఫెర్టి9 వెల్లడించింది. గర్భధారణ విజయాల రేటును పెంచడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేయనుందని పేర్కొంది. చికిత్స పరంగా అత్యున్నత ప్రమాణాలను అనుసరించే లక్ష్యంతో జట్టుకట్టినట్లు పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో ఫెర్టి9కు ఏడు సెంటర్లు ఉన్నట్లు వెల్లడించింది. సంతానోత్పత్తి చికిత్స విధానంలో విప్లవాత్మక మార్పులకు కూపర్‌సర్జికల్ భాగస్వామ్యం మద్దతును అందించనుందని తెలిపింది.

10 నెలల కనిష్టానికి చమురు దిగుమతులు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ఆగస్టులో భారత చమురు దిగుమతులు 10 నెలల కనిష్టానికి పడిపోయాయి. గడిచిన నెలలో 18.73 మిలియన్ టన్నుల దిగుమతి చోటు చేసుకోగా.. జులైతో పోల్చితే 4 శాతం తక్కువ, ఏడాదికేడాదితో పోల్చితే 6 శాతం ఎక్కువగా నమోదయ్యాయి "రష్యా స్వచ్ఛంద ఉత్పత్తి కోతలు కారణంగా వరుసగా మూడవ నెల దిగుమతులు పడిపోయాయి. వర్షాకాలం నేపథ్యంలో సెప్టెంబర్ చివరి వరకు చమురుకు డిమాండ్ తక్కువగా ఉండటంతో.. భారత రిఫైనరీలు దిగుమతులు తగ్గించుకున్నాయి" అని పెట్రోలియం అండ్ అనాలిసిస్ సెల్ పేర్కొంది.

హైదరాబాద్ నుంచి కొలంబోకు డైరెక్ట్ విమానం

ఇండిగో వెల్లడి

హైదరాబాద్ : బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగో కొత్తగా హైదరాబాద్ - కొలంబో మధ్య డైరెక్ట్ విమాన సేవలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నవంబర్ 2నుంచి ఈ రెండు నగరాల మధ్య తమ సేవలు ప్రారంభం అవుతాయని పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు మరింత మెరుగు పడనున్నాయని ఆ సంస్థ పేర్కొంది. బుధవారం మినహా అన్ని రోజుల్లో సేవలు లభ్యం అవుతాయని పేర్కొంది.

కియా సెల్టోస్ రెండు కొత్త వేరియంట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ కియా ఇండియా కొత్త సెల్టోస్‌లో రెండు వేరియంట్లను విడుదల చేసింది. జిటిఎక్స్ ప్లస్ (ఎస్), ఎక్స్‌లైన్ (ఎస్)లను అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ఎడిఎఎస్) లెవెల్-2 సాంకేతికతతో వీటిని అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. వీటి ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.19.39 లక్షలుగా నిర్ణయించింది. కొత్త సెల్టోస్ సగటు వెయిటింగ్ పీరియడ్ 15 నుంచి 16 వారాలు ఉంది. నూతన వేరియంట్లను 7-9 వారాల్లోనే డెలివరీ చేయనున్నట్టు కియా పేర్కొంది.

ఆదివాసీ హక్కులపై బిజెపి దాడి

- అన్ని రంగాల్లో గిరిజనుల బలోపేతానికి చర్యలు చేపట్టాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మాజీ ఎంపి బృందాకరత్ డిమాండ్
- ముగిసిన ఆదివాసీ జాతీయ మహాసభలు
- 67 మందితో నూతన కమిటీ ఎన్నిక
- ఛైర్మన్‌గా జితేంద్ర చౌదరి, జాతీయ కన్వీనర్‌గా పులిన్‌బాస్కి



నమక్కల్ జిల్లా కేంద్రంలో ఆదివాసీ గిరిజనుల భారీ ప్రదర్శనలో బృందాకరత్ తదితరులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ

దేశంలోని ఆదివాసీలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నదని రాజ్యసభ మాజీ సభ్యులు బృందాకరత్ విమర్శించారు. తమిళనాడులోని నమక్కల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 19న ప్రారంభమైన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ నాలుగో మహాసభలు గురువారం జయప్రదంగా ముగిశాయి. దేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఎనిమిది తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ముగింపు ఉపన్యాసంలో బృందాకరత్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవి ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ఆదివాసీలను వనవాసీలుగా చిత్రీకరిస్తూ వారి హక్కులపై దాడి చేస్తున్నదని విమర్శించారు. ఆదివాసీ, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు వేరుగా ఉన్నందున వారిని మతంతో సంబంధం లేకుండా ప్రకృతి ఆరాధికులుగా గుర్తింపు ఇవ్వడం ద్వారా వారి ఉనికిని కాపాడాలని అన్నారు. గిరిజనులు సామాజిక, ఆర్థిక రంగాల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. యూనిఫామ్ సివిల్ కోడ్ (యుసిసి) పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఆదివాసీ, గిరిజనులపై బలవంతంగా రుద్దుతున్నాయని విమర్శించారు. అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ.. ఆదివాసీ, గిరిజన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక మార్కెట్ సౌకర్యాలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం ద్వారానే గిరిజనులు, ఇతర రైతులు రక్షించబడతారని చెప్పారు. అందుకోసం గిరిజనులు, ఆదివాసీలు, రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆదివాసీ గిరిజనుల భారీ ప్రదర్శన

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ మహాసభ సందర్భంగా నమక్కల్ జిల్లా కేంద్రంలో గురువారం వేలాదిమంది ఆదివాసీ గిరిజనులతో భారీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యులు ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ వైస్ ఛైర్మన్ బృందాకరత్, జాతీయ ఛైర్మన్ జితేంద్ర చౌదరి, జాతీయ కన్వీనర్ పులిన్ బాస్కే, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, తమిళనాడు ట్రైబల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఢిల్లీ బాబు, శరవణన్, నాయకులు పి షణ్ముగం, ఎవి షణ్ముగం తదితరులు పాల్గొని ప్రసంగించారు.

17 మందితో ఇసి ఎన్నిక

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ మహాసభలో 17 మందితో జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఇసి)ని ప్రతినిధులు ఎన్నుకున్నారు. నూతన జాతీయ ఛైర్మన్‌గా జితేంద్ర చౌదరి, జాతీయ కన్వీనర్‌గా పులిన్ బాస్కే, వైస్ ఛైర్మన్లుగా బృందాకరత్, డాక్టర్ మిడియం బాబూరావు, ఆర్ సర్కార్, జెపి గావిత్, డి హేమ్లాం, నరేష్ జమాతియా, బిబి భని, కో కన్వీనర్లుగా దులీచంద్ మీనా, తిరుపతిరావ్, కోశాధికారిగా ఢిల్లీ బాబు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆర్ శ్రీరాం నాయక్, రాజాచంద్రన్ దే బర్మా, ఎన్ఎస్ గావిత్, వికాస్ రావెల్ ఎన్నికైన వారిలో ఉన్నారు. 67 మందితో కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి వి తిరుపతిరావు, కె సురేంద్ర, అప్పలనర్స, ఎల్ రామారావు, టి కౌసల్య, తెలంగాణ నుంచి ఎం ధర్మానాయక్, డి రవినాయక్, బండారు రవికుమార్, పూసం సచిన్ తదితరులున్నారు.

పార్లమెంట్ భద్రతా సిబ్బంది కొత్త యూనిఫాంపై వెనక్కి

- ప్రభుత్వం ఉత్తర్వు జారీ

న్యూఢిల్లీ: పార్లమెంట్ భద్రతా సిబ్బంది కోసం ప్రవేశపెట్టిన కొత్త యూనిఫామ్‌ను ప్రభుత్వం ఉప సంహరించుకున్నది. కొత్త యూనిఫాంను సిబ్బంది ధరించడం ప్రారంభించిన ఒక రోజు తర్వాత బుధవారం నాడు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఉత్తర్వును జారీ చేసింది. యూనిఫాం కోసం ఉపయోగించిన బట్ట, కొత్త దుస్తుల రూపకల్పన కారణంగా తమకు చెమటలు పట్టాయని భద్రతా సిబ్బంది నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయి. 500 మంది పార్లమెంటు భద్రతా సిబ్బంది తమ సాధారణ నేవీ బ్లూ సఫారీ సూట్‌లతో బుధవారం విధులకు వచ్చారు. యూనిఫామ్‌ను ఉపసంహరించుకోవడానికి ఎలాంటి అధికారిక కారణం చెప్పనప్పటికీ, చాలా మంది సిబ్బంది కొత్త దుస్తులను ధరించడానికి నిరాకరించారనీ, దాని డిజైన్, ఫాబ్రిక్‌తో తయారు చేయబడిన వాటిని ధరించడానికి విముఖత వ్యక్తం చేశారని సమాచారం. పార్లమెంట్‌ను కొత్త భవనానికి మార్చడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం కొత్త యూనిఫామ్‌లను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వు ప్రకారం.. "భద్రతా సిబ్బంది కొత్త యూనిఫాం మాత్రమే ఉపసంహరించబడింది. ఇతర సిబ్బంది వారి సంబంధిత కొత్త యూనిఫాంలను ధరించడం కొనసాగించవలసి ఉంటుంది" అని పేర్కొన్నది. అయితే, కొత్త యూనిఫాం ధరించడానికి ఇష్టపడకపోవడానికి భద్రతా సిబ్బంది ఉదహరించిన ఏకైక కారణం "బట్ట యొక్క శ్వాస సామర్థ్యం లేకపోవడం" కావటం గమనార్హం. ఇటు పార్లమెంటు సిబ్బందికి యూనిఫాం విషయంలో మోడి సర్కారు తీరును కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు తప్పుబట్టాయి.

'కావేరి'పై జోక్యానికి సుప్రీం నో

న్యూఢిల్లీ : తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మధ్య నెలకొన్ని కావేరీ జలాల వివాదంలో జోక్యానికి భారత అత్యున్నత న్యాయస్థానం నో చెప్పింది. కర్నాటక లేదా తమిళనాడుకు అనుకూలంగా జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. బదులుగా రెండు పొరుగు రాష్ట్రాలకు నీటి భాగస్వామ్యం విషయంలో కావేరీ నీటి నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ), కావేరీ నీటి నిర్వహణ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ) ల మిశ్రమ నైపుణ్యంపై కోర్టు ఆధారపడింది. ఈ విషయంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కర్ణాటక నుంచి తమిళనాడుకు రోజువారీ నీటి ప్రవాహాన్ని 5,000 క్యూసెక్కులుగా నిర్ణయించేటప్పుడు సీడబ్ల్యూఎంఏ, సీడబ్ల్యూఆర్‌సీ పరిశీలించిన కావేరీ బేసిన్‌లో నీటి కష్టాలతో సహా వివిధ అంశాలు అసంబద్ధమైనవని గవాయ్ చెప్పారు. రెండు రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహాన్ని సమీక్షించేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి సీడబ్ల్యూఎంఏ, సీడబ్ల్యూఆర్‌సీ క్రమం తప్పకుండా సమావేశమవుతున్నాయని కోర్టు పేర్కొన్నది. తమిళనాడు రాష్ట్రం తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, జి. ఉమాపతి వాదనలు వినిపించగా, కర్నాటక నుంచి సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ హాజరయ్యారు.

రైల్వే కూలీగా రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌లో హల్‌చల్ చేశారు. సామాన్లు మోసే రైల్వే కూలీలను కలుసుకున్నారు. కాసేపు వారిలాగే రైల్వే కూలీగా అవతారం ఎత్తారు. ఎర్ర షర్టు ధరించి, చేతికి బ్యాడ్జితో తలపై లగేజీని ఎత్తుకొని ముందుకు కదిలారు. ఈ సందర్భంగా రైల్వే కూలీలు, కార్మికులు, ఆయన మద్దతుదారులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనను చుట్టుముట్టారు. "రాహుల్ గాంధీ జిందాబాద్" నినాదాలతో ఆయనతో పాటు ముందుకు కదిలారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అయితే, రైల్వే కూలీలు, కార్మికుల సమస్యలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాహుల్ మాట్లాడారని కాంగ్రెస్ వివరించింది.

కేరళ అభివృద్ధిని అడ్డుకోకండి

- గవర్నర్ తీరును నిరసిస్తూ రాజ్‌భవన్ ముందు ఎల్‌డిఎఫ్ ఆందోళన


రాజ్‌భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎల్‌డిఎఫ్ శ్రేణులు

తిరువనంతపురం : కేరళ రాష్ట్ర అభివృద్ధి, పురోగతికి అడుగడుగునా ఆటంకం కలిగిస్తున్న గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ విధానాలకు వ్యతిరేకంగా గవర్నర్ అధికారిక నివాసం రాజ్‌భవన్ ఎదుట అధికార కూటమి ఎల్‌డిఎఫ్ ఆందోళనకు దిగింది. అనేక నెలల క్రితం రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన కొన్ని కీలకమైన బిల్లుపై గవర్నర్ ఆరిఫ్‌ఖాన్ సంతకం చేయకుండా తన వద్ద పెండింగ్‌లో పెట్టుకున్నారని పాలక లెఫ్ట్ ఫ్రంట్ విమర్శించింది.

ఈ సందర్భంగా ఎల్‌డిఎఫ్ కన్వీనర్ ఇపి జయరాజన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేరళను ఆర్థికంగా నియంత్రించాలని చూస్తుంటే.. బిజెపి విధానాలను అమలు చేస్తున్న గవర్నర్ ఖాన్ అసెంబ్లీ అనేక సమావేశాలు, చర్చలు తరువాత ఆమోదించిన అనేక బిల్లును తన వద్ద అట్టేపెట్టుకున్నారు' అని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యుడిఎఫ్ కూటమిపై కూడా జయరాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు యుడిఎఫ్ మద్దతు ఇవ్వడం లేదని, అభివృద్ధిని అడ్డుకునేందుకు యుడిఎఫ్ చురుగ్గా పనిచేస్తుందని విమర్శించారు.

'రాష్ట్రంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఎల్లవేళలా రాష్ట్ర ప్రజల సంక్షేమం, ప్రగతి కోసం కృషి చేస్తోంది. పినరయి విజయన్ హయాంలోని గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఇదే కొనసాగుతోంది' అని జయరాజన్ తెలిపారు. 'వామపక్ష ప్రభుత్వ కృషి కారణంగా రాష్ట్రంలో జరుగుతున్న పురోగతి బిజెపి, యుడిఎఫ్‌లను భయపెడుతోంది. కేరళ పురోగతి, అభివృద్ధిని వ్యతిరేకించడంలో ఈ రెండూ ఒకే ఒక వైఖరితో ఉన్నారు' అని పేర్కొన్నారు. వందేభారత్ రైలు నిర్వహణ, విజింజం ఓడరేవు నిర్మాణం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ కృషి వల్లే జరిగిందని జయరాజన్ స్పష్టం చేశారు. లోకాయుక్త సవరణ బిల్లు, రెండు వేర్వేరు విశ్వవిద్యాలయాల సవరణ బిల్లులతోపాటు అనేక బిల్లులను గవర్నర్ ఖాన్ తన వద్దే నిలిపి ఉంచుకోవడం అప్రజాస్వామికమని జయరాజన్ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాల ప్రకారమే ఈ బిల్లులపై గవర్నర్ ఖాన్ సంతకం చేయడం లేదని చెప్పారు. బిల్లులకు ఆమోదం తెలపకపోతే ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. ఎల్‌డిఎఫ్ రాష్ట్ర నాయకులు, తిరువనంతపురం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

యుఎన్ వాతావరణ సదస్సుకు భారత్, అమెరికా, చైనా గైర్హాజరు



న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా న్యూయార్క్‌లో వాతావరణ సదస్సు (సిఎఎస్) జరిగింది. దీనికి ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన భారత్, అమెరికా, చైనాలు హాజరు కాలేదు. మొత్తంగా ప్రపంచ కాలుష్య కారక వాయువుల్లో 42శాతం వాటాను కలిగిన, భవిష్యత్‌లో ప్రపంచ కాలుష్య మొత్తాలను గణనీయంగా ప్రభావితం చేయగల ఈ మూడు దేశాలు ఈ సదస్సుకు హాజరు కాకపోవడం గమనార్హం.

పారిస్ ఒప్పందంలో లక్ష్యంగా పెట్టుకున్న 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ పరిమితిని అలాగే కొనసాగించేందుకు, వాతావరణ న్యాయం అందచేసేందుకు నేతలు తమ విశ్వసనీయమైన చర్యలు, విధానాలు, ప్రణాళికల ద్వారా నిబద్ధతను ప్రకటించేందుకు ఈ వాతావరణ సదస్సు ఉద్దేశించబడిందని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కార్యాచరణను వేగవంతం చేయాలంటూ సదస్సుకు ముందు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ ఇచ్చిన పిలుపునకు స్పందించి దాదాపు వంద దేశాల అధినేతలు లేఖ రాశారు. సదస్సు జరిగే తేదీకి మాత్రం కేవలం 34 దేశాల, ఏడు సంస్థల ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. భారత్ పొరుగుదేశాలైన శ్రీలంక, నేపాల్, పాకిస్తాన్‌లు కూడా వక్తల జాబితాలో వున్నాయి. వర్ధమాన ఆర్థిక వ్యవస్థలైన దక్షిణాఫ్రికా, బ్రెజిల్‌లు కూడా హాజరయ్యాయి. పోడియంలో యురోపియన్ యూనియన్, జర్మనీ, ఫ్రాన్స్, కెనడాలు వున్నాయి.

జనవరి చివరి వారంలో పాక్ ఎన్నికలు

ఇస్లామాబాద్ : వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో పాక్ సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు పాక్ ఎన్నికల కమిషన్ ప్రకటించింది. నవంబరులోనే ఎన్నికలు జరగాల్సి వున్నాయని, నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఆలస్యమైందని పాక్ ఎన్నికల కమిషన్ తన ప్రకటనలో పేర్కొంది. నవంబరు 30కల్లా కొత్త నియోజకవర్గాల తుది జాబితా ప్రచురిస్తారు. జనవరి చివరి వారంలో ఎన్నికల నిర్వహణ వుంటుంది. నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి, అప్పీళ్లు, ప్రచారానికి మొత్తంగా 54 రోజుల సమయం వుంటుందని తెలిపింది. ఆగస్టుతోనే పాక్ పార్లమెంట్ ఐదేళ్ల కాలపరిమితి ముగిసింది. దాంతో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరుగుతాయి. పాకిస్తాన్ తీవ్ర ఆర్థిక, రాజకీయ, భద్రతా సంక్షోభాలను ఎదుర్కొంటున్న సమయంలో ఈ ఎన్నికల ప్రకటన వెలువడింది.

లెబనాన్‌లో అమెరికా ఎంబసీపై కాల్పులు

బీరుట్ : లెబనాన్‌లో అమెరికా ఎంబసీ కార్యాలయం వెలుపల గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు జరిపాడని అధికారులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయన్నారు. 'ప్రవేశమార్గం సమీపంలోనే చిన్నపాటి ఆయుధాలతో కాల్పులు జరిగాయి.' అని ఎంబసీ ప్రతినిధి జేక్ నెల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీరుట్ శివార్లు అవ్‌కర్‌లో భారీగా బందోబస్తు వున్న కాంపౌడ్‌లోనే ఈ సంఘటన జరిగిందని చెప్పారు. అయితే ఎవరూ గాయపడలేదని, కార్యాలయం కూడా దెబ్బతినలేదని చెప్పారు. లెబనాన్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో తాము మాట్లాడుతున్నామని చెప్పారు. బీరుట్‌లోని అమెరికా ఎంబసీపై దారుణంగా దాడి జరిగి 63మంది మరణించిన ఘటనకు ఈ ఏడాది ఏప్రిల్ 18తో 40ఏళ్ళు పూర్తయ్యాయి. ఆ తర్వాత ఎంబసీని బీరుట్ నుండి అవ్‌కర్‌కు మార్చారు. కొత్త ప్రాంతంలో కూడా 1984 సెప్టెంబరు 20న మరో బాంబు దాడి జరిగింది.

ఇదేనా సనాతన ధర్మం?

- పార్లమెంట్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ముర్ము గైర్హాజరుపై ఉదయనిధి స్టాలిన్

న్యూఢిల్లీ: సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ మళ్లీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గైర్హాజరిని ఉటంకిస్తూ సనాతన ధర్మం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ద్రౌపది ముర్ము వితంతువు, గిరిజనురాలు కావటం వల్లనే ఆమె గైర్హాజరు కావాల్సి వచ్చిందని అన్నారు. మధురైలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్ బీజేపీ లక్ష్యంగా పై వ్యాఖ్యలు చేశారు. "కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించారు. వారు (బీజేపీ) ప్రారంభోత్సవానికి తమిళనాడు నుంచి అధీనం పొందారు. కానీ ఆమె(రాష్ట్రపతి) వితంతువు, గిరిజన వర్గానికి చెందినందున ఆహ్వానించలేదు. ఇదేనా సనాతన ధర్మం?" అని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. దీనికి వ్యతిరేకంగా తాము గొంతెత్తుతామని అన్నారు.

27న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ ఫెయిల్యూరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. పాదయాత్రలో కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడుసార్లు ఛార్జీలు పెంచారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్లు పెట్టబోమని కేంద్ర ప్రభుత్వానికి తెగేసి చెబితే జగన్ ప్రభుత్వం ప్రధాన మంత్రి మోడీ చెప్పినట్లు చెస్తున్నారని అన్నారు. చండీగఢ్ ప్రభుత్వం ఒక్కో స్మార్ట్ మీటర్ రూ.7,500 కొంటే జగన్ ప్రభుత్వం మాత్రం ఒక్కొక్కటీ రూ.32 వేలకు కొనుగోలు చేసిందన్నారు. ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక నల్లచట్టాలను రైతు సంఘాలు పోరాడి తిప్పి కొట్టాయని అన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యుత్‌పై రాష్ట్రంతో సంబంధం లేకుండా కేంద్రం చట్టాలు చేస్తోందని, ఇది న్యాయసమ్మతం కాదని తెలిపారు. అదానీ కంపెనీ సంపదలను పెంచేందుకే మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పార్లమెంటులో ప్రవేశపెట్టే విద్యుత్ సంస్కరణల బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పొలారి మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పీల్చిపిప్పి చేస్తోందని తెలిపారు. సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్ మాట్లాడుతూ.. ప్రత్యక్ష పోరాటాల ద్వారానే ప్రభుత్వాన్ని తిప్పికొట్టొచ్చని పేర్కొన్నారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చించకుండా, కేవలం వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. ఎంసిపిఐయు నాయకులు ఖాదర్‌బాషా మాట్లాడుతూ.. పాదయాత్రలో ఛార్జీలు పెంచబోమని చెప్పి ఇప్పుడు నెలకోసారి పెంచుకుంటూ పోతున్నారని విమర్శించారు. ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్ మాట్లాడుతూ.. ప్రజలపై పడుతున్న భారాలను తిప్పికొట్టేలా వారిని చైతన్యం చేయాలని అన్నారు. సిఐటియు నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో ఉద్యమాలు చేసుకునే స్వేచ్ఛ కూడా లేదన్నారు. ఎఐటియుసి నాయకులు సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో జీవనం కష్టమవుతోందని తెలిపారు. నిత్యావసరమైన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. దళితులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు శంకర్, కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్న కుమార్, ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర, రమణ, పిడిఎస్‌యు నాయకులు రాజేష్, స్కీమ్ వర్కర్ల సంఘం నాయకులు కమల మాట్లాడారు.

విద్యుత్ భారాలు తగ్గించాల్సిందే

విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, ఈ విధానాన్ని ఉపసంహరించాలని, విద్యుత్ సుంకం రద్దు చేయాలని, వడ్డీ భారాన్ని వినియోగదారులపై వేసే ప్రతిపాదనలను నియంత్రణ మండలి తిరస్కరించాలని కోరుతూ పెట్టిన తీర్మానాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు, నివాస గృహాలకు ఇతర వినియోగదారులకు స్మార్ట్‌మీటర్లు పెట్టే ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని కోరింది. కేంద్ర విద్యుత్ చట్ట సవరణలు ప్రతిపాదనలు విరమించాలని, విద్యుత్ ప్రైవేటీకరణను విడనాడాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును కొనసాగించాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించారు. 200 యూనిట్ల వినియోగించే పేద గృహ వినియోగదారులందరికీ ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని, ఎక్కడ నివసిస్తున్నా ఎస్‌సి, ఎస్‌టి, చేతి వృత్తిదారులకు ఇస్తున్న రాయితీలను కొనసాగించాలని కోరింది.

నిర్బంధాలు సరికావు

శాసనసభ సమావేశాల సందర్భంగా విజయవాడ నగరంలో ప్రజా సంఘాలు తమ సమస్యలపై ఆందోళనలు, ప్రదర్శనలు, ధర్నాలు, శాంతియుత నిరసనలు తెలుపుతామంటే ప్రభుత్వం అంగీకరించడం లేదని, ఇటువంటి చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. నాన్‌బెయిలబుల్ కేసులు పెడతామని పోలీసులు హెచ్చరిస్తున్నారని, వేలాది మందిని హౌస్ అరెస్టులు చేస్తున్నారని, మహిళలను కూడా అనుమతించడం లేదని పేర్కొంది. పోలీసులు ప్రజల ప్రాథమిక హక్కులపై చేస్తున్న దాడిగా దీన్ని భావిస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వం ఈ విధానాలను మార్చుకోవాలని కోరింది.

ఓటమి భయంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు

- మోడీ సర్కారు తీరుపై సిపిఎం రాజ్యసభ పక్షనేత ఎలమరం కరీం విమర్శ
- ఆమోదం పొందిన వెంటనే అమలు చేయాలి
- బిల్లుకు సిపిఎం సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే మోడీ ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకొచ్చిందని, మహిళలకు సాధికారత సాధించాలనే తపనతో కాదని సిపిఎం రాజ్యసభ నేత ఎలమరం కరీం విమర్శించారు. గురువారం రాజ్యసభలో మహిళా బిల్లుపై జరిగిన చర్చలో సిపిఎం తరుపున ఆయన మాట్లాడారు. "కర్ణాటక అసెంబ్లీ, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత బిజెపికి భయం పట్టుకుంది. జనం తన వెంట లేరన్న భయమే మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలని బిజెపిని ఒత్తిడి చేసింది. కానీ, నారీ శక్తి బంధన్ లక్ష్యం కాదు. సిపిఎం బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. బిల్లు ఆమోదం పొందిన వెంటనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలి. కానీ జనాభా లెక్కల కోసం వేచి ఉండకండి" అని అన్నారు. "యుపిఎ హయాంలో రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించింది. సోనియాగాంధీ, బృందాకరత్ బిల్లు కోసం గట్టిగా నిలబడ్డారు. రాజ్యసభ ఛైర్మన్ హమీద్ అన్సారీ దృఢ వైఖరి కూడా నిర్ణయాత్మకమైంది. కానీ, లోక్‌సభలో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వంటి మహిళా సంఘాల సుదీర్ఘ పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు. 2014లో మహిళా బిల్లును ప్రవేశపెడతామని బిజెపి హామీ ఇచ్చినా.. ఐదేళ్లుగా ఏమీ చేయలేదు. 2019లోనూ బిజెపి అదే హామీ ఇచ్చినా... నాలుగున్నరేళ్లుగా ఏమీ చేయలేదు" అని విమర్శించారు.

"మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి, సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసినప్పుడు, బిజెపి మహిళలపై ప్రేమ చూపలేదు. దేశం గర్వించదగ్గ మల్లయోధులను బిజెపి నాయకుడే అయిన ఫెడరేషన్ అధ్యక్షుడు వేధించినప్పుడు కూడా మహిళలపై ప్రేమ కనిపించలేదు. ఉన్నావ్, కత్వా, హత్రాస్‌లలో మహిళా సాధికారతపై బిజెపికి ఉన్న ఆసక్తి స్పష్టంగా కనిపించలేదు" అని విమర్శించారు.

"తదుపరి జనాభా లెక్కల అనంతరం నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. వచ్చే 15 ఏళ్లలో రిజర్వేషన్లు అమలు చేస్తారా? లేదా అనేది కచ్చితంగా తెలియదు. బెంగాల్‌లో 1983లోనే పంచాయతీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. కేరళలో స్థానిక సంస్థల్లో యాభై శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో పరిస్థితి ఏంటి?" అని ఎలమరం కరీం ప్రశ్నించారు.


ఉమ్మడి సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని, పక్కన కూనంనేని, తదితరులు

మేం కలిసే పోటీచేస్తాం

- సిపిఎం, సిపిఐ తెలంగాణ ఉమ్మడి సమావేశ నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ కలిసే పోటీ చేస్తాయని ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు చెప్పారు. అయితే ఏయే సీట్లలో పోటీ చేయాలనేది ఇంకా కొలిక్కి రాలేదని అన్నారు. వచ్చేనెల ఒకటిన మళ్లీ సమావేశాన్ని నిర్వహిస్తామని వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేసే సీట్లపై చర్చించి ఆ నిర్ణయాన్ని ప్రకటిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో గురువారం ఇరు పార్టీల రాష్ట్ర నాయకుల ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. మహిళా బిల్లు వెంటనే అమల్లోకి వచ్చేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అమలు చేయడమంటే ఎన్నికల్లో లబ్ధికోసమేనని వ్యాఖ్యానించారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. బిజెపికి సహకరించేలా సిఎం కెసిఆర్ ఆలోచన ఉందని చెప్పారు. గతంలో కెసిఆర్‌ను కలిసిన నేతలందరూ ఇండియా కూటమిలో ఉన్నారని, బిజెపిని వ్యతిరేకించే పార్టీలు ఐక్యంగా ఉండాలని అన్నారు. కూనంనేని మాట్లాడుతూ ..తమ భేటీలో కాంగ్రెస్‌తో పొత్తు అంశం చర్చకు రాలేదని చెప్పారు. ఆ పార్టీతో తాము పొత్తు వద్దనుకోవడం లేదని స్పష్టం చేశారు. వామపక్షాలకు కాంగ్రెస్ సీట్లు ఇస్తుందంటూ ఊహాగానాలు వద్దని, కలిసి మాట్లాడినప్పుడు ఆ అంశం చర్చకు వస్తుందన్నారు. బిజెపి అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్గార్ పరిషత్ కేసులో మహేష్ రౌత్‌కు బెయిల్

ముంబయి : ఎల్గార్ పరిషత్ మావోయిస్టు సంబంధాల కేసులో అరెస్టయిన సామాజిక కార్యకర్త మహేశ్ రౌత్‌కు బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసి.. తన ఆదేశాలపై వారం పాటు స్టే విధించింది. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వాదన మేరకు ఈ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు న్యాయమూర్తులు ఎ.ఎస్ గడ్కరీ, షర్మిలా దేశ్‌ముఖ్‌లతో కూడిన డివిజన్ బెంచ్.. మెరిట్‌లపై బెయిల్ కోరుతూ రౌత్ చేసిన పిటిషన్‌ను తొలుత అనుమతించింది. అయితే, ఎన్ఐఏ.. సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేసేందుకు వీలుగా రెండు వారాల పాటు స్టే విధించాలని కోర్టును కోరింది. ఆ తర్వాత బెంచ్ తన ఆర్డర్‌పై వారం రోజుల పాటు స్టే విధించింది. 2018 జూన్‌లో అరెస్టయిన రౌత్.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. తనకు బెయిల్ నిరాకరిస్తూ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ బెయిల్ కోరుతూ 2022లో రౌత్ హైకోర్టును ఆశ్రయించారు.

రాజ్యసభలో ఏకగ్రీవం

(మొదటిపేజీ తరువాయి)

కాకముందే వైస్ ఛైర్మన్ ప్యానల్‌ను మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ కోసం ప్రత్యేకంగా 13 మంది మహిళా సభ్యులతో ఛైర్మన్ జగ్‌దీప్ ధనఖర్ విస్తరించారు. సభ ప్రారంభమైనప్పుడు సీట్లో కొద్దిసేపు కనిపించిన ఆయన ఆ తరువాత తప్పుకున్నారు. బిల్లుపై చర్చ ప్రారంభమైనప్పుడు అధ్యక్షస్థానంలో పిటి ఉష ఉన్నారు. న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ సభ్యురాలు రంజీత్ రంజన్ చర్చను ప్రారంభిస్తూ చట్ట సభల్లో రిజర్వేషన్లు పొందడం మహిళలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని అన్నారు. ప్రధాని మోడీ మహిళలపై సానుభూతితో రిజర్వేషన్లు ఇస్తున్నట్లు బిజెపి ప్రచారం చేసుకుంటోందని, అది వాస్తవం కాదని చెప్పారు. వాస్తవానికి మోడీ సర్కారు హయంలో మహిళల స్థితిగతులు ఎలా ఉన్నాయో దేశంలో ప్రజలందరికి తెలుసని అన్నారు. దేశ రాజధానిలో బాక్సింగ్ క్రీడాకారిణిలు చేసిన ఆందోళన, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరుగించడం. హర్యానాలో దాడులు తదితర అంశాలను ఆమె ప్రస్తావించారు. 'మాకు హక్కులు కావాలి. మీ సానుభూతి కాదు' అని ఆమె అన్నారు. బిజెపి సభ్యుడు జెపి నడ్డా మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. ఎన్నికలలో లబ్ధి పొందడమే తమ లక్ష్యమైతే తక్షణమే రిజర్వేషన్లు అమలయ్యేలా బిల్లును తెచ్చేవారమని, చెప్పారు. జనాభాలెక్కలు, నియోజకవర్గ పునర్విభజన పూర్తయిన తరువాత న్యాయవ్యవస్థ కన్నుసన్నల్లో ఆ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

మహిళా మాసంగా ప్రకటించండి : విజయసాయి రెడ్డి

సెప్టెంబర్ నెలను మహిళా మాసంగా ప్రకటించాలని వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాల్టీలు, పంచాయతీలలో మహిళలకు రిజర్వేషన్లను నూరు శాతం అమలు చేస్తున్నట్లు చెప్పారు. 73,74 రాజ్యాంగ సవరణలలో సూచించిన బెంచ్‌మార్క్‌ను రాష్ట్రంలో అధిగమించామని చెప్పారు.

మరో జుమ్లా కాకూడదు : మల్లికార్జున ఖర్గే

మోడీ ప్రభుత్వం అమలు చేసిన అనేక పథకాల తరహాలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా మరో జుమ్లా కాకూడదని కాంగ్రెస్ పార్టీపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. బిల్లు అమలుకు 2029 వరకు వేచి చూడాల్సి ఉండటం అనేక అనుమానాలకు అస్కారం కలిగిస్తోందని అన్నారు. బిల్లులో ఒబిసిలను విస్మరించారని చెప్పారు. ఇన్ని లోపాలున్నప్పటికీ బిల్లుకు మద్దతిస్తుండటం మహిళా రిజర్వేషన్ల పట్ల తమ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.



మీకోసం

పెరుగు పచ్చడి తాలింపు వేసేటప్పుడు నూనెలో ఒక చెంచా నెయ్యి వేస్తే చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

ఓటమిని అంగీకరించేవారే విజయానికి దగ్గరవుతారు.



మోసకారి నక్క

ఒక చెరువులో చేపలు, కప్పలు, తాబేలు, మొసలి ఎంతో స్నేహంగా ఉండేవి. ఆ చెరువు ఒడ్డున గల చెట్టు పై ఉన్న ఓ చిలుక కూడా వీటితో సఖ్యతగా ఉండేది.


ఒకసారి ఆ చెరువులో నీటిని తాగడానికి ఓ నక్క వచ్చింది. అది నీటిలోకి దిగిన వెంటనే మొసలి దాని కాలును పట్టుకుంది. అప్పుడు నక్క 'అయ్యో మొసలి మామా! నేను నీకు ఏదైనా సాయం చేద్దామని వచ్చాను. నన్ను పట్టుకుంటావేమిటి? నీకు ఏం కావాలో అడుగు. నేను వాటిని తెచ్చిస్తాను. నన్ను వదిలిపెట్టు' అంది. అది విన్న మొసలి 'నాకు కొన్ని పండ్లు కావాలి. తెచ్చివ్వగలవా' అంది. 'ఓ, తప్పకుండా తెస్తాను. ముందు నన్ను వదిలిపెట్టు' అంది నక్క. అప్పుడు మొసలి దాన్ని వదిలిపెట్టింది. కానీ ఎంతకూ తిరిగి రాలేదు .

అప్పుడు చెట్టుపైగల చిలుక 'ఓ మొసలి మిత్రమా! నువ్వు నక్కను ఎందుకు వదిలి పెట్టావు? అది వట్టి అబద్ధాలకోరు. అది పండ్లు తెస్తుందంటే ఎలా నమ్మావు' అంది.

'ఈసారి మాత్రం నక్క మాటలను నేను అసలు నమ్మను' అంది మొసలి. కొన్ని రోజులకు నక్క మళ్లీ చెరువుగట్టుకు వచ్చింది. విచారంగా ముఖం పెట్టి 'మొసలి మిత్రమా.. నేను పండ్లు తెద్దామని ఎంతో ప్రయత్నించాను. కాని వాటిని కోతులు తినేశాయంట. ఈసారి తప్పకుండా తెస్తాను. సరేనా' అనగానే మొసలి ఆ మాటలు నిజమేనని నమ్మేసింది. ఇలా చాలా రోజులపాటు నక్క మొసలిని నమ్మించి, చెరువులో నీరు తాగటంతో నాటు చేపలనూ తినేసేది.

ఇదంతా గమనిస్తున్న చిలుక ఒకరోజు మొసలితో జరిగిన విషయాన్ని చెప్పింది. కప్పలు, తాబేలు ఇతర చేపలు కూడా ఈ విషయాన్ని విన్నాయి. 'అయ్యో! మొసలి మిత్రమా... నీ అమాయకత్వం వల్ల మన నేస్తాలైన చేపలను పోగొట్టుకుంటున్నాం. మా మాటలు విను. మిత్రుడుగా నటిస్తున్న మోసకారి నక్క మాటలు నమ్మకు' అని హితబోధ చేశాయి. అప్పుడు తన చేప మిత్రులను తినేస్తున్న నక్కను ఆ రోజు నుండి మొసలి చెరువు వైపు రానీయకుండా కట్టడి చేసింది.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535



పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన తెలుగు మాటలకు సమాన అర్థం వచ్చే వేరే పదాలు కూడా ఉన్నాయి. అవన్నీ ఒకే అక్షరంతో మొదలవుతాయి . ఇచ్చిన క్లూ ఆధారంగా ఆ పదాలను రాయండి.

కాంతి	వృశ్చికము
తడి	తారీఖు
రథము	మధురం

నేను గీసిన బొమ్మ



అబూబకర్ సిద్ధిక్,
3 వతరగతి,
జడ్పీ హైస్కూల్,
మైదుకూరు కడప జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

న్యాయం కోసం ఎదురుచూపు!



స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ల తరువాత మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి తామే పచ్చ జెండా ఊపామని గప్పాలు పలుకుతున్నారు పాలకులు. ప్రభుత్వమేదైనా, పాలకులెవరైనా దేశంలో మహిళలు, ముఖ్యంగా అత్యాచార బాధితులకు ఈ సమంతైనా న్యాయం జరగడం లేదన్నది అక్షర సత్యం. నిందితులకు శిక్ష పడడం కోసం దశాబ్దాల తరబడి వేచిచూస్తున్న ఎందరో బాధిత మహిళల్లో 70 ఏళ్ల బామ్మలు కూడా ఉంటున్నారంటే ఎంత సిగ్గుచేటు? నిందితులందరూ మరణించి కనీసం బతికున్న ఒక్కడికైనా శిక్ష పడుతుందా అని ఎదురుచూస్తున్న ఓ బామ్మ పోరాట గాథ ఇది.

భన్వారీ లాల్‌కు ఇప్పుడు 70 ఏళ్లు. రాజస్థాన్ వాసి. 30 ఏళ్ల క్రితం తనపై జరిగిన అకృత్యంపై పోరాడి పోరాడి అలసిపోయింది. ఘోరం జరిగిన నాటి నుండి ఇప్పటి వరకు ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొంది. ఎంతో ధైర్యంగా పోరాడిన ఆమెకు న్యాయం దొరక్కపోవడంతో ఇప్పుడు చాలా దిగాలు పడిపోతోంది. పెచ్చులూడిపోతున్న మట్టి ఇంట్లో... నులక మంచంపై దీనంగా కూర్చోన్న ఆమె, ప్రస్తుతం దేశంలో మహిళలపై జరుగుతున్న దారుణాలు చూస్తుంటే మనసు తరుక్కుపోతోంది అంటోంది. 'నాకు న్యాయం జరుగుతుందని ఎంతో ఎదురుచూశాను. కానీ, నేరం చేసిన వాళ్లు అప్పుడూ, ఇప్పుడూ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. బాధితులమైన మేము మాత్రం నానా అవస్థలు పడుతున్నాం' అని ఆవేదన చెందుతోంది. 'ఈ దేశం ఆడపిల్లలకు న్యాయం చేయడంలో ఎప్పుడూ వెనుకడుగు వేస్తూనే ఉంది' అంటూ గద్గద స్వరంతో తనకేం జరిగిందో చెప్పడం ప్రారంభించింది.

ఆమె కథ ఇలా మొదలైంది!

బాల్య వివాహానికి గురైన భన్వారీ తన రాష్ట్రంలో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసే బృహత్తర కార్యక్రమంలో భాగమైంది. 'సాథీ'గా పిలవబడుతూ తన చుట్టూ జరుగుతున్న ఎన్నో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసింది. ప్రజలను చైతన్యపరిచేందుకు ఇంటింటికీ తిరిగేది. అయితే ఆమె జీవితాన్ని తలకిందులు చేసిన ఘటన ఓ రోజు జరిగింది. 'ఆ రోజు మా ఇంటిపక్కనే ఉంటున్న కుటుంబంలో 9 నెలల పసిబిడ్డకు ఓ ఏడాది వయసున్న పిల్లాడికి ఇచ్చి పెళ్లి చేస్తున్నారని తెలిసి తల్లడిల్లిపోయాను. ఎలాగైనా ఆ వివాహాన్ని ఆపాలని ఎంతో ప్రయత్నించాను. అయినా ఆపలేకపోయాను' అంటూ ఆ రోజు జరిగిన సంఘటన గుర్తు చేసుకుంది.

పెళ్లి ఆపే ప్రయత్నం చేసినందుకు ఆ ఇంటి పెద్దలు కన్నెర్ర చేశారు. 1992 సెప్టెంబరు.. పశువులకు గడ్డి కోసేందుకు భన్వారీ, ఆమె భర్త పొలానికి వెళ్లారు. అప్పుడు ఊరిపెద్ద, ఆ ఇంటి పెద్ద, అతని మేనల్లుడు, బావమరుదులు ఆమెపై దాడికి తెగబడ్డారు. మొదట ఆమె భర్తపై దాడి చేశారు. తరువాత ఆమెపై విరుచుకుపడ్డారు. 'అప్పుడు నేను నీలం రంగు లెహంగా కట్టుకున్నాను. నా దుప్పట్టాతో నోరు నొక్కేసి, నా కాళ్లు చేతులు గట్టిగా పట్టుకుని ఒక్కొక్కరిగా నాపై లైంగిక దాడి చేశారు. వెళ్లిపోతూ నా చెవిదిద్దులు, మెడలో గొలుసు తెంచుకుని పోయారు. చెవుల వెంట రక్తం ధారలా కారింది. మెడపై గాయాలయ్యాయి. ఈ అన్యాయంపై ఫిర్యాదు చేయాలని, 10 కిలోమీటర్ల దూరంలోని పోలీసుస్టేషనుకు వెళ్లాను.'

కేసు నమోదు నుంచి కోర్టు విచారణ

వైద్య పరీక్షలు చేసిన తరువాతే కేసు తీసుకుంటామని పోలీసులు అన్నారు. అయితే అక్కడ మహిళా వైద్యురాలు లేకపోవడంతో ఆ రాత్రి ఆమెను జయపూర్‌కు తరలించారు. అప్పటికే బాగా పొద్దుపోయింది. మెజిస్ట్రేట్ ఉత్తర్వులు లేవని ఆ రోజు పరీక్షలు నిర్వహించలేదు. భన్వారీ, ఆమె భర్త రాత్రంతా పోలీసుస్టేషనులోనే గడిపారు. ఇంటి దగ్గర పిల్లలు గుర్తుకొచ్చి ఆమెకు ఒక్కసారిగా దు:ఖం కట్టలు తెంచుకుంది. అప్పటికే భన్వారీ పెద్ద కూతురికి పెళ్లయ్యింది. 'సాథీ'గా మారిన తరువాత చిన్న కూతురుకు పెళ్లి చేయకుండా ఉన్నత చదువులు చదివించాలని కలలు కంటోంది. మగపిల్లలిద్దరూ ఇంకా స్కూలుకు వెళ్లడం లేదు.

'పరీక్షల కోసం నా నీలం రంగు లెహంగా ఇవ్వమన్నారు. అది తప్ప నా దగ్గర మరో వస్త్రం లేదు. దీంతో రక్తంతో తడిసిన నా భర్త పంచెను నడుం చుట్టూ చుట్టుకుని లెహంగా వారికిచ్చేశాను. అయితే పోలీసులు నా మెడ, చెవిపై ఉన్న గాయాలను, చిరిగిపోయిన నా జాకెట్టును పరిగణనలోకి తీసుకోకుండానే ఎఫ్ఐఆర్ నమోదుచేశారు' అని ఆమె చెప్పింది.

ఆ కేసు ఓ సంచలనం

ఈ కేసు గురించి అప్పట్లో మీడియాలో పెద్దఎత్తున వార్తా కథనాలు వచ్చాయి. చాలాకాలం వరకు పోలీసులు నిందితులను అరెస్టు



చేయలేదు. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున మహిళా సంఘాలు ఆందోళనలు చేశాయి. ఓ మారుమూల గ్రామం నుంచి నిరక్షరాస్య మహిళా చేస్తున్న పోరాటానికి అండగా అనేకమంది ముందుకువచ్చారు. ఆమె చెబుతున్నది నిజమేనని జాతీయ మహిళా కమిషన్ కూడా నిర్ధారణ చేసింది. భన్వారీ ధీరత్వాన్ని ప్రశంసిస్తూ జాతీయ, అంతర్జాతీయ పత్రికలు రాశాయి. పలు వేదికలపై ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడింది. ఒక పక్క పోరాటం చేస్తూనే మరోపక్క బాల్యవివాహాల నియంత్రణలో తన పనిని కొనసాగించింది. అయితే, గ్రామ పెత్తందారులు ఆమెను వెలి వేశారు. పాలు, పిండి ఇవ్వకుండా కట్టడిచేశారు. పిల్లలు ఆకలితో అల్లాడిపోయారు. నిందితులకు అండగా రాజకీయ నాయకులు నిలిచారు. చంపుతామని బెదిరించారు. అయినా ఆమె తొణకలేదు.

విచారణలో నిలువెల్లా కంపించిపోయింది


'దాడి జరుగుతున్నప్పుడు నువ్వు ఏ స్థితిలో ఉన్నావు? మొదట ఎవరు దాడి చేశారు? వంటి ప్రశ్నలెన్నింటినో ఆమె విచారణలో ఎదుర్కొంది. ఈ విచారణంతా రహస్యంగా ఉంచాల్సిన యంత్రాంగం ఆమెను అవమానించాలని బయటికి చెప్పేసింది. దీంతో గ్రామంలో ఆమె బతుకు ఒక ఎగతాళి ఉదంతంగా మారిపోయింది. "అప్పుడు నా పిల్లలు చదువుకోకుండా ఇంటికే పరిమితమయ్యారు. వందలసార్లు కోర్టు మెట్లెక్కాను. జరిగిన అన్యాయాన్ని పదేపదే గొంతుచించుకుని చెప్పాను. ఘటన జరిగిన మూడేళ్లకు విచారణ తుది దశకు చేరుకుంది."

తీర్పులో ఏం చెప్పారంటే ...

ఇంత పోరాటం తరవాత వెలువడ్డ తీర్పు చాలా విచిత్రంగా ఉంది. 'గ్యాంగ్‌రేప్ జరిగిన తీరుపై బాధితురాలు చెబుతున్న అంశాలు నమ్మశక్యంగా లేవు. మేనల్లుడు, మేనమామ కలిసి అత్యాచారం చేయరు. భిన్న కమ్యూనిటీలకు చెందిన పురుషులు బృందంగా కలిసి అత్యాచారానికి పాల్పడరు. 73 ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి తెగబడడు. తన కళ్లెదుటే భార్యను అత్యాచారం చేస్తుంటే ఏ భర్తా చూస్తూ ఊరుకోడు. ఇక గ్రామపెద్దగా ఉన్న వ్యక్తి ఎప్పటికీ అత్యాచారం చేయడు' ఇలా చెప్పి... నిందితులను నిర్దోషులుగా తేల్చేశారు.

'ఆరోజు.. నిందితులందరూ బయటికి వచ్చిన క్షణం, నా వెన్నులో వణుకుపుట్టింది. గ్రామంలో సంబరాలు చేశారు. టపాకాయలు కాల్చారు. పూలమాలలతో స్వాగతాలు పలికారు. విజయోత్సవ ర్యాలీ చేశారు. భన్వారీని మా చేతులకు అప్పగించండి.. లేకపోతే మీరైనా ఆమెను సజీవంగా కాల్చేయండి' అంటూ చాటింపు వేశారు. అప్పటి నుంచి నేను, నా కుటుంబం భయంతో గడిపాం. నా పిల్లలే నన్ను అసహ్యించుకునేలా చేశారు' అని ఆమె వివరించింది. అయినా, భన్వారీ వదిలి పెట్టలేదు. 1996లో న్యాయం కోసం మరోసారి అప్పీలు చేసింది.


ఇన్నేళ్లు గడిచినా ఆమెకు న్యాయం జరగలేదు. నిందితుల్లో ఒక్కరే ఇప్పుడు జీవించి వున్నారు. అతనికి శిక్ష పడాలని ఆమె ఎదురుచూస్తోంది. జీవితకాలం ఎదురుచూసినా న్యాయం జరగని భన్వారీ లాంటి మహిళలు దేశంలో ఎంతోమంది ఉన్నారు. బాధితులకు న్యాయం చేయకుండా ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం లేదు!



'శర్వానంద్ 35' కృతిశెట్టి

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న చిత్రాల్లో శర్వానంద్ 35వ సినిమా ఒకటి. శ్రీరామ్ ఆదిత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కృతిశెట్టి ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడిగా నటిస్తున్నారు. గురువారం కృతిశెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చిత్రం నుండి స్పెషల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. ఒక షెడ్యూల్ మినహా మిగతా షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు.

నటీమణుల పార్లమెంటు ప్రదర్శన



ప్రధానమంత్రి కార్యాలయం ఆహ్వానం మేరకు కొందరు సినీ నటీమణులు గురువారం పార్లమెంట్ కొత్త భవనాన్ని సందర్శించారు. ఇందులో తమన్నా, ఖుష్బూ, మంచు లక్ష్మి, విద్యాబాలన్ ఇంకా మిగతా పరిశ్రమల నుండి కూడా చాలామంది నటీమణులు వచ్చారు. ప్రధానమంత్రి కార్యాలయంలో వీరందరూ కలిపి ఒక ఫొటో తీసుకున్నారు. ఈ ఫొటోని ఖుష్బూ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. పార్లమెంట్లో మహిళా బిల్లు సందర్భంగా వీరికి ఆహ్వానం అందింది.

ఇది నిజం కాదు




దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామితో నటి సాయిపల్లవి దండలతో ఉన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఆమెకు వివాహం అయినట్లుగా కొందరు కామెంట్లు సైతం పెడుతున్నారు. నటుడు శివ కార్తికేయన్‌తో కలిసి సాయి పల్లవి నటిస్తున్నారు. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించనున్నారు. 'ఎస్‌కె21' అనే వర్కింగ్ టైటిల్‌తో ఇది రూపొందుతోంది. ఈ సినిమా పూజా కార్యక్రమంలో భాగంగా చిత్రబృందంతో పాటు సాయిపల్లవి, దర్శకుడు కూడా మెడలో దండలు వేసుకుని ఫొటోలు దిగారు. ఇప్పుడు ఆ ఫొటోను షేర్ చేస్తూ ఆమె పెళ్లి అంటూ కొందరు ఊహాగానాలు సృష్టించారు. 'విరాటపర్వం' దర్శకుడు వేణు ఊడుగుల స్పందిస్తూ ఆ ఫొటో సినిమా ప్రారంభం సందర్భంగా తీయించిందని తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.



యూట్యూబర్ దర్శకత్వంలో నయనతార

నయనతార, యోగిబాబు కాంబినేషనల్‌లో తాజాగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'మన్నాంగట్టి సిన్స్ 1960' టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ ఎస్.లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా యూట్యూబ్ విక్కీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దేవదర్శిని, గౌరి కిషన్, నరేంద్ర ప్రసాద్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న 10వ చిత్రం ఇది. విక్కీ కూడా ఇప్పటికే రెండు చిన్న సినిమాలను తెరకెక్కించారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌పోస్టర్, మోషన్ పోస్టర్‌ను చిత్ర వర్గాలు విడుదల చేశాయి. చిత్ర షూటింగ్ త్వరలో ప్రారంభంకానుంది.



'టైగర్ నాగేశ్వరరావు' హీరో ఎలివేషన్ పాట

రవితేజ, నుపూర్ సనన్ జంటగా వంశీ దర్శకత్వంలో తెరకెక్కిన 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం నుండి తాజాగా ఓ పాట విడుదలైంది. 'అందరు ఆగిపోయిన చోట.. మొదలవుతాడు వీడు. అందరిని భయపెట్టే చీకటినే భయపెడతాడు వీడు. అవసరం అనుకుంటే తన నీడను వదిలేస్తాడు వీడు..' అంటూ హీరో క్యారెక్టర్‌ను ఎలివేట్ చేస్తూ.. చంద్రబోస్, ఉమాదేవి రాసిన లిరిక్స్‌కు అనురాగ్ కులకర్ణి గాత్రం అందించారు. స్టువర్టుపురం గజదొంగ టైగర్ నాగేశ్వరరావు జీవితంలో జరిగిన సంఘటనలు.. కొన్ని రూమర్స్ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రంతో రేణు దేశాయ్ రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందించారు.

విజయ్, షారూక్‌తో కలిసి సినిమా తీస్తా : అట్లీ



త్వరలో విజయ్ దళపతి, షారూక్‌ఖాన్‌తో కలిసి మల్టీస్టారర్ సినిమా చేయబోతున్నానని తమిళ దర్శకుడు అట్లీ వెల్లడించారు. తాజాగా 'జవాన్'తో సూపర్ హిట్ కావటంతో మీడియాతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. "షారుక్‌తో సినిమా తీస్తున్నానంటే తొలుత విజయ్ నమ్మలేదు. ఆయనతో సినిమా చేయడం ఏ దర్శకుడికైనా జీవితకాల కల. అలాంటిది ఆయనే నాకు ఫోన్ చేసి సినిమా తీయాలని అడగడంతో సంతోషంతో పాటు ఆశ్చర్యం వేసింది. వెంటనే ఈ విషయాన్ని దళపతి విజయ్‌కు చెప్పాను. 'సీరియస్‌గానే చెబుతున్నావా? షారుక్ నీతో సినిమా చేయాలనుందని అడిగారా?' అన్నారు. అవునని చెప్పగానే నన్ను ప్రోత్సహించారు." అని చెప్పారు. మల్టీ స్టారర్ చిత్రానికి ఇద్దరు హీరోలూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు.

షెఫాలీ, రోడ్రిగ్స్ మెరుపులు

- మలేషియాతో మ్యాచ్ రద్దు
- సెమీస్‌కు భారత మహిళలజట్టు

19వ ఆసియా క్రీడలు చైనాలోని హాంగ్జౌ వేదికగా రేపటినుంచి ప్రారంభం కానున్నాయి. 2018లో ఇండోనేషియాలోని జకార్తా వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో భారత్ 69 పతకాలతో 8వ స్థానంలో నిలిచింది. ఈసారి సెంచరీపై కన్నేసిన భారత్ ఏకంగా 655మంది అథ్లెట్లతో బరిలోకి దిగనుంది. షెడ్యూల్ ప్రకారం 2022లో జరగాల్సిన ఆసియా క్రీడలు.. కరోనా నేపథ్యంలో ఈ ఏడాది జరుగుతున్నాయి.



19వ ఆసియా క్రీడలు రేపటినుంచే..



షఫాలీ వర్మ(67)

హాంగ్జౌ(చైనా): భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా క్రీడల్లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మలేషియాతో బుధవారం జరగాల్సిన మ్యాచ్ భారత ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత వర్షం కారణంగా రద్దు అయ్యింది. దీంతో స్మృతి మంధాన సారథ్యంలోని భారతజట్టు నేరుగా సెమీస్‌కు చేరింది. కెప్టెన్ మంధాన(27) త్వరగా ఔటైనా.. మరో ఓపెనర్ షెఫాలీ వర్మ(67), జెమీమా రోడ్రిగ్స్(47నాటౌట్), రీచా ఘోష్(21నాటౌట్) రాణించడంతో భారత్ నిర్ణీత 15 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 173పరుగులు చేసింది. ఆ తర్వాత మలేషియా ఇన్నింగ్స్ మొదలయ్యాక 2 బంతుల్లో ఒక పరుగులు చేసిన తర్వాత భారీ వర్షంతో మ్యాచ్ నిలిచిపోయింది. దాంతో, రిఫరీలు భారత్‌ను విజేతగా ప్రకటించారు. భారత్, మలేషియా మ్యాచ్‌కు వరుణుడు ఆదిలోనే అడ్డుపడ్డాడు. దాంతో, టాస్ ఆలస్యంగా వేశారు. టాస్ గెలిచిన మలేషియా కెప్టెన్ వినిఫ్రెడ్ దురాయ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కానీ, టీమిండియా ప్లేయర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి 90 బంతుల్లోనే 171పరుగులు చేయడంతో రన్‌రేట్ అమాంతం పెరిగిపోయింది. తొలిసారి ఈ మెగా టోర్నీలో ఆడుతున్న భారత జట్టు టైటిల్‌పై కన్నేసింది. సెమీస్ పోరుకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అందుబాటులో ఉండనుంది. బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌లో దురుసు ప్రవర్తనతో హర్మన్‌ప్రీత్‌పై ఐసిసి నిషేధం విధించిన విషయం తెలిసిందే.

ఫుట్‌బాల్‌లో నాకౌట్ ఆశలు సజీవం

పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఆసియా క్రీడల్లో బోణీ కొట్టింది. నాకౌట్ రేసులో నిలవాలంటే తప్పని మ్యాచ్‌లో గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై అద్భుత విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన గ్రూప్-ఎ రెండో లీగ్ పోటీలో భారత్ 1-0తో బంగ్లాను చిత్తు చేసింది. కెప్టెన్ సునీల్ ఛెత్రీ గోల్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు. దాంతో భారతజట్టు నాకౌట్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. 24న భారత జట్టు మయన్మార్‌ను ఢీకొట్టనుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య చైనా చేతిలో 5-1గోల్స్‌తో ఓడిన సంగతి తెలిసిందే. ఇక మహిళల ఫుట్‌బాల్ జట్టు 1-2గోల్స్ తేడాతో చైనీస్ తైపీ చేతిలో ఓడింది.

అశ్విన్, సుందర్ మాయ మెప్పించేనా?

నేడు ఆస్ట్రేలియాతో తొలి వన్డే



మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి

మొహాలీ: ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు ముందు జరిగే భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్డే సిరీస్ జరగనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా మొహాలీలో జరిగే తొలి వన్డేలో ఆస్ట్రేలియాతో పోరుకు భారత్ సిద్ధమైంది. రోహిత్ శర్మ, కోహ్లి తొలి రెండు వన్డేలకు విశ్రాంతి తీసుకోగా.. కేఎల్ రాహుల్ సారథ్యంలోని భారతజట్టు తొలి పరీక్షను ఎదుర్కోనుంది. ఈ సిరీస్‌ను నెగ్గి వన్డేల్లో భారతజట్టు అగ్రస్థానానికి ఎగబాకే అవకాశముంది. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే ప్రపంచ కప్ పోటీల్లో భారతజట్టు టాప్ ర్యాంక్‌తో బరిలోకి దిగనుంది. ఇప్పటికే టీమిండియా టెస్టులు, టి20ల్లో టాప్‌లో ఉన్న సంగతి తెలిసిందే. రాహుల్, బుమ్రా, షమీలకు ఈ సిరీస్ కీలకం కానుంది. మరోవైపు దక్షిణాఫ్రికా పర్యటనలో టి20 సిరీస్‌ను చేజిక్కించుకున్న ఆసీస్ జట్టు వన్డే సిరీస్‌లో అనూహ్యంగా ఓటమిపాలైంది. ఓపెనర్ డేవిడ్ వార్నర్, మార్నస్ లబూషేన్‌లకు ఈ సిరీస్ కీలకంగా మారింది. మిచెల్ స్టార్క్, ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ గాయంతో తొలి వన్డేకు దూరం అయ్యారు. దాంతో, రాహుల్ సేనకు ఆస్ట్రేలియాను ఓడించేందుకు ఇది మంచి చాన్స్.

జట్లు(అంచనా):

భారత్: కెఎల్ రాహుల్ (కెప్టెన్, వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శుభ్‌మన్, శ్రేయస్, సూర్యకుమార్, జడేజా, సుందర్, అశ్విన్, షమి, సిరాజ్, బుమ్రా.

ఆస్ట్రేలియా: కమిన్స్(కెప్టెన్), వార్నర్, మార్ష్, స్మిత్, లబూషేన్, కేరీ(వికెట్ కీపర్), గ్రీన్, స్టోయినిస్, జాన్సన్, జంపా, హేజిల్‌వుడ్.



హైదరాబాద్ చేరిన వన్డే ప్రపంచకప్ ట్రోఫీ

నేడు చార్మినార్, ఉప్పల్‌లో ప్రదర్శన!

హైదరాబాద్: ఐసిసి వన్డే ప్రపంచకప్ ట్రోఫీ బుధవారం హైదరాబాద్ చేరుకుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ కప్పును ప్రదర్శించారు. గురువారం చార్మినార్, ఉప్పల్ క్రికెట్ మైదానంలో ప్రపంచకప్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచకప్ విజేతలకు అందించే ఈ ట్రోఫీకి ఘన చరిత్ర ఉంది. 1999 ప్రపంచకప్ నుంచి ఇప్పుడున్న ట్రోఫినే విజేతలకు అందజేస్తున్నారు. ఛాంపియన్ జట్టుకు మొదట ఈ ట్రోఫీని ప్రదానం చేసి.. అనంతరం దీని నమూనాను ఇస్తున్నారు. నిజమైన ట్రోఫీ కింది భాగంలో విజేత జట్ల పేర్లను రాస్తున్నారు. ప్రస్తుత ట్రోఫీని లండన్‌లోని గరార్డ్ అండ్ కో అనే ఆభరణాల సంస్థ తయారుచేసింది. దీని తయారీలో బంగారం, వెండి ఉపయోగించారు. ఇది 60 సెంటీమీటర్ల ఎత్తుతో పాటు 11 కిలోల బరువు ఉంటుంది. ఏ కోణం నుంచి చూసినా ఒకేలా కనిపించడం దీని ప్రత్యేకత. మూడు వైపులా పొడుగ్గా ఉండే వెండి స్టంప్స్, బెయిల్స్ మీద బంగారు గ్లోబ్ రూపంలో బంతి పొదిగి ఉన్నట్లు ఉంటుంది. క్రికెట్లోని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లను ఈ మూడు స్టంప్స్ ప్రతిబింబిస్తాయి. ఇక 1999 ప్రపంచకప్ ముందు నాలుగు రకాల ట్రోఫీలను మార్చారు. ఇంగ్లండ్‌లో జరిగిన తొలి మూడు (1975, 1979, 1983) ప్రపంచకప్‌ల్లోనూ ఒకే రకమైన ట్రోఫీని అందజేశారు. స్పాన్సర్‌షిప్ కారణంగా ప్రుడెన్షియల్ కప్‌గా నిర్వహిస్తున్నారు. తొలిసారి ఇంగ్లండ్ బయట 1987లో ప్రపంచకప్ నిర్వహించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68